fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 33 | విజయవాడ, శనివారం 3 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

మరో నిరుద్యోగి ఆత్మహత్య



సాయికుమార్ ఫైల్‌ఫొటో

ప్రజాశక్తి- హిరమండలం (శ్రీకాకుళం)

ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం రాలేదని మనస్తాపం చెందిన అనంతపురం జిల్లా హిందూపురానికి చెందిన ఓ యువకుడు ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సంఘటన మరువక ముందే మరో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మిగతా 9లో

దలాల్ స్ట్రీట్‌లో 'బడ్జెట్' కన్నీరు

- సెన్సెక్స్ 840 పాయింట్లు నష్టం
- 5 లక్షల కోట్ల సంపద ఆవిరి
- రెండున్నరేళ్లలోనే అతిపెద్ద క్షీణత
- బిట్ కాయిన్ విలువ ఫట్

ముంబయి : ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన 2018-19 బడ్జెట్ గత రెండున్నర ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా మార్కెట్లను కుదేలు చేసింది. గత కొద్ది రోజులుగా తారాజువ్వలా ఎగిసిన సూచీలు శుక్రవారం అమాంతం పడిపోయాయి. దీర్ఘకాల మూలధన లాభాల (ఎల్‌టిసిజి)పై 10 శాతం పన్ను ప్రవేశపెట్టడం మదుపర్లకు రుచించలేదు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దేశం 7.5 శాతం వృద్ధిరేటును సాధించనుందని, ఇదే సమయంలో విత్త లోటు పెరగనుందన్న పరస్పర విరుద్ధ ప్రకటనలు మదుపర్లను అయోమయానికి గురి చేయడంతో పాటు ఆర్థిక వ్యవస్థపై అనుమానాలను రేకెత్తించాయి. ఇతర ఆసియన్ మార్కెట్లు పడిపోవడం తదితర పరిణామాల వల్ల బిఎస్‌ఇ సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్లు పైగా కోల్పోగా తుదకు 840 పాయింట్లు లేదా 2.34 శాతం నష్టంతో 35,066కు దిగజారింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 256.30 పాయింట్లు లేదా 2.33 శాతం క్షీణించి 10,760.60కు పడిపోయింది. బిఎస్‌ఇలోని అన్ని రంగాలు నష్టాలు చవి చూశాయి.

భారత్‌లో క్రిప్టో కరెన్సీలకు చట్టబద్ధత లేని మంత్రి జైట్లీ ప్రకటించడంతో ప్రపంచ వ్యాప్తంగా బిట్ కాయిన్ విలువ ఒక్క రోజులోనే 112 బిలియన్ డాలర్లు కరిగిపోయింది. గతేడాది డిసెంబర్ మధ్య నాటికి దీని విలువ గరిష్టంగా 20వేల డాలర్ల సమీపంలో నమోదయిన విషయం తెలిసిందే. కాగా తాజాగా ఇతర డిజిటల్ కరెన్సీలు ఇతెరియం, రిపల్ విలువలు కూడా 22 శాతం, 32 శాతం చొప్పున పతనమయ్యాయి.

ఎలక్టోరల్ బాండ్లపై సిపిఎం పిటిషన్



- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు
- కార్పొరేట్లను రక్షించేందుకే బాండ్లు
- ఇది రాజ్యాంగ వ్యతిరేకం
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్పొరేట్లను రక్షించేందుకే కేంద్రం ఎలక్టోరల్ బాండ్ల విధానం తీసుకొచ్చిందని, ఈ చర్య భారత రాజ్యాంగానికి వ్యతిరేకమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. ఈ మేరకు ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని సవాల్ చేస్తూ శుక్రవారం నాడు సిపిఎంతో పాటు.. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కూడా సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను అనుమతించిన సర్వోన్నత ధర్మాసనం విచారణ చేపట్టింది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల్లో ఎలక్టోరల్ బాండ్ల మిగతా 8లో

తేల్చుకుందాం...తొందరొద్దు




- టిడిపి నాయకత్వానికి సిఎం సూచన
- ఆవేశపడితే నష్టపోతామని హెచ్చరిక
- ఎన్నికలకు సిద్ధమవ్వాలని సూచన

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి, అమరావతి బ్యూరో, న్యూఢిల్లీ

బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై కేంద్రంతో తేల్చుకుందామని అదే సమయంలో తొందరపడి ప్రకటనలు చేయొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పార్టీ నాయకత్వానికి సూచించారు. శుక్రవారం ఆయన టిడిపి సమన్వయ కమిటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం మంత్రి మండలి సమావేశం నిర్వహించారు. ఈ రెండు సమావేశాల్లోనూ కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని ప్రజలకు అర్థమైందని, పలు సర్వేల్లోనూ ఇది కనిపించిందని, అయినా తొందరపడి నోరు జారొద్దని హెచ్చరించారు. బడ్జెట్‌పై ఎంపిలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అన్ని జిల్లాల నుండి అభిప్రాయ సేకరణ చేసి, ఆదివారం మరోసారి ఎంపిలతోనూ మాట్లాడిన తరువాత తుది నిర్ణయం తీసుకుందామని బాబు సూచించారు. బడ్జెట్‌పై కేంద్రంతో ఆచీతూచీ వ్యవహరించాలని, తాడు తెంచుకుపోతామని అనుకుంటే ఎలా అని క్యాబినెట్లో మంత్రులతో అన్నట్లు తెలిసింది. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నా కేంద్రం పై ఒత్తిడి చేయడమే మార్గమని, దీన్ని ఎలా చేయాలనే అంశంపై ఆలోచన చేయాలనీ మంత్రివర్గంలో నిర్ణయించినట్లు సమాచారం. సున్నితమైన విషయంలో కావాలని కొందరు రాజకీయం చేస్తుంటారని, జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి మంత్రులకు సూచించారు. తొలుత రాష్ట్రం మిగతా 9లో

ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోండి

పార్లమెంట్‌లో కెవిపి నిరసన 9





9

రైల్వే జోన్ ప్రకటించాలి

రైల్వే మంత్రి గోయల్‌కు ఉత్తరాంధ్ర వేదిక వినతి

బిజెపికి పొగరు... ఇక తెగదెంపులే

టిడిపి ఎంపి టిజి వెంకటేష్

వైద్యానికి ప్రపంచ బ్యాంకు నిధులు



- డ్రోన్, కంటెంట్ కార్పొరేషన్ల ఏర్పాటు
- గుంటూరులో 597 పడకలతో ప్రసూతి వైద్యశాల
- ఎపి పోలీసు రిఫార్మ్స్ ఆర్డినెన్స్-2017 బిల్లు
- మంత్రి మండలి నిర్ణయాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య రంగంలో సదుపాయాల కల్పనకు ప్రపంచబ్యాంకు రుణం తీసుకునేందుకు మంత్రిమండలి అంగీకరించింది. రాష్ట్రంలో ఎంపి కంటెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. పోలీసు రిఫార్మ్స్ ఆర్డినెన్స్-2017కు, గుంటూరులో 597 పడకల ప్రసూతి ఆస్పత్రికి ఆమోదం తెలిపింది. పట్టణ ప్రాంతాల్లో గృహ నిర్మాణానికి రూ.38 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. శుక్రవారం వెలగపూడిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు కాలువ శ్రీనివాసులు, కళా వెంకట్రావు, నారాయణ వివరించారు. అమరావతికి మెట్రో రైలు నిధులివ్వకపోవడంపై సిఎం ఆసక్తి కర వ్యాఖ్యలు చేశారు. అది పల్లెకాదూ, పట్టణమూ కాదని అన్నారు. కేంద్రానికి కూడా అదే భావన ఉండొచ్చని అందుకే నిధులు కేటాయించలేదని అన్నట్లు తెలిసింది. నీరుకొండపై ఏర్పాటు చేయ తలపెట్టిన ఎన్‌టిఆర్ విగ్రహ నమూనాలపై సిఆర్‌డిఏ ఇచ్చిన ప్రజెంటేషన్‌ను చూసి తరువాత నిర్ణయిద్దామని సూచించారు. ఎపిఎఫ్‌ఎస్‌ఎల్‌కు సబ్సిడరీగా కంటెంట్ కార్పొరేషన్ పనిచేయనుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో నిరంతరం పరిశోధన అవసరమని, కంటెంట్ కార్పొరేషన్ ఈ బాధ్యత చూస్తుందని పేర్కొంది. ఎపి డ్రోన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రి మండలి అంగీకరించింది. ప్రస్తుతం పెరిగిన అవసరాలు, ప్రైవేటు వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రోన్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్ మిగతా 9లో

లిబియా తీరంలో 90 మంది జలసమాధి

ట్రిపోలి : లిబియా తీరంలో శుక్రవారం తెల్లవారు జామున స్మగ్లర్ల బోటు బోల్తా పడడంతో 90మందికి పైగా మునిగిపోయినట్లు ఐక్యరాజ్య సమితి మైగ్రేషన్ సంస్థ తెలిపింది. ఈ బోటులో 8మంది పాకిస్తానీ వలసవాదులు కాగా ఇద్దరు లిబియన్ జాతీయులు వున్నారు. లిబియా పట్టణమైన జువారా సమీపానికి మృతదేహాలు కొట్టుకువచ్చాయని అంతర్జాతీయ వలసల సంస్థ ప్రతినిధి ఓలివియా హెడన్ తెలిపారు. ఇద్దరు ఒడ్డుకు ఈదుకుంటూ వచ్చారని, ఒక వ్యక్తిని చేపల బోటులోని వారు కాపాడారని హెడన్ ట్యునిస్ నుండి జెనీవాలోని విలేకర్లతో ఫోన్లో చెప్పారు. ఇంకా ఈ ప్రమాదం గురించి వివరాలు తెలియాల్సి వుందని, ప్రమాదం ఎలా జరిగిందో, ఇంకా ఎవరైనా బయటపడ్డారో లేదో తెలియరాలేదన్నారు. లిబియా మీదుగా మధ్యధరా సముద్రాన్ని దాటి ఇటలీ, యూరప్ దేశాలకు వెళ్ళేందుకు పాకిస్తానీ జాతీయులు ప్రయత్నిస్తూ వుంటారని ఆమె చెప్పారు.

దళితులపై దాడులకు నిరసనగా 23న చలో గుంటూరు

- పనులకు పిలవకపోవడం చట్ట రీత్యానేరం
- పెదగొట్టిపాడును సందర్శించిన సిపిఎం బృందం




గొట్టిపాడులో జరిగిన సభలో దళితులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

దళితులపై దాడులకు నిరసనగా ఈనెల 23న చలో గుంటూరు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడును మధు ఆధ్వర్యంలో సిపిఎం బృందం శుక్రవారం సాయంత్రం సందర్శించింది. డిసెంబరు 31, జనవరి ఒకటిన దళితులపై పెత్తందార్ల దాడి జరిగిన విషయం తెలిసిందే. దాడికి గురైన దళితులను మధు పరామర్శించిన అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం చేకూరే వరకూ అండగా పోరాటం చేస్తామని ప్రకటించారు. గొట్టిపాడు ఘటనపై ఈనెల 23న రాష్ట్రంలోని దళితులందర్నీ సమీకరించి 'చలో గుంటూరు' నిర్వహిస్తామని ప్రకటించారు. గ్రామంలో దళిత వాడలో కనీస సౌకర్యాలు లేవని, వారు తీవ్ర వివక్షతకు గురవుతున్నారన్నారు. గొట్టిపాడులో దళితులపై దాడి చేయడమే కాకుండా పెత్తందార్లు వారి పొలాల్లోకి పనులకు పిలవకపోవడం చట్ట రీత్యా నేరమన్నారు. ఇది సాంఘిక బహిష్కరణ కిందకు వస్తుందన్నారు. గ్రామంలో దళితులకు పక్కా ఇళ్లు నిర్మించాలని, పింఛన్లు అందని వారికి వెంటనే పింఛన్లు ఇవ్వాలని, దాడుల వల్ల ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని, దాడిలో గాయపడిన వారి కుటుంబాలకు చెందిన వారికి రోజుకు ఎంత కూలి ఇస్తారో అంతేకూలి సొమ్మును వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాడిలో గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి మిగతా 9లో

విద్యుత్ ఉద్యోగుల విభజన ఉత్తర్వుల్ని కొట్టివేసిన హైకోర్టు

తెలంగాణ సర్కార్ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకం అని వ్యాఖ్య



ప్రజాశక్తి - హైదరాబాద్

విద్యుత్ ఉద్యోగుల విభజనపై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఉద్యోగుల విభజనపై తెలంగాణ విద్యుత్ సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్ని హైకోర్టు కొట్టివేస్తూ తీర్పు చెప్పింది. హైకోర్టు న్యాయమూర్తులు సివి నాగార్జునరెడ్డి, ఎమ్మెస్కే జైశ్వాల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఈ కీలక తీర్పు వెలువరించింది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థానికత ప్రకారం విద్యుత్ ఉద్యోగుల విభజన చేసిన తెలంగాణ విద్యుత్ సంస్థలు జారీ చేసిన మార్గదర్శకాలు, వాటిని ఆమోదిస్తూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన జీవోలను పెద్ద సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు హైకోర్టులో సవాల్ చేశారు. వీటిని పలుసార్లు విచారించిన బెంచ్, రెండు ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కారమయ్యేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దాంతో ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత బెంచ్ తన తీర్పును గతంలో వాయిదా వేసింది. శుక్రవారం ఆ వ్యాజ్యాలపై తీర్పు చెప్పింది.

నాలుగు నెలల్లో ఉద్యోగుల విభజన పూర్తి కావాలని ఆదేశం

విద్యుత్ ఉద్యోగుల విభజన ప్రక్రియను నాలుగు మాసాల్లో పూర్తి చేయాలని తెలంగాణ, ఎపి ప్రభుత్వాలను బెంచ్ ఆదేశించింది. ఇందుకోసం మార్గదర్శకాల తయారీకి కొత్తగా కమిటీలు వేయడంగానీ లేదా ఉన్న జాయింట్ కమిటీని కొనసాగించడంగానీ చేయాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ రెండు మాసాల్లో చేయాలని, ఆ తర్వాత కమిటీలు నిర్ణయాల మేరకు నాలుగు మాసాల్లో విభజన జరగాలని తేల్చి చెప్పింది. స్థానికత ప్రకారం విభజన చెల్లదని, ఇప్పటికే రిలీవ్ చేసిన వారికి ఇతర ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు తెలంగాణ ప్రభుత్వం చెల్లించాలని, వారి సీనియార్టీని కూడా ఆమోదించాలని ఆదేశించింది. రిలీవ్ చేసిన ఉద్యోగులకు ఏపీ సర్కార్ జీతభత్యాలు ఇచ్చి ఉంటే ఆ మొత్తాన్ని లెక్క కట్టి ఏపీకి చెల్లించేయాలని తెలంగాణను బెంచ్ ఆదేశించింది. విద్యుత్ ఉద్యోగుల బదిలీ, ఎపికి కేటాయింపు చేసే అధికారం తెలంగాణకు లేదని బెంచ్ స్పష్టం చేసింది. రాష్ట్ర విభజన చట్టంలో మిగతా 9లో

పిసిసి సోషల్ మీడియాకు జిల్లా ఇన్‌ఛార్జుల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిసిసి ఐటి సెల్ సోషల్ మీడియాకు రాష్ట్రంలో జిల్లాలకు కో ఆర్డినేటర్లను నియమిస్తూ పిసిసి అధ్యక్షులు ఎన్ రఘువీరారెడ్డి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయకులంతా వీరికి సహకరించాలని సూచించారు. కొత్తగా నియమితులైన ఇన్‌ఛార్జులను విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో రఘువీరారెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు నాదెండ్ల మనోహర్ అభినందించారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బి సతీష్, విశాఖపట్నం అర్బన్, రూరల్‌కు జి మనోహర్, ఉభయగోదావరి జిల్లాలకు టి విజయ్‌కుమార్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు ఎస్‌కె మౌలాలి, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు అంబటి రామకృష్ణ, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాలకు ఎఎస్ అహ్మద్ హుస్సేన్ నియమితులయ్యారు.

పరామర్శ



గొట్టిపాడులో అగ్ర కులాల దాడిలో గాయపడిన దళితుణ్ని ఇంటికి వెళ్లి పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

ఆరు ఆర్థిక నగరాలకు ముఖ్యమంత్రి ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలు నిర్మించే ఆరు భారీ ఆర్థిక నగరాలకు (ఎకనామిక్ సిటీ) ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. సుమారు 980 ఎకరాల్లో రూ.22.28 కోట్లతో ఈ నగరాలను నిర్మించనున్నట్లు చెప్పారు. వీటిలో 1.61 లక్షల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉందన్నారు. వీటిలోనే ఉన్నత వర్గాలకు 88,987, పేద, బలహీన వర్గాలకు 75,233 నివాసాలు నిర్మిస్తారని తెలిపారు. మున్సిపల్ శాఖ, టిడ్కో అధికారులతో సిఎం సచివాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఎకనామిక్ సిటీలు నిర్మాణంపై దృష్టి సారిస్తూనే మరోవైపు ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తే ప్రోత్సహిస్తామన్నారు. విజయవాడ సమీపంలోని పినపాక-చెవుటూరు గ్రామాల్లో రూ.2,706 కోట్లతో మా లక్ష్మీ సంస్థ మంగళగిరి, అచ్చుతాపురం (విశాఖ)లలో రూ.13,580 కోట్లతో ఎల్ఇపిఎల్ సంస్థ, తాండ్రపాడు (కర్నూలు)-తడకనపల్లిలో రూ.1,667 కోట్లతో రాగమయూరి సంస్థ, వెలుగుబండ (రాజమండ్రి)లో రూ.1,821 కోట్లతో చైతన్య డవలపర్స్, వెదురువాడ (విశాఖ)లో రూ.2,496 కోట్లతో ఆర్ఎస్ బిల్డర్స్ ఎకనామిక్ సిటీలు నిర్వహించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఆమోదం తెలిపిన ప్రాజెక్టుల పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి కరికాల వలవన్ తదితరులు పాల్గొన్నారు.



నైరుతి బంగాళాఖాతంలో ఆవర్తనం

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ తమిళనాడుకు సమీపంలో 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతున్నట్లు భారత వాతావరణ శాఖ పేర్కొంది. రాష్ట్రంలోని కోస్తా, రాయలసీమల్లో నాలుగు రోజుల పాటు సాధారణ వాతావరణ పరిస్థితులే కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ఆకాశం నిర్మలంగా ఉండటంతో పగలు ఎండలు, రాత్రి పూట చలి ప్రభావం చూపిస్తాయని పేర్కొంది.

ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్లకు బదిలీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జల వనరుల శాఖలో పలువురు ఉన్నతాధికారులను బదిలీచేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం డ్యామ్ నిర్వహణ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎజి మల్లికార్జునరెడ్డిని వెలగపూడి సెక్రటేరియ ట్‌లోని జల వనరుల శాఖ కార్యాలయంలో చీఫ్ టెక్నికల్ ఇంజనీర్‌గా నియమించారు. కృష్ణా జిల్లా సిస్టం చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె శ్రీనివాస్‌ను సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ మైనర్ ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న సతీష్‌కుమార్‌ను బదిలీ చేశారు. కమీషనర్ ఆఫ్ టెండర్స్ కార్యాలయంలో సూప రింటెండెంట్ ఇంజనీర్‌గా చేస్తున్న వి శ్రీధర్‌కు పదోన్నతి కల్పిస్తూ ఆంధ్రా రీజియన్, ధవళేశ్వ రం క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. కడప చీఫ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కె వరదరాజును విజయవాడలోని హెచ్‌ఆర్డీ చీఫ్ ఇంజనీర్‌గానూ, ధవళేశ్వరం క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మక్బూల్ అహ్మద్ ను కడప చీఫ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు.

అదే పాఠశాలలో భర్తీ చేయాలి.. ఎయిడెడ్ కారుణ్య నియామకానికి షరతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎయిడె పాఠశాలలో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగి స్థానాన్ని భర్తీ చేసేందుకు కారుణ్య నియామకాన్ని కూడా కేవలం అదే పాఠశాలలలో భర్తీ చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2009లో ప్రభుత్వం ఇచ్చిన సౌకర్యాన్ని తొలగిస్తూ ఈ మార్పు చేశారు. ఇది చాలా దుర్మార్గం అని ఎపిటిఎఫ్ అభిప్రాయం వ్యక్తం చేసింది. చాలా పాఠశాలల్లో మినిస్ట్రీయల్ స్టాఫ్‌కు చెందిన పోస్టులు అదే పాఠశాలల్లో ఉండవని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ, పంచాయితీరాజ్ యాజమాన్యంలో కూడా ఈ కారుణ్య నియామకం ఉండే సౌకర్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

వెయ్యి కోట్లకు వేటు

- కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రానికి సవరింపులో కోత
- సంస్థలకిచ్చే నిధులకూ అదే రీతి
- పాత బడ్జెట్ సవరణలతో రాష్ట్ర అధికారుల విశ్లేషణ
- శాఖల వారీ 'కోత' లెక్కలూ పరిశీలన



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

కేంద్రం ప్రతిపాదించిన కొత్త బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయమే కాకుండా, కొనసాగుతున్న బడ్జెట్‌లో కూడా భారీగా కోతలు పడుతున్నాయి. ముందు చేసిన కేటాయింపులకు, తాజాగా సవరణ బడ్జెట్‌లో ఖరారు చేస్తున్న మొత్తానికి మధ్య భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. ఈ అంతరం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి వెయ్యి కోట్లకు పైగా ఉన్నట్లు తాజాగా గుర్తించారు. మొత్తం లెక్కలు ఖరారైతే ఈ తేడా ఇంకా పెరిగే అవకాశాలున్నాయని రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రధానంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా 2017-18 ఆర్థిక సంవత్సరానికి రూ.29,139 కోట్లు కేటాయించారు. సవరణ అంచనాల్లో దీన్ని రూ. 29 వేల కోట్లకు కుదించారు. వాస్తవంగా రావాల్సిన మొత్తం కన్నా ఇది రూ.139 కోట్లు తక్కువవుతుంది. జిఎస్టీ అమలు వల్ల ఆదాయంలో కొంత తగ్గిందని, అందుకే ఇవ్వాల్సిన నిధులను కూడా తగ్గించాల్సి వస్తోందని కేంద్రం చెబుతున్నట్లు రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక విధంగా ఇదీ రాష్ట్రానికి మరో రూపంలో జరిగిన అన్యాయమేనని వారు స్పష్టం చేస్తున్నారు. తాజా బడ్జెట్‌లో రాష్ట్ర వాటా కింద రూ.33,930 కోట్లు కేటాయించారు. గత ఏడాది కేటాయింపు కన్నా కేవలం రూ.4వేల కోట్లు మాత్రమే పెరిగినట్లని అధికారులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న ఆదాయం రేటుకన్నా, రాష్ట్ర వాటా కేటాయింపుల రేటు తక్కువగా ఉందనే భావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. ఇక విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి కేటాయించిన నిధుల్లో కూడా కోతలు పడ్డాయి. ఎనిమిది సంస్థలకు 2017-18 బడ్జెట్‌లో రూ. 300 కోట్లు కేటాయించి, సవరణ బడ్జెట్‌లో దీన్ని రూ. 281 కోట్లుగా ఖరారు చేశారు. దీంతో రూ.19 కోట్లకు దీంట్లో కోత పడింది. ఇందులో కూడా ఇప్పటివరకు కేవలం రూ. 167 కోట్లు మాత్రమే రాష్ట్రానికందింది. మిగిలిన నిధులు ఎంతవరకు వస్తాయన్నది కూడా ప్రశ్నార్థకమే. ఆయా సంస్థలకు గత బడ్జెట్‌లో కేటాయించిన మొత్తానికి మరో రూ. 80 కోట్లు జత చేసి తాజా బడ్జెట్‌లో రూ. 380 కోట్లు కేటాయింపు చూపారు. ఈ మొత్తం కూడా కాగితాలకే పరిమితమ వుతుందా, లేక చేతికం దుతుందా అన్నది వేచి చూడాల్సిందేనని ఆర్థిక శాఖ అధికారులు వ్యాఖ్యానిస్తు న్నారు. కేంద్రం నుంచి వివిధ రూపాల్లో రావాల్సిన ఇతర నిధులపై కూడా కోతలు పెట్టారు. ఏయే శాఖలకు బడ్జెట్‌లో ఎంత కేటాయించారు, సవరణ అంచనాల్లో ఎంత కోతలు పెట్టారన్న కోణంలో అధికారులు లెక్కలు తీస్తున్నారు. మొత్తం కోతల నిగ్గు తేల్చాలంటే ఒకటి రెండు రోజులు పడుతుందని వారంటున్నారు.

స్టేట్ క్యాన్సర్ సెంటర్‌కు త్వరలో టెండర్లు

మంత్రి కామినేని శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్నూలులో స్టేట్ క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు త్వరలో టెండర్లు పిలవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ అధికారులకు సూచించారు. సచివాలయంలో శుక్రవారం ఆయన ఆ శాఖ అధికారులతో సమావేశమై పెండింగ్‌లోని వివిధ అంశాలు సహా, రాష్ట్రంలో జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం నిర్వహణ గురించీ చర్చించారు. ఆయుష్ శాఖలోని ఆస్పత్రులను బలోపేతం చేయాలని, ఆ ఆస్పత్రుల్లో తప్పని సరిగా బయోమెట్రిక్ అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవిలో వడదెబ్బ నివారణకు వీలుగా విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేయాలన్నారు. రాష్ట్రంలో వెల్ నెస్ సెంటర్లు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. యోగా, న్యాచురోపతి పై ప్రజలకు అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. నకిలీ ఆయుర్వేద మందులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి, అనంతపురం జిల్లా హిందూపురం, చిత్తూరు జిల్లా మదనపల్లి, నెల్లూరు జిల్లా అత్మకూరు, ప్రకాశం జిల్లా మార్కాపురం ఆసుపత్రులను జిల్లాస్థాయి ఆసుపత్రులుగా మార్చాలని ఆర్థిక శాఖకు నివేదిక పంపామని వివరించారు. నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో సీనియర్ రెసిడెంట్స్ (ఎస్ఆర్)గా పనిచేస్తున్న వైద్యులకు వెంటనే జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి డిఎమ్ఇ ని ఆదేశించారు. ఏపి మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపిఎమ్ఎస్ఐడిసి) సూచించిన ప్రభుత్వాస్పత్రుల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను వెంటనే తొలగించాల న్నారు. ఆయుష్, ఏపి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపి శాక్స్), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపిఎమ్) విభాగాల పనితీరుపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల న్నారు. వైద్యఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి పూనం మాలకొండయ్యతోపాటు ఆయుష్, ఏపివివిపి, ఏపిఎమ్ఎఎస్ఐడిసి, డిఎమ్ఇ విభాగాధిపతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కామినేని శ్రీనివాస్

ఉపకార వేతనాలు చెల్లిస్తామని వైద్య విద్యార్థులకు మంత్రి హామీ

వైద్య విద్యార్థులకు చెల్లించాల్సిన అన్ని ఉపకార వేతనాలను చెల్లిస్తామని మంత్రి కామినేని శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. శుక్రవారం సచివాయంలో ఆంధ్రప్రదేశ్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు మంత్రిని కలిశారు. స్కాలర్‌షిప్‌లతో పాటు ఎరియర్స్ కూడా చెల్లించాలని విద్యార్థులు కోరగా మంత్రి సానుకులంగా స్పందించారు. ఆర్థిక మంత్రితో మాట్లాడి ప్రతి నెలా విద్యార్థులకు ఉపకార వేతనం అందేలా చూస్తానన్నారు. సీనియర్ రెసిటెండ్లకు రూ.7 కోట్లు, పిజి వైద్య విద్యార్థుల ఉపకారవేతనాలకు రూ.4 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి విద్యార్థులకు తెలిపారు.

చలానాలు, పెనాల్టీలు తగ్గించాలి

- రవాణా కమిషనర్‌కు ఆటో ట్రాలీ డ్రైవర్స్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రవాణ రంగంలో పెంచిన చలానాలు, పెనాల్టీలను తగ్గించాలని కోరుతూ ఏపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ ఫెడరేషన్ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు రవాణా శాఖ కమిషనర్‌కు ఫెడరేషన్ నాయకులు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. చలానాలు, పెనాల్టీల తగ్గింపుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని కమిషనర్ వారికి హామీనిచ్చారు. తగ్గించకపోతే ఫిబ్రవరి 27న రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపడతామని నాయకులు కమిషనర్‌కు చెప్పారు. ఫిట్‌నెస్ అపరాధరుసుం రోజుకు రూ.50లు వసూలు చేయడాన్ని ఆపాలని వారు కోరారు. కర్ణాటక రాష్ట్రంలోలాగా గరిష్టంగా రూ.100లకు మించి వసూలు చేయొద్దని కోరారు. చదువుతో నిమిత్తం లేకుండా ఆటో డ్రైవర్లకు లైసెన్స్ ఇచ్చే సమయంలో కంప్యూటర్ పరీక్షల నుంచి మినహాయించాలని, మౌఖిక పరీక్ష నిర్వహించాలని కోరారు. ఆటో డ్రైవర్లకు బ్యాడ్జి లేదనే కారణంతో కేసులు రాయడాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్మి కుల పట్ల కిందిస్థాయి అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. 60 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఆటోల్ని పట్టణా ల్లోకి రానివ్వకుండా పోలీస్ శాఖ కేసులు రాయడాన్ని ఆపాలన్నారు. ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని, ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికుల్ని వేధింపులకు గురిచేస్తున్న ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖలో మీటర్ లేకుండా ఆటోకు ఫిట్‌నెస్ చేయాలని కోరారు.

ఏపిలో రేషన్ షాపులను ప్రైవేట్ మాల్స్‌గా మారుస్తున్నారు

రాజ్యసభలో విజయసాయి రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆంధ్రప్రదేశ్ రేషన్ షాపులను ప్రైవేట్ మాల్స్‌గా మారుస్తున్నారని వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి విమర్శించారు. ఫ్యూచర్, రిలయన్స్ వంటి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం నాడు ఆయన రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాల నిర్వీర్యానికి చంద్రబాబు ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆయన మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ షాపులను చంద్రబాబు ప్రైవేట్ మాల్స్‌గా మార్చడాన్ని ఆయన తీవ్రంగా తప్పు పట్టారు. రాష్ట్రంలో గుంటూరు, విజయవాడల్లో పైలట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే సుమారు ఆరువేల రేషన్ షాపులను ఫ్యూచర్, రిలయన్స్ గ్రూపులకు కట్టబెట్టారని మండిపడ్డారు. ఫ్యూచర్ గ్రూప్‌లో చంద్రబాబు కుటుంబానికి వాటాలున్నాయని, అందుకోసమే రేషన్ దుకాణాలను వారికి కట్టబెట్టారని విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం పేదలకు చెందిన రేషన్‌ను వ్యాపారంగా చేస్తోందని, పేద ప్రజల అవసరాలను గాలికి వదిలేసి డబ్బు దోచుకోవడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందంటూ విమర్శించారు. కేంద్రంలో భాగస్వాములుగా ఉండి..రాష్ట్ర అవసరాలపై కనీస అవగాహన లేకుండా నాలుగేళ్ళుగా కళ్ళుమూసుకున్నారంటూ దుయ్యబట్టారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలను నెరవేర్చకుండా కేంద్రం పట్టీపట్టనట్లుగా ఉంటే చంద్రబాబు సర్కార్ మొద్దు నిద్రపోతోందని ఆయన విమర్శించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు, బడ్జెట్ అయిపోయాక తెలుగుదేశం ప్రభుత్వం కేంద్రం పట్ల వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

బిసిలకు రిజర్వేషన్లకై ప్రైవేటు బిల్లులు

బిసిలకు జనాభా ప్రాతిపదికన చట్టసభలు, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలని ఎంపి విజయసాయి రెడ్డి రాజ్యసభలో ప్రవేటు బిల్లు ప్రవేశపెట్టారు. దేశ వ్యాప్తంగా 55శాతం మంది బిసిలు ఉన్నారని, కానీ చట్టసభల్లో 20శాతం కూడా ప్రాతినిధ్యం దక్కట్లేదని ఆయన అన్నారు. ఇందుకోసమే జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించాలని ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టామని విజయసాయిరెడ్డి అన్నారు. ఏపిలో 143 బిసి కులాలున్నాయని, రాష్ట్ర జనాభాలో 56 శాతం బిసిలు ఉన్నారని తెలిపారు. ఇప్పుడున్న రిజర్వేషన్లు ప్రస్తుత జనాభాకు సరిపోవు కాబట్టే రిజర్వేషన్లు పెంచాలని ఆయన బిల్లులో పేర్కొన్నారు.

డిపిఆర్ ఇవ్వకపోవడం వల్లే..

మంత్రి మాణిక్యాలరావు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని నిర్మాణంపై డిపిఆర్ ఇవ్వనందు వల్లే కేంద్రం రాజధానికి నిధులు ఇవ్వలేదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు అన్నారు. సచివాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం బడ్జెట్‌ను రూపొందించిం దన్నారు. రాష్ట్రానికి అన్యాయం జరిగిందనేది మిత్ర పక్షంలోని కొందరి వాదన మాత్రమేనన్నారు. అన్ని రాష్ట్రాలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌లో కేటాయింపులుంటాయన్నారు. రాష్ట్రానికి కేటాయింపుల విషయంలో రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తుందన్నారు. రైల్వే జోన్ విషయంలో కూడా కేంద్రం ప్రత్యామ్నాయం చూపుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికావడానికి కేంద్రం పనిచేస్తోందన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో ఎపి పట్ల కేంద్రంపై ఉన్న అపోహలన్నీ త్వరలో తొలగిపోతాయన్నారు. కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉందని అభిప్రాయపడ్డారు.

డిపిఆర్ ఎప్పుడో ఇచ్చాం : మంత్రి నారాయణ

అమరావతి నిర్మాణానికి రూ.ఐదు లక్షల కోట్లు అవసరమని ఎప్పుడో డిపిఆర్ ఇచ్చామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. డిపిఆర్ ఇవ్వలేదని మంత్రి మాణిక్యాలరావు అనడం సరైందికాదన్నారు. తొలుత రూ.ఐదు వేల కోట్లు కేంద్రాన్ని అడిగామని, రూ.2500 కోట్లు ఇస్తామని కేంద్రం ఫైనల్ చేసిందని, అందులోనూ రూ.1500 కోట్లే ఇచ్చిందని తెలిపారు. తాము అనుకున్నది రాలేదన్నారు. ఏయే శాఖకు ఎంత కేటాయింపు చేశారో వివరాలను సిఎం రెడీ చేయమన్నారని, విజయవాడంటే చిన్న గ్రామం కాదు, పెద్ద సిటీ కాదు దీని గురించి కూడా ఆలోచించాలని సిఎం అభిప్రాయపడ్డారని చెప్పారు.

రాష్ట్ర పర్యాటకానికీ నిరాశే..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర పర్యాటక రంగానికి నిరాశే మిగిలింది. బడ్జెట్‌లో రాష్ట్ర పర్యాటక ప్రస్తావనే లేక పోవడంతో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. అరకు అభివృద్ధికి రూ.198 కోట్లతో తాజాగా ప్రణాళికను రాష్ట్ర పర్యాటక శాఖ రూపొందించింది. ఇందులో కేంద్రం నుంచి రూ.100 కోట్లు పొందాలని ప్రయత్నాలు చేసింది. అయితే బడ్జెట్ కేటాయింపుల్లో ఆ ప్రస్తావనే రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఐఎన్ఎస్ విరాట్ యుద్ధనౌక మ్యూజియానికి కూడా కేంద్రం తన వంతు ఆర్థిక సాకారాన్ని ప్రకటించలేదు. శ్రీకాకళం జిల్లా కళింగపట్నంలో రూ.200 కోట్లతో బీచ్ రిసార్ట్ అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. బొర్రాగుహలు, అరకు వ్యాలీ, అనంతగిరి, చాపరాయి, లంబసింగిలను కలిపి పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. విశాఖలోని మధురవాడ కొండలపై 240 ఎకరాల్ని పర్యాటక ఆకర్షక కేంద్రంగా రూపొందించే బృహత్తర ప్రణాళికను పర్యాటక శాఖ అధికారులు సిద్ధం చేశారు. యుద్ధనౌక ఐఎన్ఎస్ విరాట్‌లో 148 గదుల హోటళ్ల ఏర్పాటుకు, నేవల్ మారీటైమ్ ఇన్‌స్టిట్యూట్, వినోదకేంద్రం, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గండికోటలో రోప్‌వే ప్రాజెక్టుకు రూ.7.5 కోట్లతో ప్రణాళికను రూపొందించారు. అయితే ఈ ప్రాజెక్టుల ప్రస్తావన కేంద్ర బడ్జెట్‌లో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే ఈ ప్రాజెక్టుల మొత్తం భారాన్ని మోయాల్సి వస్తుంది.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో అవకాశాలపై నేడు రాజమహేంద్రవరంలో సదస్సు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉన్న అవకాశాలపై రాజమండ్రిలో శనివారం సదస్సు నిర్వహించనున్నట్లు ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యదర్శి గిరిజా శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని నిపుణులు, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు ఈ సదస్సుకు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆ రంగంలో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై సదస్సులో ప్రధానంగా చర్చ ఉంటుందని తెలిపారు. ఈ రంగంలో ఇప్పటికే పెద్ద పారిశ్రామికవేత్తలు రంగప్రవేశం చేయడంతో చిన్న తరహా పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని రివర్ బే హోటల్‌లో ఈ సదస్సు ఏర్పాటువుతోందన్నారు.

ప్రత్యేకం

పులుల జాడ కోసం అన్వేషణ

- మన్యంలో వన్యప్రాణుల గణన ప్రారంభం
- సర్వే చేస్తున్న వన్యప్రాణి విభాగం
- సర్వే కోసం 'స్ట్రైప్' మొబైల్ యాప్



మారేడుమిల్లి మండలం పాములేరు అటవీ ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న వన్యప్రాణి విభాగం ఉద్యోగులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం ప్రతినిధి

మన్యం ప్రాంతాల్లో పెద్దపులుల జాడ కోసం వన్యప్రాణి సంరక్షణ విభాగం అన్వేషణ మొదలు పెట్టింది. ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ (ఎఐటిఇ) 2018లో భాగంగా దేశంలోను, రాష్ట్రంలోనూ మన్యం ప్రాంతాల్లో పెద్ద పులులతోపాటు వన్య ప్రాణుల సంఖ్యపై సర్వే మొదలైంది. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో గతనెల 22 నుంచి సర్వే జరుగుతోంది.

పెద్దపులులు, చిరుత పులులతోపాటు అడవి దున్న, జింకలు, కుందేళ్లు, నెమలి, కారుకోడి వంటి అనేక జంతువుల, పక్షుల సంఖ్య కోసం తూర్పు మన్యంలో 10 రోజులుగా వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులు, సిబ్బంది సర్వే మొదలు పెట్టారు. వన్య ప్రాణుల సంఖ్యతోపాటు వాటికి అనువైన ప్రదేశాలు, మనుషుల చొరబాటు, జంతువుల ఆవాసాలు, వేటగాళ్ల ఆనవాళ్లు తదితర సమగ్ర సమాచారం సేకరణలో అటవీ సిబ్బంది ఉన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ సర్వే ఆధారంగా సేకరించిన వన్య ప్రాణుల సమాచారాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నామని వన్యప్రాణి విభాగం అధికారులు చెబుతున్నారు. రాజమహేంద్రవరం అటవీ సర్కిల్ పరిధిలోని కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో 18.86 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అడవులు విస్తరించి ఉన్నాయి. పులుల సంరక్షణ ప్రాంతాలతోపాటు మన్యంలోని అన్ని ప్రాంతాల్లోనూ సర్వే జరుగుతోంది. మారేడుమిల్లి మండలం పాములేరు పరిసరాల్లో రాత్రింబవళ్లూ సర్వే సాగుతోందని వన్యప్రాణి విభాగం చెబుతోంది.

ఈ సర్వే కోసం స్ట్రైప్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను వినియోగించి వన్య ప్రాణుల సర్వేలో పాల్గొనే అటవీ బీట్ అధికారులకు శ్రీశైలం, విశాఖ, తిరుపతిలో శిక్షణ ఇచ్చారు. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో 277 ఫారెస్టు బీట్లు ఉన్నాయి. కాకినాడ డివిజన్‌లో 104, కృష్ణా జిల్లా డివిజన్‌లో 31, రాజమహేంద్రవరం డివిజన్‌లో 15, చింతూరు డివిజన్ పరిధిలో 62, ఏలూరు డివిజన్ పరిధిలో 65 చొప్పున ఫారెస్టు బీట్లు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం సర్వే జరుగుతోంది.

వేటగాళ్లు చొరబడుతున్నారా?

ప్రతి బీటు ఆఫీసరూ 15 కిలోమీటర్లు సర్వే నిర్వహిస్తున్నారు. శాఖాహార జంతువుల ఆవాసాల్లో వాటికి ఆహారంగా లభించే చెట్లు, మొక్కలు, కంద మూలాలు, గడ్డి లభ్యత ఏవిధంగా ఉంది. పులులు, ఇతర క్రూర మృగాల ఆవాసాల్లో ఆహారం లభించే అవకాశాలు, దప్పిక తీర్చుకునే పరిస్థితులపైనా సర్వే చేస్తున్నారు. వన్య ప్రాణుల ఆవాసాలు మనుషుల కదలికల వల్ల ధ్వంసం అయ్యాయా? వేటగాళ్ల చొంబాటు ఎలా ఉంది? అనే అంశాలపైనా సర్వే జరుగుతోంది. ప్రస్తుతం జిల్లాలోని మన్య ప్రాంతంలో పులుల జాడ కన్పించడంలేదు. ఈ సర్వే తర్వాత పులుల జాడ తెలుస్తుందని వన్య ప్రాణి విభాగం భావిస్తోంది.

సంక్షిప్తం

మమల్ని తీసుకోండి..!

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణలో పనిచేస్తున్న తమను రాష్ట్రానికి బదిలీ చేయాలని ఎపికి చెందిన ఉపాధ్యాయులు మంత్రి గంటా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర విభజన అనంతరం 420 మంది తెలంగాణలో పనిచేస్తున్నారని, తెలంగాణకు చెందిన ఉపాధ్యాయులు రాష్ట్రంలో 190 మంది పనిచేస్తున్నారని గంటాను, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్‌ను శుక్రవారం కలిసి వివరించారు. విభజన వల్ల తాము స్థానికేతరులయ్యే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

జెన్కో డైరెక్టర్‌గా మోహనరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిజెఇఎన్‌సిఒ) డైరెక్టర్ (హెచ్ఆర్ అండ్ ఐఆర్)గా బిఎ మోహనరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మోహన్‌రావు రెండేళ్లపాడు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తాగునీటి సరఫరా సంస్థకు ఐదు జిల్లాలో ప్రాజెక్టులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ డ్రింకింగ్ వాటర్ సప్లయ్ కార్పొరేషన్ (ఎపిడిడబ్ల్యూఎస్‌సి)కు ఐదు జిల్లాలో తాగునీటి ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి) పద్ధతిలో హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో వైఎస్ఆర్ కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో రూ.9,400 కోట్లతో ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేశారు. అన్ని ఇళ్లకు కుళాయి నుంచి తాగునీటిని అందించేందుకు, 70 ఎల్‌పిసిడి నీటిని అందించే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు పేర్కొన్నారు.

రైల్వే ఉద్యోగుల మహాధర్నా



ప్రజాశక్తి-గాంధీనగర్ (విజయవాడ)

ప్రభుత్వం వెంటనే పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వ ర్యాన శుక్రవారం డిఆర్ఎం కార్యాలయం వద్ద మహాధర్నా చేపట్టారు. ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పిలుపు మేరకు చేపట్టిన ఈ ధర్నాలో ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ కోశాధికారి సిపిఎస్ శర్మ మాట్లా డారు. ఉద్యోగుల వేతనం నుంచి కొంత మొత్తా న్ని భవిష్యత్ కోసం పొదుపు చేసుకుంటుంటే దాన్ని షేర్ మార్కెట్‌లో పెట్టి పింఛన్‌కు లింకు పెట్టడం అన్యాయమన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న 2.25 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. గేట్ కీపర్, ఇంజినీరింగ్, లోకో రన్నింగ్ స్టాఫ్ 12 గంటలకుపైగా విధులు నిర్వహిస్తున్నా ఎటువంటి అదనపు వేతనమూ ఇవ్వడం లేదన్నారు.

రేపు భీమవరంలో రాష్ట్రస్థాయి 'జన కవనం'

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం 25వ మహాసభల సందర్భంగా ఈ నెల 4న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో రాష్ట్రస్థాయి జనకవనం నిర్వహిస్తున్నట్లు ఆహ్వానసంఘం పక్షాన చైతన్య ప్రసాద్, నాగాస్త్ర, గనారా శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వర్తమాన సమాజం అనేక సమస్యలతో సతమతమవుతున్నదని, మానవ సంబంధాలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని, విద్యార్థులు, రైతులు ఆత్మహత్యల బాట పట్టారని, నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నదని, జీవితం పట్ల ఆశను నింపాల్సిన సామాజిక పరిస్థితులు అందరిలోనూ నిరాశను కుమ్మరిస్తున్నాయని వారు పేర్కొన్నారు. అంతేకాదు.. మత సామరస్యంతో, లౌకిక విలువలతో పరిఢవిల్లాల్సిన భారతావనిలో పరమత సహనం అపహాస్యానికి గురవుతున్నదని, రాజ్యాంగ హక్కులను ధిక్కరిస్తూ భావ ప్రకటనా స్వేచ్ఛను కూడా హరిస్తున్నారని, ఈ నేపథ్యంలో ఈనెల 4న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూడు భాగాలుగా జనకవనం జరగనుందని వారు తెలిపారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వొర ప్రసాద్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సభలో సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి ప్రారంభోపన్యాసం చేస్తారని, ముఖ్యఅతిథిగా శాసనమండలిలో పిడిఎఫ్ పక్ష నాయకుడు వి.బాలసుబ్రహ్మణ్యం హాజరవనున్నారని వెల్లడించారు. 12 గంటల నుంచి 1.30 గంటల వరకూ జనకవనం తొలి భాగం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకూ ద్వితీయ భాగం, 4.30 నుంచి 6.00 గంటల వరకూ చివరిభాగం జనకవనం జరుగుతాయని తెలిపారు. ఈ కవనాల్లో ఆత్మీయ సందేశాలతోపాటు కవులు తమ కవితా గానాలను వినిపిస్తారని వారు తెలిపారు. కవులు పెద్దఎత్తున హాజరుకానున్నారని వారు తెలిపారు.

శనగ రైతు కుదేలు

- మార్కెట్‌లో ధరలు పతనం
- గోదాముల్లో మగ్గుతున్న నిల్వలు
- చేతికొస్తున్న కొత్త పంట
- పట్టించుకోని ప్రభుత్వం



పప్పు శనగకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక రైతులు విలవి ల్లాడుతున్నారు. రెండేళ్ల క్రితం క్వింటా రూ.8 వేల నుంచి రూ.10 వేలు ఉండేది. ధర బాగా ఉండడంతో గతేడాది శనగను విస్తారంగా సాగు చేశారు. కిందటి ఏడాది మాదిరిగానే ధర వస్తుందని రైతులు గోదాముల్లో నిల్వ చేసుకు న్నారు. వీరి పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా మారిం ది. గతేడాది ఉత్పత్తులనే అమ్ముకోలేక ఇబ్బందులు పడుతుంటే ఈఏడాది ఇంటికొస్తున్న పంటను ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో పత్తి తర్వాత అధికంగా శనగ పంటను సాగు చేస్తారు. 2016లో మార్కెట్‌లో పప్పు శనగ ధర రూ.8 వేల నుంచి రూ.10 వేల మధ్య వచ్చింది. 2017లో అత్యధికంగా ఫిబ్రవరిలో రూ.7,270 దాకా వచ్చింది. ధర పెరుగుతుందని ఆశించిన రైతులు మళ్లీ పతనమవడంతో గోదాముల్లో అట్టే నిల్వ చేశారు. ఈ ఏడాది జనవరి మొదట్లో రూ.4,200 దాకా ఉన్న ధర ప్రస్తుతం రూ.3,000 వేల నుంచి రూ.3,800లకు పడిపోయింది.

ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి

ఎకరాకు రూ.20 వేల దాకా పెట్టుబడి అవుతుంది. అయ్యే పప్పు శనగ దిగుబడులు 8 క్వింటాళ్లు వస్తేగానీ రైతులకు గిట్టుబాటు కాదు. ఈఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడులు 3, 4 క్వింటాళ్లకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో ధరలు కూడా భారీగా పతనమయ్యాయి. శనగ కనీస మద్దతు ధర రూ.4,400 కాగా ఈ ఏడాది సీజన్ మొదలైనప్పటి నుంచి ఒక్కసారి కూడా ఆ ధర రాలేదు. ప్రభుత్వం శనగ రైతులను పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో పప్పు శనగ రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కనీస మద్దతు ధరతోనైనా శనగలు కొనాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పూర్తిగా నష్టపోయాం



16 ఎకరాల్లో శనగ సాగు చేశాం. దిగుబడి అంతంత మాత్రమే వచ్చింది. ఏటేటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. ధరలు తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. 2016లో రూ.8 వేలకు అమ్ముకుంటే గతేడాది రూ.6 వేలు, ఇప్పుడు రూ.4 వేలకు కూడా అడిగే నాథుడు లేడు. ప్రభుత్వం న్యాయం చేయాలి.

లెనిన్, గొందిపర్ల, కర్నూలు మండలం

మార్క్‌ఫెడ్ ద్వారా శనగలను కొనుగోలు చేయాలి



పప్పు శనగకు మార్కెట్‌లో ధరలు బాగా పతనమయ్యాయి. కనీస మద్దతు ధర కంటే తగ్గిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కనీస మద్దతు ధరతోనైనా రైతులను ఆదుకోవాలి.

టి.రమేష్‌కుమార్,
ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ముంచు కొస్తున్న గడువు

సాగర్ కాల్వల ఆధునికీకరణకు విడుదలవ్వని నిధులు
జూలైలోగా పూర్తి చేయాలని ప్రపంచ బ్యాంకు ఒత్తిడి



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వల ఆధునికీకరణ పనులు ఎప్పటికి పూర్తవుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన ఈ పనులను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు విడుదల చేయడం లేదు. 2008లో అప్పటి సిఎం వైఎస్ హయాంలో ప్రపంచ బ్యాంకు నిధులతో చేపట్టిన పనులు పదేళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది జూలైలోగా పనులు పూర్తి చేయాల్సి ఉంది. మొత్తం సాగర్ పరిధిలో ఉన్న ఐదు జిల్లాలకు కలిపి రూ.4,444 కోట్లతో ప్రపంచ బ్యాంకు నిధులతో కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే 2014 వరకూ ఈ పనులు నత్తనడక సాగాయి. రాష్ట్ర విభజన తర్వాత గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల పరిధిలో రూ.2,832 కోట్లతో పనులు చేపట్టాలని, తెలంగాణ పరిధిలో నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో రూ.1,632 కోట్లతో పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల పరిధిలో రూ.2,832 కోట్లతో చేపట్టే పనుల్లో రాష్ట్ర ప్రభుత్వం 52 శాతం, 48 శాతం ప్రపంచ బ్యాంకు నిధులు కేటాయించుకునేలా ఒప్పందం జరిగింది. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,472, ప్రపంచ బ్యాంకు రూ.1,359 కోట్లు వెచ్చించాల్సి ఉంది. ఈ మేరకు నాలుగేళ్లల్లో దాదాపు రూ.1,932 కోట్ల మేరకు పనులు జరిగాయి. ఇంకా రూ.900 కోట్లతో పనులు జరగాల్సి ఉంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.457 కోట్లు విడుదల చేయాల్సి ఉంది.

పని : నాగార్జున సాగర్ ఆయకట్టు కాల్వల ఆధునికీకరణ
ఎప్పుడు మొదలైంది: 2008
ఏపి జిల్లాలు: ఐదు జిల్లాలు
నిధులు : 4,444 కోట్లు
వాటాలు : రాష్ట్రం 52 శాతం, కేంద్రం 48 శాతం

విభజన తర్వాత

ఎపి : గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలకు రూ.2,832
టిజి : నల్గొండ, ఖమ్మం జిల్లాలకు రూ. 1,632
ఖర్చు: రూ.1932 కోట్లు

నిధుల విడుదలపై సందిగ్ధత

నిధుల విడుదలపై సందిగ్ధత నెలకొనడంతో ఈ ఏడాది ఇంత వరకూ పనులకు సంబంధించి టెండర్లు పిలవలేదు. టెండర్లు పూర్తి చేస్తే జూలై లోగా పనులు పూర్తి చేసేందుకు అవకాశం ఉంటుందని, లేదంటే మళ్లీ ఖరీఫ్ ప్రారంభం అయితే నీటి విడుదలకు వత్తిడి వస్తుందని నీటి సంఘాల అధ్యక్షులు చెబుతున్నారు. అయితే ఈ పనులకు సంబంధించి నీటి సంఘాల అధ్యక్షులు, ప్రాజెక్టు కమిటీ సభ్యులకు కనీస సమాచారం లేదు. అంతా అధికారులే ప్రతిపాదనలు చేస్తున్నారని వారు అసంతృప్తితో ఉన్నారు. సిమెంట్ లైనింగ్ నిర్మాణ పనులు, కల్వర్టులు, అవుట్ ఫాల్ స్లూయిజ్‌లు, వరద తాకిడిని తట్టుకునేలా కట్టడాలు, వంతెనల నిర్మాణాలకు సంబంధించి తాము ప్రతిపాదించిన పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపడతామని అధికారులు తెలిపారు. ఆధునీకీకరణ పనులు పూర్తయితే చివరి భూములకు నీరందించడంతో పాటు నీటి వృథాను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది.



నమూనా పత్రాన్ని విడుదల చేస్తున్న బొడ్డు నాగేశ్వరరావు తదితరులు

డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 7న టెట్ నమూనా పరీక్ష

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ)

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈనెల 7న నిర్వహించనున్న 'టెట్' మోడల్ పరీక్షను అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి సభ్యులు బొడ్డు నాగేశ్వరరావు కోరారు. టెట్ మోడల్ పరీక్షకు సంబంధించిన పోస్టర్‌ను విజయవాడలోని శ్రీ శ్రీ భవన్‌లో శుక్రవారం ఉదయం బొడ్డు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టెట్‌కు హాజరయ్యే అభ్యర్థులు సుమారు 4 లక్షల మందికిపైగా ఉంటారన్నారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడ సిటీ, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మోడల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. టెట్ పరీక్షపై అవగాహన పెంచుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో పరీక్షను నిర్వహిస్తుందని, దీనితో పాటు ప్రతి ఒక్కరికీ ఉపయుక్తంగా ఉండేలా ఆఫ్‌లైన్‌లో కూడా పరీక్షలను నిర్వహిస్తే బాగుంటుందని తెలిపారు.

పోలీసులకు క్రీడా స్ఫూర్తి, చైతన్యం అవసరం

3వ ఎపిఎస్‌పి గేమ్స్, స్పోర్ట్స్‌ను ప్రారంభించిన డిఐజి మీనా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్/ఏలూరు సిటీ

క్రీడలతో చైతన్యం వస్తుందని, అది పోలీసులకు అవసరమని డిఐజి మీనా అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఎపిఎస్‌పి క్యాంప్ ఆవరణంలో కమాండెంట్ జంగారెడ్డి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను ఆయన కలెక్టర్ కార్తికేయమిశ్రాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్రీడల్లో పాల్గొనడం ద్వారా పోలీస్ సిబ్బంది తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ఎపిఎస్‌పి 3వ బెటాలియన్ ఏటా క్రీడా పోటీలను పండుగలా జరుపుకోవడం ద్వారా చైతన్యాన్ని కల్గిస్తోందని చెప్పారు. పోలీస్ అంటే మొరటుగా ఉంటారనే సాధారణ భావనను బెటాలియన్ తమ సామాజిక హిత కార్యక్రమాలతో తుడిచేస్తోందని తెలిపారు.

ఆటలతో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం : ఎస్‌పి రవి

పోలీసులు విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నారని, వాటి నుంచి ఉపశమనం పొందేందుకు ఆటలు ఒక్కటే మార్గమని పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి ఎం.రవిప్రకాష్ అన్నారు. ఏలూరులోని పెరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్-2018 పేరుతో ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు. అనంతరం శాంతి కపోతాలు, రంగురంగుల బెలూన్లను ఎగురవేశారు.

అతిసారతో రాజధాని కూలీ మృతి

ప్రజాశక్తి-తుళ్లూరు/గుంటూరు అర్బన్

రాజధాని నిర్మాణ పనులకు వచ్చిన పలువురు వలస కార్మికులు అతిసార బారిన పడగా వారిలో సామ్రాట్(25) అనే పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్మికుడు శుక్రవారం మృతిచెందాడు. మరో కార్మికుని పరిస్థితి విషమంగా ఉంది. రాజధాని ప్రాంతమైన తుళ్లూరు మండలంలో వంతెనలకు సెంట్రింగ్ పనుల కోసం పశ్చిమబెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి 26 మంది కార్మికులు వచ్చారు. వీరంతా అనంతవరం-నెక్కల్లు గ్రామాల మధ్యలో రేకుల షెడ్డుల్లోనే నివాసం ఉంటున్నారు. గత బుధవారం కొందరికి వాంతులు, విరోచనాలు కావడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో సామ్రాట్ శుక్రవారం మృతి చెందాడు. బోలా అనే కార్మికుని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై తుళ్లూరు ఎస్ఐ శ్రీనివాసరావు విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి పరిశీలించారు. అనంతరం చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యంతోపాటు కోల్పోయిన పని దినాలకు కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జగన్ బిజెపికి వ్యతిరేకమా? అనుకూలమా ?

జగన్‌కు మాజీ ఎంపి చింతామోహన్ సూటి ప్రశ్న
సుందరయ్య లాంటి వారు సిఎం కావాలి

ప్రజాశక్తి - నెల్లూరు

వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్ బిజెపికి వ్యతిరేకమా, అనుకూలమా అనే విషయాన్ని ప్రజలకు చెప్పి ప్రజా సంకల్పయాత్ర చేపట్టాలని తిరుపతి మాజీ ఎంపి చింతా మోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇందిరభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చాక స్వేచ్ఛా స్వాతంత్ర్యం, సామాజిక న్యాయం కనుమరుగయ్యాయని విమర్శించారు. ఆర్థిక అసమానతలు పెరగడంతో పేదవాడు మనోవేదనకు గురవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. 60ఏళ్లుగా రెండు సామాజిక వర్గాలు అధికారంలో ఉన్నాయన్నారు. దళితులు, బలహీన వర్గాల వారిని అధికారంలోకి రానివ్వడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో కోట్ల రూపాయలు పక్కదారి పడుతున్నాయన్నారు. 'మాది మచ్చలేని ప్రభుత్వం, అవినీతి ఎక్కడ జరిగినా సహించం, కూకటి వేళ్లతో పెకలిస్తాం' అని చెబుతున్న ప్రధాని మోడీకి పోలవరం ప్రాజెక్టులో జరుగుతోన్న అవినీతి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే సిబిఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆస్తులు అక్రమంగా కూడబెట్టుకునే నేతలు రాష్ట్రానికి అవసరం లేదని, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి మహానేత ఎపికి ముఖ్యమంత్రి కావాలన్నారు. అప్పుడే రాష్ట్రంలో నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర బడ్జెట్‌ను కార్పొరేట్ బడ్జెట్ అని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, భువనేశ్వర్ పాల్గొన్నారు.

సంస్కరణల్లో ఆధార్ ప్రక్రియ అత్యుత్తమం

ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-ఉంగుటూరు (కృష్ణాజిల్లా)



సంస్కరణల్లో ఆధార్ ప్రక్రియ అత్యుత్తమమైందని ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణాజిల్లా ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఇటీవల మంజూరు చేసిన పిహెచ్‌సి, పోలీసు స్టేషన్ల శిలాఫలకాలను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. తొలుత ఎం.వెంకయ్యనాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, రుణాలు అర్హులకు చెందుతున్నాయో లేదో తెలుసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి అన్నారు. అక్రమాలు, దోపిడీలు అరికట్టడానికి ఆధార్ దోహదపడుతుందన్నారు. తొలుత రూ.60 కోట్లతో ఆత్కూరులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, కొల్లు రవీంద్ర, జెడ్‌పి చైర్‌పర్సన్ గద్దె అనురాధ, సిపి గౌతమ్‌సవాంగ్, డిఇఒ రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే వి.వంశీ, గ్రామపెద్దలు ఎ.రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

పోలవరం పవర్ హౌస్ 2019కి పూర్తయ్యేనా?

- మార్చిలో పనులు ప్రారంభం
- కొండ తొలగింపు తర్వాతే అసలు పనులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం అంగుళూరు వద్ద ఒక్కొక్కటీ 80 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12 టర్బైన్ల ద్వారా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన పవర్ హౌస్ నిర్మాణం 2019 నాటికీ పూర్తయ్యేలా లేదు. రెండేళ్లుగా మట్టిపని సాగుతోంది. ఇంకా కోటీ 18 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకం పని చేట్టాల్సి ఉంది. పెద్ద కొండను తొలగించాల్సి ఉంది. ఆ తర్వాతే పవర్ హౌస్ పనులు మొదలు కానున్నాయి.

ఈ ఏడాది చివరి నాటికి రెండు యూనిట్ల నిర్మాణాన్నయినా పూర్తిచేసి రెండు టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్మాణ సంస్థను ప్రభుత్వం ఆదేశించిందని సమాచారం. ప్రభుత్వం పెట్టిన గడువులోగా ఒక్క యూనిట్ పనికూడా పూర్తయ్యే పరిస్థితులు కన్పించడం లేదు. జెన్‌కో ప్రణాళిక ప్రకారం తొలి యూనిట్ 36 నెలల్లోనూ, మిగిలిన యూనిట్లు రెండేసి నెలలకు ఒక యూనిట్ చొప్పున పూర్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని భావించింది. అలా జరగలేదు. రానున్న రెండేళ్లలో సగం యూనిట్లనైనా పూర్తి చేయాలని భావిస్తోంది. జెన్‌కో లెక్కల ప్రకారం 2019 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తయ్యేలాలేదని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన 70 శాతం మట్టి పనులను ట్రాన్స్‌ట్రాయ్ ఆధ్వర్యంలోని త్రివేణి సంస్థ పూర్తి చేసింది. ఇప్పుడు పవర్ బ్లాక్, అప్రోచ్ ఛానల్, టైల్‌రేస్ ఛానల్ మట్టి పనులను నవయుగ సంస్థ ఫిబ్రవరి నుంచి చేపట్టబోతోంది. మట్టి పనులు పూర్తయితే మార్చిలో పవర్ హౌస్ కాంక్రీటు పనులు ప్రారంభించాలని నిర్మాణ సంస్థ భావిస్తోందని సమాచారం. పోలవరం ప్రాజెక్టు పవర్ హౌస్ నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఎపి జెన్‌కో ఆధ్వర్యాన నిర్వహించారు. నవయుగ సంస్థ పనులు దక్కించుకుంది. సాంకేతిక బిడ్‌లో అన్ని అర్హతలూ ఈ సంస్థకు లభించడంతో సుమారు రూ.3,300 కోట్ల అంచనా విలువతో ఈ పనులు ఖరారయ్యాయి. మార్చిలో పోలవరం పవర్ ప్రాజెక్టు కాంక్రీటు పనులు మొదలు కానున్నాయని జెన్‌కో చెబుతోంది. వాస్తవంగా పవర్ హౌస్ పునాది పనులను గతేడాది మే నెలలోనే చేపట్టాల్సి ఉంది. పోలవరం హెడ్ వర్క్సులో మిగిలిపోయిన సుమారు రూ.200 కోట్ల విలువైన మట్టి పనిని పోలవరం ప్రధాన కాంట్రాక్టర్ ట్రాన్స్‌ట్రాయ్ నుంచి తీసుకుని నవయుగ సంస్థకు 6సి కింద అప్పగించారు. దీంతో మట్టి పనికి సంబంధించి రూ.200 కోట్లు, పవర్ హౌస్‌కు సంబంధించి రూ.3,300 కోట్లతో నవయుగ పనులను చేపట్టనుంది. ఇంతవరకూ ఈ మట్టి పనులను ట్రాన్స్‌ట్రాయ్ ఆధ్వర్యంలోని త్రివేణి సంస్థ నిర్వహిస్తోంది. మట్టి పనుల్లో పురోగతి లేదని భావించిన ప్రభుత్వం మిగిలిన మట్టి పనులను నవయుగకు అప్పగించింది. గోదావరి నది ఎడమ గట్టువైపు దేవీపట్నం మండలం అంగుళూరు వద్ద పవర్ హౌస్ నిర్మిస్తున్నారు. దీని కోసం ఆ గ్రామాన్ని సుమారు రెండేళ్ల క్రితం ఖాళీ చేయించారు. ఈ ప్రాంతంలో పెద్ద కొండను తొలగించాల్సి ఉంది. ఈ కొండను తొలగిస్తే తప్ప పవర్ హౌస్ కాంక్రీటు పనులు చేపట్టే అవకాశం లేదు. ఈ కొండ తొలగింపుతోపాటు మిగిలిన మట్టి పనిని నవయుగ సంస్థ చేపట్టనుంది. మార్చి నెలలో పవర్ హౌస్ కాంక్రీటు పనులు చేపట్టడమే కాకుండా పవర్ హౌస్ నిర్మాణ ప్రాంతంలోనే భారీ టర్బైన్లను తయారు చేయాలని నవయుగ

సంపాదకీయం

కళ్లు తెరవండి!

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి మరోమారు తీవ్ర అన్యాయం జరిగిన తరువాతనైనా ముఖ్యమంత్రి చంద్రబాబు కళ్లు తెరుస్తారనుకున్న వారికి శుక్రవారం నాడు ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో పురుడుపోసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా మూడున్నరేళ్ల పాటు ఎన్డీయే కూటమిలో కొనసాగుతూ వచ్చింది. రాష్ట్ర ప్రజల్లో అగ్రహం పెల్లుబికినప్పుడల్లా దాన్ని చల్లార్చే బాధ్యతను ముఖ్యమంత్రే భుజన వేసుకుంటూ వచ్చారు. ఒక్క సందర్భంలోనైనా కేంద్రం వైఖరిని నికరంగా నిరసించలేదు. ఎదురు తిరిగి నిలదీయలేదు. దాంతో రాష్ట్ర ప్రజలన్నా, దాని అవసరాలన్నా బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి చులకన అయింది. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన విభజన హామీలు నెరవేర్చక పోగా బడ్జెట్‌లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఒకటుందన్న గుర్తింపు కూడా లేని విధంగా వ్యవహరించింది.

ఉమ్మడి రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించి ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిందంటూ కాంగ్రెస్‌పై పదేపదే విరుచుకుపడే చంద్రబాబు చట్టసభల సాక్షిగా రాష్ట్ర ప్రజానీకానికి ఇచ్చిన వాగ్దానాలను, హామీలను అమల్జేయడంలో నిర్లక్ష్యాన్ని, నిర్లిప్తతను ప్రదర్శించి వంచించిన మోడీ సర్కార్‌పై మాత్రం ఏనాడూ నోరు మెదకపోవడం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమే. ఆంధ్రప్రదేశ్‌కు ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా కల్పిస్తామని నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటిస్తే కాదుకాదు పదేళ్లు ఇవ్వాలని బిజెపి నినదించింది. ఎన్నికల్లో నెగ్గిన తరువాత ప్రత్యేక హోదాతో ఏమొస్తుంది...దానికి మించి ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామంటూ మాటమార్చింది. పదేళ్లు కాదు 15 ఏళ్లు ప్రత్యేక హోదా కావాలని నాడు విన్నవించిన చంద్రబాబు కూడా బిజెపితోపాటే మాట మార్చారు. ప్యాకేజీ అన్న మోడీ ప్రభుత్వ వంచనకు తలూపడమేగాకుండా ఇటు రాష్ట్ర ప్రజానీకానికి సర్దిచెప్పేందుకు ప్రయత్నిస్తూవచ్చారు. ప్రత్యేక హోదా హామీ నీరుగారిపోతుంటే భగ్గుమన్న ప్రజానీకంపైనా 'ఇప్పుడేంటి నన్ను కేంద్రంతో తగువు పెట్టుకోమంటారా?' అంటూ ఎదురు ప్రశ్నించారు. టిడిపి లొంగుబాటు దోరణితో ప్రత్యేక హోదాను ప్రణాళికబద్ధంగా అటకెక్కించిన మోడీ సర్కార్ విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా పేర్కొన్న పోలవరం విషయంలోనూ ద్రోహం చేసింది. కేంద్ర ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు సమకూర్చి సకాలంలో పోలవరాన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత కేంద్రపైనే ఉన్నా.. నిధులు మంజూరు చేయకుండా అడ్డం పడుతున్నప్పుడు కూడా చంద్ర బాబు సర్దుబాటుకే ప్రయత్నించారుగానీ కేంద్రాన్ని నిలదీయడానికి ప్రయత్నించ లేదు.

అప్పుల ఊబిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాల అండగా ఉంటామని, నవ్యాంధ్ర రాజధాని నిర్మాణంలో అడుగడుగునా సహకరిస్తామని గుప్పించిన హామీల విషయంలోనూ బిజెపి నిలువునా మోసగించింది. హస్తిన తరహాలో అమరావతిని నిర్మించేందుకు సహకరిస్తామని అమరావతి శంకుస్థాపన సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన వాగ్దానాన్ని నిలుపుకోకపోయినా చంద్ర బాబు కళ్లు తెరవలేదు. దాంతో ప్రధాని అమరావతికి 'పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు'తో సరిపుచ్చారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ ఇచ్చిన హామీలకు కేంద్రం తిలోదకాలిచ్చినా బాబుగారు మిన్నకున్నారే మినహా నోరు మెదిపింది లేదు. రాష్ట్రంలో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు విభజన చట్టం ప్రకారమే ఆర్థిక సహాయం అందిచాల్సిన సాయం నేటికీ అందలేదు. ప్రధాన ప్రతిపక్షంగా రాష్ట్రానికి రావలసిన హక్కులు, నిదుల సాధనలో కీలక పాత్ర పోషించాల్సిన వైఎస్‌ఆర్‌సిపి సైతం కేంద్రం పట్ల సాచివేత దోరణితో వ్యవహరిస్తూ వచ్చింది. రెండు పార్టీలకూ స్వార్థ ప్రయోజనాలే పరమావధి కావడంతో రాష్ట్ర ప్రజల అవసరాలంటే కేంద్రానికి లెక్కలేకుండా పోయింది. దాని పర్యవసానం కేంద్ర బడ్జెట్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిన్న ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మరోసారి తీవ్ర ద్రోహం జరిగింది. బడ్జెట్‌లో హోదా సంగతి ఎత్తలేదు, నిదుల గురించి మాట్లాడలేదు, వెనుకబడిన ప్రాంతాలను గురించి పట్టించుకోలేదు, రైల్వే జోన్‌ను ప్రస్తావించలేదు, చివరికి కేంద్రమే నిర్మించాల్సిన పోలవరానికి కూడా రూ. 900 కోట్లు విదిలించి ఊరుకున్నారు. రూ. 40 వేల కోట్లకు పైగా నిధులు కావాల్సిన జాతీయ ప్రాజెక్టుకు 900 కోట్లు ఇస్తే అది ఎప్పటికి పూర్తయ్యేను? ఇంత దుర్మార్గం జరిగిన తరువాతనైనా చంద్ర బాబు ప్రభుత్వం కళ్లు తెరవాలి. బిజెపి చేస్తున్న అన్యాయాలను ప్రశ్నించాలి. అఖిల పక్ష బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంతో ఐక్యంగా పోరాడాల్సిన బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకోవాలి. రాష్ట్ర ప్రజల ఆగ్రహాన్ని ఢిల్లీ పెద్దలకు తెలియజేయక పోతే చంద్రబాబే త్వరలో ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది.

ఇది విషయం



నోరు విప్పి చెప్పాలా
పొమ్మనలేకే పొగ...
అనుక్షణం వంచనతో
నిప్పుల కుంపటి సెగ!

అలసత్వం ఎందుకో
చంద్రుడికే ఎరుక...
కాషాయం దృష్టిలో
'తెలుగు' మహా తేలిక!

- కొల్లూరు వెంకట్

బడ్జెట్ విశ్లేషణ


పేదలకు మాటలు తప్ప డబ్బు లేదు



సిపి చంద్రశేఖర్

2018-19 కేంద్ర బడ్జెట్‌లో మూడు ముఖ్యమైన అంశాలు కనిపిస్తాయి. మొదటిది, అవసరం ఎక్కడుందో అక్కడ నిధులు కేటాయించలేదు. గ్రామీణ రంగానికీ, చిన్న పరిశ్రమలకు ప్రాముఖ్యత ఇచ్చినట్లు గొప్పగా చెప్పుకున్నారు. కానీ నిధులు చూస్తే చేత్తో విదిలించారు. ఉదాహరణకు వ్యవసాయం, సహకారం, రైతు సంక్షేమానికి బడ్జెట్‌లో 7 శాతం నిధులు పెంచారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న ఒక రంగానికి ఈ నిధులు ఏ మూలకూ సరిపోవు. రైతులకిచ్చే సంస్థాగత రుణాలకు నిధులను రూ. 10 లక్షల కోట్ల నుండి 11 లక్షల కోట్లకు పెంచినట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. కానీ దానికి ఆయన నిధులిచ్చిందేమీ లేదు. బ్యాంకులిస్తాయని చెప్పారు. సంక్షోభంలో ఉన్న రైతాంగానికి సంక్షోభంలో ఉన్న బ్యాంకులు అప్పులిస్తాయా? మనం నమ్మాలా? ఈ బడ్జెట్‌లో రైతులకు తీపి కబురుందంటే అది మద్దతు ధరను 1.5 రెట్లు పెంచడమే. కానీ అది కూడా ఎంతవరకు అమలు చేస్తారో వేచి చూడాల్సిందే.


ఇంకోటి చూడండి. 10 లక్షల కుటుంబాలకు ఏడాదికి రూ. 5 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. కానీ విచిత్రం, ఒక్క రూపాయి కూడా బడ్జెట్‌లో దీనికి కేటాయించలేదు. పోనీ దీని గురించి బీమా కంపెనీలతో చర్చించాం అనైనా చెప్పారా అంటే అదీ లేదు. అంటే బడ్జెట్ రణగొణ ధ్వని తరువాత ఈ పథకం అటకెక్కుతుందన్న మాట. గ్రామీణ పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇచ్చేసామన్నారు. కానీ ప్రధానమంత్రి ఆవాస్ యోజనాకు పెంచిన నిధులు 3 శాతం మాత్రమే. ఈ నిధులతో గ్రామీణ పేదలందరికీ ఇళ్లు నిర్మించడం ఎలా సాధ్యం? ఇక గ్రామాల్లో పేదలు ఉపాధి పనులకోసం పెద్ద ఎత్తున ఎదురు చూస్తున్నారు. కానీ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి ఒక్క రూపాయి కూడా అదనంగా పెంచలేదు.



మూడోది, ద్రవ్య లోటు అదుపుకు సంబంధించిన విషయం. 217-18 సంవత్సరం ద్రవ్యలోటు 3.5 శాతం ఉందనీ, ఈ ఏడాది 3.3 శాతం ఉంచాలనీ ఆర్థిక మంత్రి జైట్లీ చెప్పారు. నడుస్తున్న సంవత్సరం రెండు ముఖ్యమైన అనుకూలాంశాలు లభించినా ద్రవ్యలోటే అదుపులో పెట్టలేకపోయిన ఆయన వచ్చే ఆర్థిక సంవత్సరం పెడతారని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. 2017-18లో రెండు అనుకూలాంశాలు: 1. పెద్ద ఖర్చులు (ఉదాహరణకు, కార్పొరేట్ల రుణ ఎగవేత వల్ల ఇబ్బందుల్లో పడ్డ బ్యాంకులకు డబ్బు సర్దడం) బడ్జెట్‌లో చూపకుండా ఇతర మార్గాలు అనుసరించడం 2. హెచ్‌పిసిఎల్‌లో ఓఎన్‌జిసి 51 శాతం వాటా కొనుగోలు చేసినందున ప్రభుత్వానికి ఓఎన్‌జిసి నుండి 36,915 కోట్ల రూపాయల ఆదాయం బడ్జెట్‌కు ఒక్క రోజు ముందు ఒక్క సారిగా వచ్చి పడింది. దాంతో పెట్టుబడుల ఉపసంహరణద్వారా రూ. 72,500 కోట్లు వస్తుందని బడ్జెట్‌లో వేసిన అంచనా మించిపోయి రూ. 1 లక్ష కోట్లు వచ్చింది. జిఎస్‌టి వల్ల తగ్గిపోయిన ఆదాయాన్ని ఇది పూడ్చింది. దీని వల్ల తెలుస్తున్నదేమంటే, జిఎస్‌టి వల్ల ఆదాయమూ రాలేదు, మన ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగానూ లేదు. అందువల్లనే ఆదాయాన్ని పూడ్చుకోడానికి జైట్లీగారు ఇష్టం లేకపోయినా లక్ష రూపాయలు మించిన దీర్ఘకాల క్యాపిటల్ గెయిన్ టాక్స్‌ను 10 శాతం, స్వల్పకాల క్యాపిటల్ గెయిన్ టాక్సను 15 శాతం పెంచారు. 2003-04లో రద్దు చేసిన ఈ పన్నును తిరిగి వేయడం గమనార్హం. దాంతో స్టాక్ మార్కెట్ ఒక్క సారిగా ఒడిదుడుకులకు గురయింది.

అయితే స్టాక్ మార్కెట్ ఇప్పటిలాగే ప్రతికూలంగా స్పందిస్తే బడ్జెట్ ఆమోదం పొందే లోగానే ఈ పన్నును ఉపసంహరించుకోవచ్చు. అలా చేయకపోతే విదేశీ పెట్టుబడిదారుల ముందు తమది 'సంస్కరణవాద' ప్రభుత్వం అనీ, వ్యాపారానుకూలం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) అనీ తెచ్చుకున్న పేరు మంటగలిసిపోతుందని భయం. బడ్జెట్ మొత్తంగా చూస్తే ఆర్థిక మంత్రి ఎన్నికల ముందు ఎంత పెద్ద మాటలు చెప్పినా దానికి తగ్గ నిధులు కేటాయించడంలో విఫలమై దొరికిపోయారు. ఆర్థిక మంత్రి దురదృష్టమేమంటే ప్రధాన మంత్రిలాగా మాటల చాటున వాస్తవాలు దాచిపెట్టగలిగే ఉపన్యాస ప్రావీణ్యం కూడా ఆయనకు లేదు.

వాస్తవాలను మరుగుపర్చిన బడ్జెట్



సారంపల్లి మల్లారెడ్డి

ప్రస్తుత బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని పరిశీలిస్తే, రూ.46,700 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.13 వేల కోట్లు పంటల బీమా, రూ.15 వేల కోట్లు వడ్డీ మాఫీ (4 శాతం), రూ.4 వేల కోట్లు 99 ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం, రూ.3,600 కోట్లు గోదాముల నిర్మాణానికి కేటాయించారు. ఉద్యాన పంటలకు రూ.2536 కోట్లు కేటాయింపు చూపారు. గత సంవత్సరం కూడా ఇదే విధమైన కేటాయింపులు చేశారు. పై 5 పద్దులకు రూ.38 వేల కోట్లు తీసివేస్తే, రూ.8,700 కోట్లతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పర్చాలి. ఇది సాధ్యమేనా? దేశంలో 43 కోట్ల ఎకరాలు సాగౌతుండగా అందులో ఇప్పటికే 9 కోట్ల ఎకరాలు బీళ్లుగా మారగా 34 కోట్ల ఎకరాలు సాగు చేస్తున్నాం. ఈ రూ.8700 కోట్లతో వ్యవసాయం ఏవిధంగా అభివృద్ధి చేస్తారు. బీమా కంపెనీలకు ఇచ్చిన డబ్బు ఇప్పటికే వేల కోట్ల ప్రీమియాన్ని 11 కంపెనీలు కాజేసినట్లు పార్లమెంట్‌లో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి స్టార్ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇప్పటికే ప్రీమియంను రైతుల నుండి, ప్రభుత్వం నుండి వసూలు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కంపెనీలు క్లైమ్‌లు చెల్లించడం లేదు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అనుకూలమైన విత్తనాలను ఉత్పత్తి చేయడానికి పరిశోధనా కేంద్రాలకు నిధుల కేటాయింపు తగ్గింది. విదేశీ బహుళ జాతి సంస్థలు తెచ్చిన టెక్నాలజీని ఇక్కడ మనం వినియోగిస్తున్నాం. దానివల్ల ఈ సంవత్సరం పత్తి పంట 1.3 కోట్ల హెక్టార్లలో నష్టపోయినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో 21 లక్షల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నది.

వ్యవసాయ రుణాలకు రూ.11 లక్షల కోట్లు కేటాయించామన్నారు. వాస్తవానికి దేశంలోని బ్యాంకులలో రూ.98 లక్షల కోట్లు డిపాజిట్లు ఉన్నాయి. రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం 18 శాతం అనగా, రూ.17.5 లక్షల కోట్లు పంట రుణాలివ్వాలి. ఆర్బిఐ ఆదేశాలను బ్యాంకులు గత దశాబ్ద కాలంగా ధిక్కరిస్తున్నాయి. మైక్రో ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్న టాటా, బిర్లా, రిలయన్స్, ఎల్ అండ్ టి లాంటి కంపెనీలు 24-36 శాతం వడ్డీతో రైతులకు అప్పులిచ్చి లాభాలను గడిస్తున్నాయి. ఈ అప్పులు లభించని వారు అధిక వడ్డీలకు ప్రయివేట్ రుణాలను తీసుకుంటున్నారు. వారు అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.



రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభసాటి ధర నిర్ణయిస్తామని పార్లమెంట్‌లో ప్రకటించారు. ఇంతకు ముందు ఈ ప్రకటనను మోడీ తన ఎన్నికల ప్రణాళికలోనే రాసుకున్నారు. తరువాత దీనిని అమలు చేయలేనని సుప్రీం కోర్టుకు అఫిడవిట్ వేశారు. ధరలు నిర్ణయించడం రాష్ట్రాల బాధ్యత అని, వ్యవసాయం రాష్ట్ర జాబితాలో ఉందని ప్రకటించిన మోడీ ప్రభుత్వం రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ నినాధాన్ని ముందుకు తెచ్చారు. ఇప్పటికే లెవీ సేకరణను రద్దు చేస్తున్న కేంద్రం నగదు బదిలీలవైపు చూస్తున్నది. ప్రస్తుతం ప్రకటించిన లాభసాటి ధరను అమలు జరిపేది కేంద్రమా? రాష్ట్రమా? దాని అమలు విధానాలు ఎలా ఉంటాయి? స్పష్టత ఇవ్వాలి. ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన పేరుతో 2016-18 వరకు రూ.5 వేల కోట్లు మాత్రమే వ్యయం జరిగింది. కాగా, 2018-19లో రూ.4 వేల కోట్లు ప్రకటించారు. దేశంలో 99 ప్రాజెక్టులను పూర్తి చేయాలి. ఇలా కేటాయించుకుంటూ పోతే దశాబ్ద కాలం కావడమే కాక వ్యయం 200 శాతం పెరుగుతుంది.

దేశ స్థూల ఉత్పత్తి 6.3 శాతంగా ఉందని అందులో వ్యవసాయోత్పత్తి 2.1గా ఉందని సెలవిచ్చారు. గత 4 సంవత్సరాలుగా వ్యవసాయ స్థూల ఉత్పత్తి 4 శాతం పెంచాలన్న లక్ష్యం ఏనాడూ నెరవేరలేదు. జనాభా మాత్రం ఏటా 1.9 శాతం పెరుగుతున్నది. మరొకవైపున సాగుభూమి విస్తీర్ణం కోట్ల ఎకరాల్లో తగ్గుతున్నది. వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత గత దశాబ్ద కాలంగా ఎదుగూ బొదుగూ లేకుండా ఉంది. అందువల్ల వంటనూనెలు, పప్పులు, పంచదార, పత్తి దిగుమతులు చేసుకుంటున్నాం. ధనిక దేశాలు కూడా దిగుమతులకు ఆంక్షలు తొలగించాలని కోరుతున్నాయి. స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో ఇప్పటికే 16 దేశాలతో జీరో సుంకం దిగుమతి ఒప్పందం చేసుకున్నాం. ఆ దేశాల నుండి వస్తున్న దిగుమతులు, మన దేశం నుండి వెళ్తున్న ఎగుమతులను పరిశీలిస్తే ప్రతి దేశంతో రూ.2.5 లక్షల కోట్ల మేరకు లోటు వ్యాపారం కొనసాగిస్తున్నాం. ఫలితంగా దేశం రూ.33 లక్షల కోట్ల విదేశీ రుణ భారంలో కూరుకుపోయింది. ఈ రుణం డాలర్ల రూపంలో ఉంది. రూపాయి విలువ తగ్గితే అప్పు దానంతట అదే పెరుగుతుంది. దేశంలో తలసరి ఆదాయం 2011-12 స్థిర ధరల ప్రకారం 1.02 లక్షల రూపాయలు ఉన్నట్లు చెప్తున్నారు. తలసరి ఆదాయం పెరిగినప్పటికీ దారిద్ర్యం 37 శాతం నుండి 55 శాతానికి పెరిగింది. తలసరి ఆదాయాన్ని చూపి ప్రజలకు భ్రమలు కల్పిస్తున్నారు. స్థూల ఆదాయాన్ని కూడా ధరల పెరుగుదలతో చూసి దేశ స్థూల ఉత్పత్తి పెరిగినట్లు చెప్తున్నారు. ఉత్పత్తి పెరగకుండా ధరలు పెరగడంతో గత సంవత్సరంపై పెరుగుదలను చూపించడం నేటి ఆర్థిక సూత్రంగా ఉంది. వాస్తవానికి దేశంలో మౌలిక వసతుల కల్పన చాలా వెనుకబడి ఉంది. లభ్యతగల నీటిని వేల టియంసీలలో వినియోగించుకోలేకపోతున్నాం. భూవసతిని, మానవ వనరులను, రవాణాను, జల వనరులను వినియోగించుకోవడం ద్వారా దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకుపోవచ్చు. కానీ, ఆ చర్యలేవీ చేపట్టకుండా ప్రస్తుత బి.జె.పి ప్రభుత్వం 2022 నాటికి ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, అందరికీ ఉపాధి కల్పిస్తామని ప్రకటిస్తున్నారు. దీని అర్థం 2019 తిరిగి తమ ప్రభుత్వాన్ని గెలిపించాలన్న లక్ష్యం తప్ప మరొకటి లేదు. బడ్జెట్ రూపకల్పనలో కార్పొరేట్ సంస్థల నుండి బకాయిలు, రుణాలు, పన్నులు సక్రమంగా రాబట్టడం ద్వారా బడ్జెట్ పెంపుదలతోపాటు దళిత, గిరిజన, మహిళా శిశుసంక్షేమానికి, వెనుకబడిన తరగతులను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లవచ్చు. ప్రాథమిక వనరుల అభివృద్ధి, విద్యా, వైద్యం, గృహ వసతి కల్పన, ఆహార ధాన్యాల స్వయం పోషకత్వాన్ని పెంచేలా బడ్జెట్‌ను రూపొందించాలి.


(రచయిత అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షులు, సెల్ : 9490098666)

అభివృద్ధి వ్యూహం కాదు..ఓట్ల కసరత్తు..

అరుణ్ కుమార్

ఎన్నికలలో ఓట్లు సంపాదించటానికి బిజెపి బడ్జెట్‌ను ఆయుధంగా వినియోగించుకుంటున్నది. కాని త్వరగా ఎన్నికలు జరిగితేనే బిజెపికి ఫలితాలు వస్తాయి. దరిద్రంలో ఉన్న కోట్లాది మంది దళితులు, గిరిజనులు, రైతులు, వృద్ధులు, మహిళలు, ఇతర తరగతుల ప్రజానీకానికి పెద్ద సంఖ్యలో పథకాలను ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాలు, పేద ప్రజలకు అమలు జరుగుతున్న అనేక పథకాలకు కేటాయింపులను పెంచారు. ప్రజలను సంతృప్తి పరచటానికి ఏ బడ్జెట్‌లోనైనా ఇలాగే చేస్తారు. కఠినమైన అంశాలన్నీ పార్ట్ బిలో ఉంటాయి. కాబట్టి ఆ భాగాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేయాలి. బడ్జెట్ అనేది దేశంలో అతి పెద్ద సంఘటన కాబట్టి రానున్న సంవత్సరంలో అది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తుంది. 2017-18 సంవత్సరంలో దేశాన్ని పీడించిన సమస్యలు వ్యవసాయ రంగం, నిరుద్యోగం, విద్యావంతులకు స్థాయికి తగని ఉద్యోగాలు, తక్కువ ప్రయివేటు పెట్టుబడులు, అస్థిరంగా ఉన్న స్టాక్ మార్కెట్, అమెరికాలో కార్పొరేట్ పన్నులను తగ్గించటంతో పెట్టుబడులు భారతదేశాన్ని వదిలిపోయే అవకాశాలు తదితరాలు ఉన్నాయి. విద్యా, వైద్య రంగాలలో స్టాండర్డ్ తక్కువగా ఉండటం, అవసరమైన పేదలందరికీ అందకపోవటం ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ పరిస్థితిలు ఈ రంగంలో ఉద్యోగిత పెరుగుదలపై ప్రభావం చూపిస్తున్నాయి.

ఈ సంవత్సరం ఆర్థిక వ్యవస్థకు రెండు ప్రధానమైన షాకులు- నోట్ల రద్దు, జిఎస్‌టి-తగిలాయి. ఇవి ఆర్థిక వ్యవస్థ పెరుగుదలపై ప్రతికూల ప్రభావం చూపాయి. అసంఘటిత రంగంలో ఉద్యోగాలు, వ్యవసాయ రంగంలో ఖర్చులు పెరగటం, ఆదాయాలు తగ్గిపోవటం వలన ఆ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రత్యక్ష పన్నుల వసూలు పెరిగిందని ప్రభుత్వం చెబుతున్నా జిఎస్‌టితో ఆదాయం తగ్గిపోయంది. నోట్ల రద్దు వలన ఆర్‌బిఐ నుండి వచ్చే మొత్తం తగ్గిపోయంది. అయినప్పటికీ పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చే మొత్తం పెరగటంతో ఆదాయం పెరగటానికి దారితీసింది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి నెమ్మదించటంతో రెవిన్యూ ఆదాయం తగ్గింది. అవసరం లేనిచోట అధికంగా ఖర్చు చేయటం, ఆదాయం తగ్గటంతో 2017 డిసెంబరు నాటికే ద్రవ్య లోటు 100 శాతాన్ని మించిపోయింది. కాబట్టి ద్రవ్య లోటు లక్ష్యానికి దగ్గరగా ఉండాలంటే రానున్న మూడు మాసాలలో ప్రభుత్వం ఖర్చులో తీవ్రంగా కోత విధించాల్సి ఉంటుంది. సాధారణంగా ఇటువంటి కోతలను విద్య, వైద్యం లాంటి రంగాలలో అమలు చేస్తారు. ఈ రంగాలలో ఉద్యోగాలపై ప్రభావం చూపు తుంది. ఉదాహరణకు ఉన్నత విద్యా సంస్థలలో 40 శాతం లెక్చరర్ల పోస్టులు అనేక సంవత్సరాల నుండి ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తామని చెబుతున్నారు కాని బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు తక్కువగా ఉన్నపుడు అది సాధ్యం కాదు.



ఈ రంగాలకు ప్రకటించిన పథకాలు అమలు జరగాలంటే పెద్ద మొత్తంలో నిధులు కావాలి. కాని బడ్జెట్‌లో అందుకు తగిన విధంగా కేటాయింపులు చేయలేదు. ఈ భారం బడ్జెటేతర వ్యయం పైనా, ప్రభుత్వ రంగం పైనా పడుతుంది. ఫలితంగా ప్రభుత్వ రంగ సంస్థల ఖర్చులు పెరిగి, ఖాయిలా పడతాయి. నోట్ల రద్దు సందర్భంగా అదనపు భారాన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులు భరించాల్సి వచ్చింది. ఈ విధంగా ఖాయిలా పడిన తర్వాత వాటిలో పెట్టుబడులను ఉపసంహరిస్తారు. కాబట్టి ప్రజలను ఆకర్షించే పథకాలను ప్రకటించటానికి, ప్రభుత్వరంగాన్ని ప్రయివేటీకరించటానికి, రెండు విధాలుగా ఇది పాలకులకు వినియోగపడుతుంది. తగిన నిధులను కేటాయించకపోవటంతో వ్యవసాయ ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రకటన ఆచరణ రూపం దాల్చే పరిస్థితి లేదు.

కార్పొరేట్ సంస్థలు ఆశించిన రాయితీలను పొందలేదు. కాబట్టి జైట్లీ ప్రసంగానికి ప్రతికూలంగా స్పందించాయి. సూచీలు రికార్డుస్థాయిలో పెరిగి ఉన్నపుడు ఇది తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తుంది. సూచీలు పడిపోవటం పూర్తి విధ్వంసానికి దారి తీయవచ్చు. కార్పొరేట్ పన్నులు తగ్గివున్న అమెరికా మార్కెట్‌కు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తరలిపోవటం ప్రారంభం అయితే ఇటువంటి విధ్వంసం జరిగే అవకాశం ఉంది.

మనం పన్ను రాయితీలివ్వటం వలన ప్రయోజనం లేదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం ద్వారా డిమాండ్‌ను పెంచటానికి కృషి చేయాలి. ఉత్పాదకశక్తి వినియోగం తక్కువగా ఉన్నపుడు రాయితీలు ఇవ్వటం వలన ఉపయోగం ఉండదు. తక్కువ పెరుగుదల రేట్లను పక్కన పెట్టి, డిమాండ్‌ను పెంచటానికి బడ్జెట్‌లో తగిన ప్రయత్నం లేదు. అందువలన బడ్జెట్ ప్రతిపాదనలు త్వరలో ఎన్నికలు జరిగితేనే బిజెపికి ఫలితాలు రావటానికి అవకాశం ఉంది.


జనవాక్యం

కేటాయింపుల్లో వివక్ష

ఈ బడ్జెట్ సామాన్యుల్లో తీవ్ర నిరాశ నింపింది. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిలో మార్పు చేయకుండా మధ్యతరగతిని మోసం చేసింది. ఇక మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. ఇప్పటికి మూడు బడ్జెట్లలో దక్కని విభజన హామీలు, విశాఖ రైల్వే జోన్‌లకూ ఈ చివరి బడ్జెట్లోనూ స్థానం దక్కలేదు. కంటితుడుపు చర్యగా రాష్ట్రంలోని వివిధ రైల్వేస్టేషన్లను ఆదర్శ రైల్వే స్టేషన్లుగా గుర్తించారు. మిగతా రాష్ట్రాలతో పోల్చితే రెండు తెలుగు రాష్ట్రాలకు బడ్జెటు కేటాయింపులలో వివక్ష కనిపిస్తోంది.

కె సతీష్ రెడ్డి, పరకాల.

ఉద్యోగులను విస్మరించింది



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్, ఉద్యోగ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది. వ్యక్తిగత ఆదాయపన్ను అంశానికి సంబంధించి ఏ విధమైన మినహాయింపులు ప్రకటించకపోవటంపై ఉద్యోగులు నిరాశ చెందారు. వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయించకపోగా ఎడ్యుకేషన్ సెస్ 3 శాతం నుంచి 4 శాతానికి పెంచారు. బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకు 80 వేల కోట్ల మేరకు ప్రభుత్వ రంగ సంస్థల వాటాల ఉపసంహరణ లక్ష్యంగా బడ్జెట్ నిర్దేశించటం ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకోవటమే అవుతుంది. ప్రభుత్వరంగ సాధారణ బీమా కంపెనీలను విలీనం చేసి స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలన్న ప్రతిపాదన జాతీయ సాధారణ బీమా రంగాన్ని ప్రయివేటీకరణ చేయటమే. ప్రభుత్వ రంగ బ్యాంకులకు రీ-కాపిటలైజేషన్ పేరుతో చేసిన బడ్జెట్, సపోర్ట్ కన్నా వాటి ద్వారా చేయవలసిన రుణ వితరణ లక్ష్యం అంచనాలకు మించి ఉండడం గమనార్హం. అంతర్జాతీయంగా 7వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపొందిందని పేర్కొన్న ఆర్థిక మంత్రి ప్రకటనకు ప్రజల వాస్తవ కొనుగోలు శక్తికి మధ్య పొంతన లేకపోవటం పెరుగుతున్న ఆర్థిక అంతరాలకు సంకేతం. పెద్దనోట్ల రద్దు ప్రక్రియకు ప్రధాన లక్ష్యంగా పేర్కొన్న నల్లధనం అంశానికి సంబంధించి బడ్జెట్‌లో వివరణలు లేకపోగా నల్లధన వెలికితీతకు తీసుకునే ఏ విధమైన నిర్మాణాత్మక చర్యలను ప్రకటించలేదు. మొత్తంగా చూసినపుడు కార్పొరేట్ వర్గాలకు పెద్దమొత్తంలో రాయితీలు కల్పించి సాధారణ, మధ్యతరగతి ప్రజానీకానికి ఏ విధమైన స్వాంతన చేకూర్చని బడ్జెట్‌గా పేర్కొనవచ్చు.

జి. కిషోర్ కుమార్
ఐసిఇయు ప్రధాన కార్యదర్శి, మచిలీపట్నం.


కార్పొరేట్ జపం

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ విదేశీ, స్వదేశీ బహుళజాతి సంస్థలకు సింహభాగం నిధులు కేటాయించి సామాన్యులకు రిక్త హస్తాన్ని అందించింది. ఉపాధి హామీ పథకానికి రూ.5 లక్షల కోట్లు కేటాయించామని అంటున్నారు. కానీ అవి జరిగే పనులు కావు. ఆ నిధులను దారి మళ్ళించి, బహుళజాతి సంస్థలకు అప్పనంగా అందిస్తారు. అయినా ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా, మార్కెట్ సౌకర్యం లేకుండా బహుళజాతి సంస్థలు మన దేశంలో పెట్టుబడులు పెట్టవనేది వాస్తవం. గతంలో ప్రవేశపెట్టిన బడ్జెట్లకు ఈ బడ్జెట్‌కు పెద్ద తేడా ఏమీ లేదు. ఇది ముమ్మాటికీ కార్పొరేట్ బడ్జెట్.

కొండా రామిరెడ్డి, గుంటూరు.

సెటైర్

చెంబు కథ... మట్టి వ్యథ



ఆ రోజు ప్రత్యేక విమానంలో పెద్దాయన వెంట వచ్చినప్పుడు ఎంత వైభోగం! ఎంత ప్రత్యేక గౌరవం! జనం జేజేలు పలుకుతుండగా, మంగళవాయిద్యాలూ, పండితుల మంత్రోచ్చాటనలూ మారుమోగుతుండగా- రాజసం ఉట్టి పడినట్టు మిట్టిపడింది చెంబు. ప్రపంచం పాదాక్రాంతమైనట్టు గర్వపడింది. తానొక ఒక మహా సామ్రాజ్య నిర్మాణానికి తొలి మెట్టుననుకొంది ఆ గుప్పెడు మట్టి. చెంబు తనలోని గంగాజలాన్ని గర్వంగా పొదువుకొని కృష్ణాగోదావరిలా ఉప్పొంగి పోయింది.

పెద్దాయన ఆ కాస్త మట్టిని పోశాక- ఇంకొన్ని మట్టి ముద్దలు పక్కకు వచ్చి చేరాయి. చెంబు నీళ్లు చిలకరించాక మరికొన్ని చెంబుల్లోంచి నదీ జలాలు వర్షించాయి. మట్టి ముద్దలన్నీ ఒక పెద్ద పోగులా తయారయ్యాయి. నదుల నుంచి తెచ్చి పోసిన నీళ్లు ఆ పోగుకు ఒక మట్టి దిబ్బ ఆకారం తెచ్చిపెట్టాయి. నీళ్లను మోసుకొచ్చిన చెంబులు ఆ దిబ్బ మీద కొలువు తీరాయి.

ఎవరు ఎంత మట్టి అయినా, తెచ్చి పోసి ఉండొచ్చు. ఎన్ని నీళ్లన్నా చిలకరించి ఉండొచ్చు. పెద్దాయన తెచ్చిన గుప్పెడు మట్టి- మట్టిలన్నిటికీ మహారాజయ్యింది. ఆయన విడిచిన చెంబు- చెంబులన్నిటికీ చక్రవర్తి అయ్యింది. తొలినాళ్ళలో తోటి చెంబులూ, సాటి మట్టిముద్దలూ వాటిని తెగ పొగిడేవి. కీర్తిస్తూ పాడేవి. పద్యాలు కట్టి వినిపించేవి. 'చెంబులందు ఢిల్లీ చెంబులే వేరయా/ విశ్వపర్యటాయ చంద్రరాయా' అని ఒక చెంబు కవి ఏకంగా శతకమే రాసింది. లోకల్ మట్టి ముద్ద ఒకటి ఢిల్లీ మట్టి మీద దండకం రాసి, రోజూ రసస్ఫోరకంగా వినిపిస్తూ ఉండేది. 'మట్టి మహాశయా మహిమాన్వతారాయ/ విశ్వవిఖ్యాతాయ విన్నుతాయ/ సకల సంచారాయ సర్వ సహాయాయ..' ఇలా సాగేది ఆ దండకం.

కొన్నాళ్లు ఇలా బాగానే నడిచింది. రేపోమాపో రాజధాని నిర్మాణం ప్రారంభమవుతుందని, అది ఢిల్లీ చెంబూ, మట్టి వల్లే అంతా సాధ్యమవుతుందని చుట్టూ ఉన్న రాగి, ఇత్తడి చెంబులూ, మట్టిముద్దలూ గట్టిగా నమ్మాయి. రోజులు, నెలలూ, సంవత్సరాలూ దొర్లిపోతున్నాయి. చుట్టూ గడ్డి మొలవడం, చెంబులకు చిల్లులు పడడం తప్ప ఇంకేం జరగలేదు. దీంతో, ఇతర చెంబు సామగ్రి, మట్టిముద్దలూ నిలదీయడం మొదలెట్టాయి. మొదట్లో 'తరువాతి బడ్జెట్లో చూడండి.. అమరావతి తడాఖా. ఆ తర్వాత అంతా అంగరంగ వైభవ వేడుక.' చెబుతూ వచ్చాయి ఢిల్లీ చెంబు, మట్టి. కానీ, రోజులు గడుస్తున్నా- నిధులు, నిర్మాణ సూచనలూ కనపడలేదు. దీంతో, చెంబుకు చెంబులు చేసే భజన తగ్గింది. గౌరవం తగ్గింది. మర్యాదా తగ్గింది. మట్టికి కూడా డిటో డిటో. తరువాత తమతో మాట్లాడ్డం మానేశాయి. అపహాస్యాలూ, సూటిపోటు మాటలతో ఆడుకోవటం మొదలెట్టాయి. 'ఢిల్లీ అంటే సరిపోదు.. దిల్లుండాల' అంటుందొక సత్తు చెంబు. 'మామూలు మట్టివా? ఢిల్లీ మట్టివా? మాట తప్పటానికి సిగ్గు లేదూ..' అని కూకలేస్తుంది ఇంకో చిల్లు చెంబు. 'ఇంతోటిదానికి ఇమానం ఎక్కి వచ్చిందట నీలాంటిదే' అని సెటైర్లేస్తుంది మరొక మరచెంబు.

బతుకు బందరు బస్టాండయింది అంటారే- అంతకన్నా దారుణంగా అయిపోయింది. తలెత్తు కోవటమే బరువైపోయింది! ఢిల్లీ నుంచి ఘనంగా వచ్చి అమరావతి బీడు భూముల్లో అతి హీనంగా పరువు పోగొట్టుకున్నట్టయింది. చీకటి వేళ ఇలా చాటుమాటుగా మాట్లాడుకోవటం తప్ప మరో గత్యంతరం లేకుండా పోయింది వాటికి. ఈ ఏడాది బడ్జెట్లోనైనా రాజధాని నిర్మాణానికి నిధులు వస్తాయని, రావాలని కొన్ని రోజులుగా నిద్రాహారాలు మాని ఎదురుచూశాయి ఢిల్లీ చెంబు, మట్టి.

'మార్పు లేదు. అంతా మామూలే! ఈ బడ్జెట్లోనూ మాటలే చెప్పారు. మూటలేమీ లేవు. ఇంతముందులా కనీసం ఊరడింపు కూడా లేదు. మీ చావు మీరు చావండని వదిలేశారు..' అంది చెంబు.

'అనాథగా వదలం అన్నారు. ఆదుకుంటాం అన్నారు. అన్ని హామీలూ నెరవేర్చుతాం అన్నారు. అన్నీ అబద్ధాలేనా?' అని బాధగా నిష్టూర్చింది మట్టి.

'ఆఖరి అంకం కూడా అయిపోయింది. ఇంక ఏ ఆశా మిగల్లేదు. హోదాకి సమాధి కట్టేశారు. ప్యాకేజీని ప్యాక్ చేసి పడేశారు. విశాఖపట్నానికి రైల్వే జోనూ లేదు. విద్యా సంస్థలూ లేవు. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్యాకేజీలూ ఉత్తుత్తి కబుర్లే! పేరు గొప్ప- ఊరు దిబ్బ..' చెంబు మహాగ్రహంగా ఇంతెత్తున లేచింది. 'ఇక మన కిలుం మనమే వదిలించుకోవాలి' అని ఖంగున మోగింది. 'నిలబెట్టి అడిగేయాలి' అని కోపంగా కంపించింది మట్టి.

వాటి ధాటికి మట్టి దిబ్బ కొంచెం కదిలింది. మిగతా చెంబులు ఒకదాన్నొకటి తాకి, ఖణేల్ ఖణేల్‌మని శబ్దం చేశాయి.

- సత్యాజీ

వాళ్లిద్దరూ పెద్దల నిర్ణయంతోనే పెళ్లి చేసుకున్నారు. అయితే కొన్ని కుటుంబసమస్యలు వారిద్దరి మధ్య మనస్పర్ధలకు దారితీశాయి. అవి చిలికి చిలికి గాలివానలా పెరిగి పెద్ద తుపానునే సృష్టించాయి. ఫలితం వారిద్దరి మధ్య అఘాతం ఏర్పడింది. పెద్దలూ వారిని కలపడంకన్నా విడదీయడానికే దోహదపడ్డారు. ఇరువైపులా కోర్టులో దావాలు వేసుకున్నారు. విడాకులు ఇస్తూ కోర్టు తీర్పు చెప్పేసింది. ఆమెకు తగిన నష్టపరిహారమూ చెల్లించాడు సదరు భర్త. ఇప్పుడామె తన భర్త తనకు కావాలంటూ 'ఐద్వా అదాలత్'కు వచ్చింది. చివరకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ వారం 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'లోని 'కేస్‌స్టడీ' చదవండి.



ఫ్యామిలీ కౌన్సెలింగ్

విడాకులొద్దు.. భర్తతోనే ఉంటా!

ఆమె పేరు చందన. అతని పేరు చంద్రశేఖర్.

చందనకు ఒక అక్క, తమ్ముడు ఉన్నారు. తల్లిదండ్రులు వృద్ధులు. అక్క పిల్లలకూ పెళ్లిళ్ళు అయిపోవడంతో ఆమె వారి వద్దే ఉంటుంది. తమ్ముడు పెళ్లి చేసుకుని, విదేశాల్లో ఉంటున్నాడు. దీంతో తల్లిదండ్రుల బాధ్యతను చందన మాత్రమే చూసుకోవాల్సి వచ్చింది.

చంద్రశేఖర్‌కు ఇద్దరు అన్నయ్యలు, ఒక తమ్ముడు, సోదరీ ఉన్నారు. తల్లిదండ్రులతో వారంతా ఉమ్మడి కుటుంబంగా ఉన్నారు.

చందనకు తల్లిదండ్రుల బాధ్యత ఉండటంతో తరచూ పుట్టింటికి వెళ్లడం.. రోజుల తరబడి అక్కడే ఉండడం జరిగేది. మెట్టినింట ఉమ్మడి కుటుంబం కావడం.. ఆ పరిసరాలు.. వారి మధ్య సఖ్యతను కలిగించడంకంటే దూరాన్నే పెంచాయి. వారిద్దరూ ఆ దూరాన్ని తగ్గించుకుని, కలిసి జీవించడం ఎలా? అనేది ఆలోచించలేదు. తల్లిదండ్రులు తమ అవసరాల కోసం కూతురి జీవితం గురించీ పట్టించుకోలేదు. చంద్రశేఖర్ ఉమ్మడి కుటుంబంలో వచ్చే సమస్యలతో సతమతమవుతూ వాటి నుంచి బయటపడలేక ఉక్కిరిబిక్కిరి అయ్యేవాడు. ఒకదశలో తన బాధనంతా భార్యతోనే పంచుకునేవాడు. ఈ పరిస్థితుల్లో అతని పట్ల ఆమెకు జాలి కలిగేది. అదే సందర్భంలో ఆమె తనతో ఉంటే బాగుండనుకుంటున్న సమయంలో పుట్టింట్లో ఆమె ఉండటం అతనికి అసంతృప్తిగా ఉండేది. ఈ పరిస్థితి కూడా వారి మధ్య దూరాన్ని పెంచింది. అలాంటి పరిస్థితుల్లో అతడు ద్వేషిస్తూ అనే మాటలు ఆమె మనసులో పెట్టుకునేది. అంతేకాదు ఆ మాటలన్నీ తల్లిదండ్రులతో, సోదరునితో చెప్పుండేది. వారు ఆమెకు సర్దిచెప్పకుండా, మరింత వ్యతిరేకతను పెంచేలా మాట్లాడేవారు. దాంతో చందన అతన్ని బయటకు వచ్చేయమని అడుగుతుండేది. తల్లిదండ్రుల ప్రభావంతో అతనిపై ఒకదశలో తీవ్రమైన ఒత్తిడీ తీసుకొచ్చింది. అతను తన కుటుంబం ఇన్నాళ్ళూ కలిసికట్టుగా ఉంది. తన వల్ల చెల్లాచెదురు కాకూడదని బలంగా అనుకునేవాడు. అయితే అక్కడ అంత సవ్యంగా లేదన్న విషయం అతనికీ తెలుసు. అక్కడ ఉండలేక, ఇటు భార్య చెప్పినట్లు బయటకు రాలేక చంద్రశేఖర్ ఇరకాటంలో పడ్డాడు.



చందన తన పట్టువదలకపోగా, అతన్ని తన తల్లిదండ్రులతోనే ఉండమని, అలా ఉంటేనే కాపురం చేస్తానంది. అందుకు అతను ఒప్పుకోకపోవడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయి, అక్కడే ఉంటోంది. ఈ పరిస్థితి చంద్రశేఖర్‌కి చాలా కోపం కలిగించింది. బయటకు రమ్మనడమే కాకుండా ఆమె తల్లిదండ్రులతో ఉండాలనడం అతను జీర్ణించుకోలేకపోయాడు. ఆమె ప్రతిపాదనను ఆమోదించకుండా పట్టుదలగా.. వెళ్లకుండా ఉండిపోయాడు. ఈ పరిస్థితుల్లో చంద్రశేఖర్ సోదరుని సలహాతో విడాకుల నోటీసు పంపాడు. ఆమె తన సోదరుని, తల్లిదండ్రుల సలహాతో మెయింటెనెన్స్ కోరుతూ కోర్టుకు అప్పీలు చేసుకుంది. ఇది చంద్రశేఖర్‌కు మరింత ఆగ్రహం కలిగించింది. ఈ పరిస్థితుల్లో ఇద్దరికీ నచ్చజెప్పేదిపోయి, కోర్టు ద్వారా విడాకులు తీసుకోవడానికే ఇరు కుటుంబాలు మొగ్గు చూపాయి. ఆమెకు నెలనెలా మెయింటెనెన్స్ ఇవ్వాలన్న కోర్టు తీర్పును అతను అనుసరించాడు. విడాకుల విషయంపై కౌన్సెలింగ్‌లో ఇద్దరూ ఏమాత్రం తగ్గకపోవడంతో విడాకులకు పేపర్లు సిద్ధమైపోయాయి. ఈ సందర్భంగా ఆమె 14 లక్షల రూపాయలు లాయరు ద్వారా డిమాండ్ చేసింది. చంద్రశేఖర్ ఎలాగోలా ఆమె అడిగిన మొత్తం ఇచ్చేశాడు. దాంతో కోర్టు వారికి విడాకులు మంజూరు చేస్తూ రెండు మూడు రోజుల్లో కాగితాలు ఇవ్వనుండగా.. చందన తన భర్త తనకు కావాలంటూ 'ఐద్వా అదాలత్'కు వచ్చింది.

> అతను నాకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. మొదటి నుంచీ అతని తీరు అంతే. తన మాట, బాధ నేను వినాలి తప్ప, నా వైపు నుంచి ఆలోచించరు.

చందన: నా భర్త నాకు కావాలి. నేను నా జీవితంలో మరొకరిని నా భర్త స్థానంలో ఊహించుకోలేక పోతున్నా. ఆయన ఇచ్చిన డబ్బులు ఆయనకే తిరిగిచ్చేస్తాను. మీరే ఎలాగోలా అతనితో మాట్లాడి, మమ్మల్ని కలపండి. నేను ఇటీవల ఒక పేపరులో కూడా చదివాను. విడాకులు తీసుకున్నా, మళ్లీ కలిసి ఉంటామంటే, కోర్టు అంగీకరించిందంట. నేను అతనితోనే ఉంటాను. అతను నాకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదు. మొదటి నుంచీ అతని తీరు అంతే. తన మాట, బాధ నేను వినాలి తప్ప, నా వైపు నుంచి ఆలోచించరు.

బాధ్యులు పంపిన లేఖ తిరిగి రావడంతో చంద్రశేఖర్‌కు ఫోన్ చేశారు.

చంద్రశేఖర్ : మీకు ఆమె ఏం చెప్పిందో.. ఏం చెప్తుందో నాకు తెలియదుగానీ.. ఆమె ఇప్పుడు కావాలంటే నేను వచ్చేయాలా? నన్ను ఎన్ని తిప్పలు పెట్టాలో అన్ని పెట్టింది. రూ. 14 లక్షలు అడిగితే ఎన్ని కష్టాలుపడ్డానో నాకు తెలుసు. ఇన్నిరోజులూ నేను కావాలని అనిపించలేదా? మా ఇద్దరికీ వయసు నలభైలు దాటిపోయాయి. ఇక అనవసరం.. ఈ చివరి జీవితం ఇలా గడిచిపోనివ్వండి. ఆమె ఇప్పుడు ఎందుకు కావాలంటుందో మాట్లాడి నాకు చెప్పండి.

బాధ్యులు ఆమె బాధను వివరించి, "మేము ఆమెతో మాట్లాడాం. మీరు ఇక్కడికి వస్తే సావధానంగా మాట్లాడుకోవచ్చు. మీవైపు నుంచీ వింటే సమస్య ఏమిటో మాకూ పూర్తిగా అర్థమవుతుంది. ఆమె తెలిసీ తెలియక ఎవరి సలహామేరకో నిర్ణయం తీసుకుని ఉండొచ్చు. ఇప్పుడు ఆమే మిమ్మల్ని కోరుకుంటుంది.. మీ డబ్బు మీకు తిరిగి ఇచ్చేస్తానంటోంది. ఒక్కసారి ఆమె వైపు నుంచి ఆలోచించవచ్చు కదా! మీకు ఆమె వల్ల ఏమైనా ఇబ్బందులుంటే మేము ఆమెకు కౌన్సెలింగ్ చేసి, చెప్తాం. మీవైపు మార్చుకోవాల్సినవి మీరూ మార్చుకుందురు. నలభైలు దాటినా మీరు విడాకులు తీసుకోకుండా ఉంటే, ఒకచోటే కలిసి జీవించేవారు కాదా?! అందుకే కలిసి ఉండటానికి వయసు సమస్య కాదు. అసలు సమస్య ఏమిటో అర్థంచేసుకుని, ఎవరి పొరపాట్లు వారు సరిజేసుకుంటే.. ఇద్దరూ కలుసుకోవడం.. కలిసి జీవించడం ఏమంత కష్టం కాదు" అన్నారు.

"మీరు ఎన్నన్నా చెప్పండి.. నాకు ఆమె వద్దు.. ఇక మీరు నాకు ఎప్పుడూ ఫోను కూడా చేయెుద్దు.. ప్లీజ్!" అంటూ అతను ఫోన్ కట్ చేశాడు.

బాధ్యులు ఏమన్నారంటే?!

చందనా! మీరు చాలా తొందరపడి నిర్ణయం తీసుకున్నారు. ఏదేమైనా ఇప్పుడు మీరు భర్తతోనే ఉండాలనుకోవడాన్ని మేమేమీ తప్పుపట్టడం లేదు. అతనిప్పుడు మన మాట వినే పరిస్థితిలో లేడు. మీరు ఇప్పటికీ అతను తిరిగి వస్తే.. మీ తల్లిదండ్రులతో కలిసి ఉండాలంటున్నారు. అతను కాదంటే వారిని హోమ్‌లో చేర్పించాలేమో.. చూడాలి.. అంటూ మీరింకా చాలా ఊగిసలాటలోనే ఉన్నారు. మన సమాజం అమ్మాయికీ తల్లిదండ్రుల బాధ్యత ఉంటుందన్న ఇంగితం తెలుసుకోవడం లేదు. అదే సందర్భంలో మీరు విడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఇరువైపుల కుటుంబసభ్యులకూ లేకపోవడం మీరు విడిపోవడానికి మరో కారణం. ఏమైనా మీ కోరిక న్యాయమైనదే. అయితే విడాకుల మీద జడ్జి గారు సంతకం చేయకపోతే మీకేమైనా అవకాశం ఉంటుంది. ఒకసారి జడ్జిగారిని కలిసి, మీ మనోవేదనను విన్నవించండి. ఆయన మీ ఇద్దరికీ కౌన్సెలింగ్ చేసి, ఒక్కటి చేసే అవకాశం ఉంది. అది సాధ్యంకాదంటే.. మరొక ప్రయత్నం మీ భర్తను కలిసి, మీరే ఒకసారి మాట్లాడి, ఒప్పిం చడం. అంతకు మించి మరో మార్గం లేదు. అయితే మీరు చదువుకున్నవారు డీలా పడిపోక, ధైర్యంగా ఉండండి.

భాధ్యులు చెప్పిన మాటలు విన్నాక ఆమె.. జడ్జిని కలిసి వివరిస్తానంటూ వెళ్లింది.

- శాంతిశ్రీ

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

క్షమించమని అడగండి !

తప్పు చేయడం మానవ సహజం. మరి ఆ తప్పును ఒప్పుకోవడమూ ఆ మనిషి నైతిక బాధ్యత. అలాంటప్పుడు క్షమించడం మంచి గుణం. అందుకే అన్నారు పెద్దలు.. క్షమాగుణాన్ని మించిన గుణం మరొకటి లేదని.

ఎవరైనా తెలిసోతెలియకో తప్పు చేసినప్పుడు ఒకసారి క్షమించమని చెప్పడంలో తప్పులేదు. పైగా ఇది మనిషిలోని సంస్కారానికి ప్రతీక. బద్ధశత్రువైనా సరే ఒకసారి "సారీ చెప్పి" మంచి మిత్రునిగా మార్చుకోవచ్చు. క్షమించే గుణం, క్షమించమని కోరే గుణం మనిషిలోని పరివర్తనకు ప్రతిరూపం. ఏవ్యక్తికీ శాశ్వతశత్రువులుగానీ, మిత్రులుగానీ ఉండరు. అయితే, తప్పు చేసినప్పుడు నిజాయితీగా ఒప్పుకునేవారే సంస్కారవంతులుగా, ఉత్తములుగా పేరు పొందుతారు. అపకారికి సైతం ఉపకారం చేయడం మహోన్నత వ్యక్తిత్వం. అపకారిని క్షమించడం కూడా మంచి మనస్తత్వానికి మచ్చుతునక లాంటిది. కాబట్టి ఇంట్లో, బయట, పనిచేసే చోట గానీ తెలిసీ తెలియక తప్పులు జరిగినప్పుడు క్షమించమని అడగడంలో తప్పులేదు. అంతేకాదు, ఒకసారి సారీ చెప్పడంవల్ల ఆ ఇద్దరి మధ్య సంబంధం మరింత బలపడుతుంది. అంతేకాదు, పనులు ముందుకు సాగుతాయి. లేకపోతే ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఉండి, వారి పనిపై, వ్యక్తిత్వంపై ప్రభావం చూపుతాయి. అది ఒత్తిడికి దారితీస్తుంది.



క్షమాగుణాన్ని అలవరుచుకోవడం వల్ల ఎలాంటి ఒత్తిడులు ఉండవని అనేక అధ్యయనాలు రుజువుచేశాయి. ఆరోగ్యానికీ ఎంతో మేలు. అందుకే, మన పట్ల మనంగానీ, ఇతరుల పట్లగానీ కఠినంగా వ్యవహరించకుండా సాధ్యమైనంతవరకూ సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకునేలా వ్యవహరించాలి. ఇతరులపట్ల కక్షను పెంచుకోవడంవల్ల మనసు అతలాకుతలం అవుతుంది. దాంతో ఒత్తిడి, ప్రతికూల భావాలు బయటకు వస్తాయి. కాబట్టి ముందుగా మన మనసును ఆధీనంలో ఉంచుకోవడం ముఖ్యం. దీనికి ఎదుటివారిపట్ల కోపాన్ని నియంత్రించుకోగలగాలి. ఇది క్షమాగుణాన్ని అలవరుచుకోవడం వల్లనే సాధ్యం. ఫలితం ఒత్తిడి దూరమవుతుంది. క్షమించమని అడగటానికి కొన్ని మార్గాలున్నాయి. వాటిలో కొన్ని...



పువ్వులంటే అందరికీ ఇష్టం. వీటిని ఇచ్చి క్షమించమని అడగటం ఉత్తమ మార్గం. ఇలా పువ్వులు చాలా చాలా రంగుల్లో ఉండటం, మంచి సువాసన కలిగి ఉండటంవల్ల ఎదుటివారిలో సానుకూల ఆలోచనలు వస్తాయి. అంతేకాదు, వారిద్దరూ కలిసి దిగిన ఫోటోలు ఉంటే వాటిపై 'ఐయామ్ సారీ' అని రాసి మెసేజ్, గ్రీటింగ్ ద్వారా ఇవ్వాలి. అవతలి వారికి నవ్వురాక మానదు. ఇలాంటి చిన్నచిన్న మార్గాలు ఎదుటివారిలో క్షమాగుణాన్ని పెంచుతాయి. గతంలో జరిగిన తప్పులను తవ్వుకోవడం వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు. ప్రతిరోజూ మనకు వచ్చే అనుభవాలతో కొత్తకొత్త పాఠాలు నేర్చుకోవాలి. ఆ తప్పు మరలా తిరిగి పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. అంతేకాదు, స్వయం తప్పిదాలను విస్మరించి, ఇతరులను నిందించడం సరికాదు. ఇవన్నీ మనిషిలో సానుకూల భావాలను పెంపొందించుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది.. అప్పుడే ఒత్తిడి దూరమై ప్రశాంతమైన జీవితం మన సొంతమవుతుంది. ★

మీ కోసం



నూనె పొంగకుండా ఉండాలంటే నూనెలో కొంచెం చింతపండు వేయాలి.

జీవన సౌరభం

ఒక మంచి పుస్తకాన్ని మళ్ళీ, మళ్ళీ చదివితే పాత స్నేహితుడిని కలిసినంత ఆనందం కలుగుతుంది.

సైకాలజీ

నేను చాలా అందంగా ఉంటాను. పీజి చదివాను. మా మేనమామ కొడుకు చాలా అమాయకంగా ఉంటాడు. వాళ్లకు చాలా ఆస్తిపాస్తులున్నాయి. ఆస్తి పక్కకు వెళ్లకూడదనే ఉద్దేశంతో అమ్మావాళ్లు నన్ను అతనికిచ్చి పెళ్లి చేస్తామని మామయ్యకు మాటిచ్చారు. నాకు ఈ పెళ్లి ఇష్టం లేదని ఎంత చెప్పినా వినటం లేదు. ఈ పెళ్లి నుంచి నేనెలా తప్పించుకోవాలో అర్థం కావడం లేదు. మంచి సలహా ఇచ్చి నన్ను కాపాడగలరు?

- ఓ సోదరి



నొచ్చుకోకుండా చెప్పండి!

విద్యాధికురాలైన మీరు మీ కాళ్లమీద నిలబడగలిగే ప్రయత్నం చేయండి. మీకంటూ ఒక స్థిరత్వాన్ని ఏర్పరుచుకోండి. ఈ క్రమంలో మీ తల్లిదండ్రులకు మీ మనసులోని మాటలను స్పష్టంగా చెప్పండి. కేవలం ఆస్తిపాస్తులు పోతాయి అనే ఆలోచనతో మీకిష్టంలేని పెళ్లి చేసినందువల్ల రాగల సమస్యల గురించి వారికి విడమరిచి చెప్పండి. వీలైతే సోదాహరణంగా కొన్ని ఉదాహరణలు చూపి కూడా చెప్పగలిగితే వారికి సులువుగా అర్థమయ్యే అవకాశం ఉంటుంది. మీరు వారి మాటకు విలువనివ్వడం లేదు అనే అభిప్రాయం వారు తీవ్రంగా వ్యక్తీకరిస్తుంటే.. వారి మాటలకు మీరు విలువనివ్వకపోవడం కాదు, మీ మనసులోని స్పష్టమైన ఆలోచనలను వ్యక్తం చేయడంలో భాగం మాత్రమేనని వారికి తెలియజేయండి. అలాగే జీవితాంతం కలిసి ఉండాల్సిన భార్యాభర్తలు ఇద్దరూ సమాన ఆలోచనాధోరణి, సమన్వయం లేకపోతే జీవితంలో రాగల సమస్యల గురించి వారికి అర్థమయ్యేలా చెప్పండి. మీ చదువు మీకిచ్చిన లోకజ్ఞానంతో వారు నొచ్చుకోకుండా చెప్పి చూడండి. ★



డా. పద్మజ, సైకాలజిస్టు

సెన్సెక్స్ ⬇ 840
35,066

నిఫ్టీ ⬇ 256
11,760

రూపాయి ⬇ 04 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.07



హైస్పీడ్ విద్యుత్ బైకులు...

హీరో ఎలక్ట్రిక్ అత్యధిక వేగం కలిగిన మూడు విద్యుత్ ద్విచక్ర వాహనాలను ఆవిష్కరించింది. 2018లో వీటిని దశల వారిగా మార్కెట్లోకి తీసుకురానుంది. ఆక్సేలీ-20ను గంటకు 110 కిలోమీటర్ల వేగం కలిగిన 4000 వాట్ మోటార్‌తో రూపొందించింది. వీటి ధరలను ప్రకటించలేదు.

బిత్తర పోయిన బిట్ కాయిన్

న్యూఢిల్లీ : ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్ కాయిన్ కేవలం 24 గంటల్లో ప్రపంచ వ్యాప్తంగా 100 బిలియన్ డాలర్ల విలువ కోల్పోయింది. భారత ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ దేశంలో క్రిప్టో కరెన్సీలను నిషేదిస్తున్నట్లు ప్రకటించడంతో ప్రపంచ మార్కెట్లో బిట్ కాయిన్ విలువ అమాంతం పడిపోయింది. ఒక్క రోజులోనే ఈ కరెన్సీ మార్కెట్ విలువ 112.6 బిలియన్ డాలర్లు పతనమయ్యిందని సిఎన్‌బిసి ఒక రిపోర్టులో పేర్కొంది. ప్రస్తుతం బిట్ కాయిన్ విలువ రూ.8,500 డాలర్లకు క్షీణించింది. గతేడాది డిసెంబర్ మధ్య నాటికి దీని విలువ గరిష్టంగా 20వేల డాలర్ల సమీపంలో నమోదయిన విషయం తెలిసిందే. కాగా తాజాగా ఇతర డిజిటల్ కరెన్సీలు ఇతెరియం, రిపల్ విలువలు కూడా 22 శాతం, 32 శాతం చొప్పున నష్టపోయాయి. సమీప రోజుల్లో బిట్ కాయిన్ విలువ 5000-10000 డాలర్ల మధ్యలోనే పరిమితం కావచ్చని పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి.

ఐటి నోటీసులు!

భారత ఆదాయపు పన్ను విభాగం బిట్‌కాయిన్స్‌లో పెట్టుబడులు పెట్టిన వారికి 'లక్షల సంఖ్య'లో నోటీసులు జారీ చేసినట్టు సమాచారం బిట్‌కాయిన్స్‌లో పెట్టుబడులు పెట్టిన వారి నుంచి పన్నులు వసూలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని సిబిడిటి చైర్మెన్ సుశీల్ చంద్ర తెలిపారు. బిట్‌కాయిన్స్ పెట్టుబడుల ద్వారా లాభాలు పొందిన వారు వాటిపై ముందస్తు పన్నులు చెల్లించలేదన్న విషయం పన్ను అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. మరికొంత మంది ఈ పెట్టుబడుల గురించి తమ పన్ను రిటర్నులలో పొందుపర్చలేదని తెలిపారు. గతేడాది డిసెంబర్ లో దేశవ్యాప్తంగా బిట్‌కాయిన్స్ లావాదేవీలు నిర్వహిస్తున్న ఎక్సేంజీలపై సర్వేలు నిర్వహించినట్టు సుశీల్ చంద్ర వెల్లడించారు.

మార్కెట్లకు 'ఫ్రై' డే



సెన్సెక్స్ 840 పాయింట్ల పతనం

5 లక్షల కోట్ల ఆవిరి

దలాల్ స్ట్రీట్‌లో రక్త కన్నీరు

రెండున్నరేళ్లలోనే అతిపెద్ద క్షీణత

ఎల్‌టిసిజి భయాల ప్రభావం

బడ్జెట్ నిరాశలు

10,800 దిగువకు నిఫ్టీ

ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

మోడీ ప్రభుత్వ చివరి బడ్జెట్ దలాల్ స్ట్రీట్‌ను ఒక కుదుపు కుదిపేసింది. బడ్జెట్ ముందు రోజల్లో తారాజువ్వాల దూసుకెళ్లిన మార్కెట్లు రెండో రోజూ తిరోగమన దిశను తీసుకున్నాయి. దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను ప్రవేశపెడుతున్నట్లు చేసిన ప్రకటన శుక్రవారం మార్కెట్లను తీవ్ర ఒత్తిడికి గురి చేసింది. గత రెండున్నరేళ్లలో ఎప్పుడూ లేని విధంగా కుదేలయ్యాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 839.41 పాయింట్లు లేదా 2.34 శాతం క్షీణించి 35,066కు పడిపోయింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 900 పాయింట్ల మేర దిగజారింది. ఉదయం 35,707.60 వద్ద మొదలైన సూచీ కొని నిమిషాల్లో ఓ స్థాయిలో 35,738 గరిష్ట స్థాయికి చేరినప్పటికీ అనంతరం వరుస అమ్మకాల ఒత్తిడితో ఓ దశలో ఏకంగా 35,006 వద్ద ట్రేడింగ్ నమోదయ్యింది. 2015 ఆగస్టు 24న అత్యధికంగా1,625 పాయింట్లు పడిపోయింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఎన్ఎస్ఇ నిఫ్టీ 256.30 పాయింట్లు లేదా 2.33 శాతం క్షీణించి 10,760.60కు పడిపోయింది. ఇంట్రా ట్రేడింగ్‌లో ఏకంగా 10,736 కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది.

రంగాల వారిగా..

బిఎస్ఇలో అన్ని రంగాల సూచీలు నష్టాల పాలయ్యాయి. రియాల్టీ సూచీ 6.28 శాతం, మౌలిక వసతులు 4.03 శాతం, విద్యుత్ 3.94 శాతం, కాపిటల్ గూడ్స్ 3.59 శాతం, ఆటో 3.47 శాతం, కన్సూమర్ డ్యూరెబుల్స్ 3.37 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 3.04 శాతం చొప్పున అధిక నష్టాల చవి చూసి మార్కెట్లను ఒత్తిడికి గురి చేశాయి. సెన్సెక్స్-30లో బజాజ్ ఆటో 5.12 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 4.62 శాతం, యాక్సిస్ బ్యాంకు 4.59 శాతం, మారుతి సుజుకి 4.44 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 4.15 శాతం, టాటా స్టీల్ 3.97 శాతం చొప్పున అధిక నష్టాల పాలైన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఎల్‌టిసిజి దెబ్బ..

ఈక్విటీల దీర్ఘకాల మూలధన పెట్టుబడుల (ఎల్‌టిసిజి)పై లాభాలు లక్ష రూపాయలు మించితే 10 శాతం పన్ను వసూలు చేయనున్నట్లు 2018-19 బడ్జెట్‌లో ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్‌ల నుంచి వచ్చే ఆదాయం పైనా పన్ను కట్టాల్సి రావడం మరింత ఒత్తిడిని పెంచింది. గురువారం సెషన్‌లో కూడా మార్కెట్లపై తీవ్ర ఒత్తిడి నెలకొని భారీ ఒడిదుడుకులకు గురైయ్యాయి. కాగా వారాంతం రోజున ఈ ప్రభావం పూర్తిగా బయటపడింది. ఎల్‌టిసిజి వల్ల అత్యధిక విలువ కలిగిన మదుపర్లు మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడానికి ఆసక్తి చూపారు.

విత్త లోటు..

2017-18లో జిడిపిలో విత్త లోటు 3.5 శాతానికి పెరగనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇంతక్రితం ఈ అంచనాలు 3.2 శాతంగా ఉంది. 2018-19లో ఇది 3.3 శాతానికి పెరుగొచ్చన్న ప్రభుత్వ విశ్లేషణలు మార్కెట్లపై విశ్వాసాన్ని దెబ్బతీశాయి. ద్రవ్యలోటు అంచనాలు పెరగడంతో వడ్డీరేటు కష్టమేనని కొన్ని రేటింగ్ సంస్థలు అభిప్రాయాలు వ్యక్తం చేశాయి.

ఆర్‌బిఐ సమీక్ష...

ఫిబ్రవరి 7న రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. ద్రవ్యోల్బణ భయాల నేపథ్యంలో వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చన్న అంచనాలు మార్కెట్లకు ప్రతికూలంగా మారాయి. మరోవైపు వచ్చే ఖరీఫ్‌లో ధాన్యం మద్దతు ధర పెంచ నున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీంతో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని ఆర్‌బిఐ అభిప్రాయపడింది.

అయోమయం..

బడ్జెట్‌లోని అనేక అంశాలు మదుపర్లను అయోమయానికి గురి చేశాయి. ప్రభుత్వం ఒక వైపు 7.5 శాతం వృద్ధి రేటు సాధిస్తామని జైట్లీ ప్రకటించడం, ఇదే సమయంలో విత్తలోటు పెరగనుందన్న పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం ఆర్థిక వ్యవస్థపై అనుమానాలకు దారి తీసింది. మరోవైపు అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు భారత వృద్ధి రేటును దెబ్బతీయ నున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ అంశాన్ని మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో విస్మరించిందన్న చర్చలు మార్కెట్లపై ప్రతి కూల ప్రభావాన్ని చూపాయి. 50 కోట్ల మందికి వైద్య బీమా అందిస్తామని జైట్లీ పేర్కొన్నప్పటికీ, దీనికి సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. కాగా దీనిపై మదుపర్లలో చాలా ఊహాగానాలు తలెత్తాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ప్రపంచ మార్కెట్లు..

అంతర్జాతీయ మార్కెట్లు కూడా ప్రతికూలతను ఎదుర్కోవడంతో ఈ ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లపై పడింది. జపాన్ ప్రత్యేక బాండ్లను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో జపనీస్ నిక్కీ 1.3 శాతం కోల్పోయింది. అదే విధంగా అసియాలోని హాంగ్‌కాంగ్‌కు చెందిన హాంగ్‌సేంగ్, షాంగై సూచీలు నష్టాల్లో నమోదయ్యాయి. దక్షిణ కొరియా కొస్పి ఒక్క శాతం విలువ కోల్పోయింది.

శుక్రవారం ఉదయం సమయంలో అంతర్జా తీయ ద్రవ్య మార్కెట్లో డాలర్‌తో రూపాయి విలువ తీవ్ర హెచ్చుతగ్గులకు గురైంది. ఉదయం 64.12 వద్ద మొదలైన సూచీ ఓ దశలో 64.20కు పడిపోయింది. తుదకు నాలుగు పైసల నష్టతో రూ.64.07 వద్ద ముగిసింది.

5 లక్షల కోట్లు ఫట్..

ఒక్క రోజు సెషన్ లోనే మదుపర్ల విలువ రూ.4.7 లక్షల కోట్లు తుడుచుకు పెట్టుకుపోయింది. దీంతో బిఎస్ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.148.4 లక్షల కోట్లకు దిగజారింది. ఇంతక్రితం సెషన్‌లో ఇది రూ.153.1 లక్షల కోట్లుగా ఉంది. మొత్తంగా 2,500 స్టాక్స్ నష్టపోయాయి. కాగా 300 స్టాక్స్ మాత్రం పెరిగాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 4 శాతం పతనమయ్యాయి. అన్ని రంగాల సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

రాష్ట్రాన్ని పరిగణించలేదు : ఫిక్కీ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాన్ని పరిగణలోకి తీసుకోలేదని ఫిక్కీ ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ఎమ్ ప్రభాకర్ రావు విమర్శించారు. రాష్ట్రంపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం చాలా నిరాశపర్చిందని ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ పన్ను 25 శాతానికి తగ్గించడంతో ఎస్ఎంఇలకు లబ్ధి చేకూరనుందని, దీంతో ఉపాధి కల్పనకు దోహదం చేయనుందన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చారన్నారు. ఆరోగ్య భీమా పథకం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు.

ఒరిగిందేమీ లేదు : పల్సస్ గ్రూప్ సిఇఒ

ఇది పూర్తిగా ఎన్నికల ముందు పాలకపక్ష మార్క్ బడ్జెట్‌గా ఉందని పల్సర్ గ్రూపు సిఇఒ డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. దీంతో పారిశ్రామికవేత్తలు, ఉద్యోగులకు ఒరిగిందేమీ లేదన్నారు. వ్యవసాయ, గ్రామీణ భారతదేశానికి అనుకూలంగ చాలా ప్రకటనలు చేశారని అయితే వాటికి సంబంధించిన కేటాయింపులు, రాయితీలు వాస్తవ రూపం దాల్చేసరికి ఎంత మేరకు లబ్ధిదారులకు అందుతాయే చూడాలన్నారు.

100 యూనివర్శిటీలు లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్

వచ్చే 2020 నాటికి దేశంలోని కనీసం 100 ప్రయివేటు యూనివర్శిటీలు, 300 కాలేజీలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఎరా ఫౌండేషన్ సిఇఒ మురళీధర్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం తాము 25 యూనివర్శిటీలు, 150 విద్యా సంస్థలకు కావాల్సిన ప్రవేశ పరీక్షలను కొమెడ్ కె, యూనిగేజ్ పేరుతో నిర్వహిస్తున్నామన్నారు.

టెట్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ద్రవ్యోల్బణం - పర్యవసానాలు



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 9000250127

ద్రవ్యోల్బణ రేటు

ఒక సంవత్సర కాలంలో ధరల సూచీ సంఖ్య (ప్రైస్ ఇండెక్స్ నెంబర్)లో వచ్చిన మార్పు శాతంగా ద్రవ్యోల్బణాన్ని వ్యక్తీకరించారు. దానినే ద్రవ్యోల్బణ రేటు అంటారు. దానిని కింది విధంగా లెక్కిస్తారు.

$$\text{ద్రవ్యోల్బణం రేటు} = \frac{PIN_1 - PIN_{(I-1)}}{PIN_{(I-1)}} \times 100$$

భారతదేశంలో 1993-94 సంవత్సరం నుంచి టోకు ధరల సూచీ లెక్కించడానికి 435 వస్తువుల ధరలను పరిగణనలోకి తీసుకుంటున్నారు. వాటిలో ప్రాథమిక వస్తువులు 98. ఇంధనం, శక్తి, లూబ్రికెంట్‌లు మొదలైన వాటికి సంబంధించిన వస్తువులు 19. పారిశ్రామిక వస్తువులు 318. అన్ని వస్తువులు సమాన భారితం కలిగి ఉండవు. ఆయా వస్తువుల వినియోగ ప్రధాన్యతనుబట్టి ఒక్కొక్క వస్తువుకూ ఒక్కొక్క భారితం కేటాయించారు.

ద్రవ్యోల్బణం - రకాలు

ధరల పెరుగుదల వేగాన్ని బట్టి, రేటును బట్టి, కారణాలనుబట్టి ద్రవ్యోల్బణాన్ని వివిధ రకాలుగా వర్గీకరిస్తారు. అవి కింద చూపిన విధంగా ఉంటాయి.

ఎ. ద్రవ్యోల్బణం రేటును బట్టి ద్రవ్యోల్బణం నాలుగు రకాలు.

1. పాకుతున్న ద్రవ్యోల్బణం (క్రీపింగ్ ఇన్‌ఫ్లేషన్)

ధరలలో పెరుగుదల నిదానంగా, స్వల్పంగా ఉన్నప్పుడు అలాంటి ద్రవ్యోల్బణాన్ని పాకుతున్న ద్రవ్యోల్బణం అంటారు. ఆచార్య కెంట్ ప్రకారం వార్షిక ద్రవ్యోల్బణం రేటు మూడు శాతం దాటకపోతే దానిని పాకుతున్న ద్రవ్యోల్బణం రేటు అనవచ్చు. అది చాలా తేలికపాటి ద్రవ్యోల్బణం. హానికరం కాదు. నిజానికి అది ఆర్థికాభివృద్ధికి అనుకూలమైనది. ద్రవ్యోల్బణంలో తొలిదశ పాకుతున్న ద్రవ్యోల్బణం.

2. నడుస్తున్న ద్రవ్యోల్బణం (వాకింగ్ ఇన్‌ఫ్లేషన్)

ఇది ద్రవ్యోల్బణంలో రెండో దశ. ఈ దశలో ద్రవ్యోల్బణం రేటు సంవత్సరానికి మూడు నుంచి నాలుగు శాతం మధ్య ఉండవచ్చు. నడుస్తున్న ద్రవ్యోల్బణాన్ని ప్రభుత్వం తీవ్రంగానే పరిగణించి అదుపు చేయాలి. లేకపోతే ఇది విస్తరించే ప్రమాదం ఉంది.

3. పరిగెత్తుతున్న ద్రవ్యోల్బణం (రన్నింగ్ ఇన్‌ఫ్లేషన్)

ద్రవ్యోల్బణం, రేటు సంవత్సరానికి నాలుగు నుంచి పది శాతం మధ్య ఏర్పడినప్పుడు దానిని పరిగెత్తుతున్న ద్రవ్యోల్బణంగా పేర్కొనవచ్చు. ఇది ఆర్థిక వ్యవస్థకు హానికరమైంది. దీనిని అదుపుచేయకపోతే అతి ద్రవ్యోల్బణానికి దారితీసే ప్రమాదం ఉంది. అది చాలా ప్రమాదకరమైంది. ఈ మధ్యకాలంలో (2008లో) భారతదేశంలో ఈ విధమైన ద్రవ్యోల్బణం ఏర్పడింది.

4. దూకుతున్న ద్రవ్యోల్బణం (గ్యాలోపింగ్ ఇన్‌ఫ్లేషన్)/ అతి ద్రవ్యోల్బణం (హైపర్ ఇన్‌ఫ్లేషన్)

ద్రవ్యోల్బణం రేటు పది శాతం దాటితే దూకుతున్న ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. దీనిని అతి ద్రవ్యోల్బణం అని కూడా అంటారు. ఇది ద్రవ్యోల్బణం యొక్క విపరీతమైన రూపం. ఈ స్థితిలో ద్రవ్యోల్బణం రేటు 100 శాతం చేరవచ్చు. దానిని దాటవచ్చు. జర్మనీ, రష్యా, హంగేరి దేశాలలో ఈ రకమైన ద్రవ్యోల్బణం ఏర్పడింది.

బి. కారణాలనుబట్టి ద్రవ్యోల్బణం కింది విధంగా రెండు రకాలు

1. డిమాండ్ ప్రేరిత ద్రవ్యోల్బణం (డిమాండ్-పుల్ ఇన్‌ఫ్లేషన్)

సమిష్టి సప్లయ్‌కి మించిన సమిష్టి డిమాండు ఏర్పడిన కారణంగా ఏర్పడిన ద్రవ్యోల్బణాన్ని డిమాండు ప్రేరిత ద్రవ్యోల్బణంగా వర్ణిస్తారు. ఆర్థికాభివృద్ధి ఫలితంగాగాని, ప్రభుత్వ వ్యయం పెరిగినందువల్లగానీ ప్రజల ఆదాయస్థాయి పెరిగి సమిష్టి డిమాండు పెరుగుతుంది.

2. వ్యయప్రేరిత ద్రవ్యోల్బణం (కాస్ట్-పుష్ ఇన్‌ఫ్లేషన్)

ఉత్పత్తి వ్యయం పెరిగిన కారణంగా వస్తువుల ధరలు పెరగవచ్చు. ఆ విధంగా ఉత్పత్తి వ్యయం పెరుగుదల వల్ల ఏర్పడిన ద్రవ్యోల్బణాన్ని వ్యయప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. కార్మిక సంఘాల ఒత్తిడిపై శ్రామికుల వేతనాలలో పెరుగుదల ఏర్పడినప్పుడు ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది. అదేవిధంగా భాటకం, వడ్డీరేటు, ముడిసరుకు ధరలు పెరగడంవల్ల కూడా ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది.

సమిష్టి డిమాండులో పెరుగుదల వల్ల ధరల స్థాయిలో ఏర్పడిన పెరుగుదలను డిమాండు ప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు. ఉత్పత్తి వ్యయంలో పెరుగుదలవల్ల ధరల స్థాయిలో ఏర్పడిన పెరుగుదలను వ్యయప్రేరిత ద్రవ్యోల్బణం అంటారు.

సి. ప్రభుత్వ ప్రతిస్పందన ప్రాతిపదికగా ద్రవ్యోల్బణాన్ని కింది విధంగా వర్గీకరించవచ్చు.

1. బహిరంగ ద్రవ్యోల్బణం (ఓపెన్ ఇన్‌ఫ్లేషన్)

ధరల పెరుగుదలను ప్రభుత్వం పాలనాపరమైన చర్యల ద్వారా నియంత్రించి ధరలను నిర్ణయించకుండా మార్కెట్ శక్తుల ప్రభావానికి వదిలేసినప్పుడు ఏర్పడే ద్రవ్యోల్బణం బహిరంగ ద్రవ్యోల్బణం.

2. అణచి ఉంచిన ద్రవ్యోల్బణం (సప్రెస్డ్ ఇన్‌ఫ్లేషన్)

ధరల పెరుగుదలను నియంత్రించి, పరిమితులు విధించి ధరలను నిర్ణయించినప్పుడు అణచివుంచిన ద్రవ్యోల్బణం ఏర్పడుతుంది. అంటే మార్కెట్ ధర అధికంగా ఉన్నా ప్రభుత్వం నియంత్రించిన లేదా నిర్ణయించిన ధర తక్కువగా ఉంచి ధరల పెరుగుదల బహిరంగంగా కనిపించదు. ప్రభుత్వం నియంత్రణ ఎత్తివేస్తే బహిరంగ ద్రవ్యోల్బణం కనిపిస్తుంది.

ద్రవ్యోల్బణ లక్షణాలు : ద్రవ్యోల్బణం కింది లక్షణాలను కలిగి ఉంటుంది.

1. నిరంతర ధరల పెరుగుదల
2. అధిక డిమాండు
3. అధిక ద్రవ్య సప్లయ్

ద్రవ్యోల్బణానికి కారణాలు : ద్రవ్యోల్బణానికి కారణాలను వివరించే సిద్ధాంతాలు మూడు ఉన్నాయి.

1. డిమాండు ప్రేరిత ద్రవ్యోల్బణ సిద్ధాంతం
2. వ్యయప్రేరిత ద్రవ్యోల్బణ సిద్ధాంతం
3. మిశ్రమ ద్రవ్యోల్బణ సిద్ధాంతం

అదేవిధంగా రెండు మార్గాలు ఉన్నాయి. 1. ద్రవ్యరాశి సిద్ధాంత మార్గం, 2. ద్రవ్యోల్బణ విరామ మార్గం. ఈ దశలో సిద్ధాంతాలు సమర్థించే వివిధ కారణాలను గురించి సాధారణ పరిజ్ఞానం ఏర్పరచుకుంటే చాలు.

స్థూలంగా ద్రవ్యోల్బణం అధిక డిమాండు, అల్ప సప్లయ్, ఉత్పత్తి వ్యయం పెరుగుదలవల్ల ఏర్పడుతుంది. ఈ పరిస్థితులకు దారితీసే పలు అంశాలు కింద వివరించారు.



1. వస్తువుల సమిష్టి డిమాండులో పెరుగుదల కారకాలు

ఎ. అధిక జనాభా పెరుగుదల రేటు
బి. ప్రభుత్వ ప్రణాళికా పెట్టుబడి, ప్రణాళికేతర పెట్టుబడి
సి. ఆర్థికాభివృద్ధి వల్ల ప్రజల తలసరి ఆదాయాలు పెరగడం
డి. ఉద్యోగితా కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం అధికంగా ఖర్చుచేయడం
ఇ. దీర్ఘకాలిక ఫలన కాలం ఉన్న అభివృద్ధి ప్రాజెక్టుల మీద ప్రభుత్వం భారీగా పెట్టుబడి పెట్టడం
ఎఫ్. ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సప్లయ్ పెరగడం
జి. అనుత్పాదక ఆర్థిక కార్యకలాపాలకు సరళమైన పరపతి లభించడం
హెచ్. ప్రభుత్వం లోటు బడ్జెట్ విధానాన్ని అనుసరించడం
ఐ. నల్లధనం ఉన్న వారు విలాసవంతంగా ఖర్చుచేయడం
జె. ప్రత్యక్ష పన్నురేట్లు తగ్గించడం

2. ఉత్పత్తి వ్యయం పెరుగుదల కారకాలు

ఎ. భూమి ధరలు, భాటకం, వేతన రేట్లు, వడ్డీరేట్లు పెరగడం
బి. మూలధన వస్తువులు, ముడిపదార్థాల కొరతవల్ల వాటి ధరలు పెరగడం
సి. పన్నుల రేట్లు పెరగడం
డి. యంత్రాల అరుగుదల ఎక్కువగా ఉండటం, ఆధునీకరణ జరగకపోవడం
ఇ. అధిక ధరల వద్ద యంత్రాలను, పనిముట్లను దిగుమతి చేసుకోవడం
ఎఫ్. వనరులు అభిలషణీయంగా పంపిణీ కాకపోవడం
జి. దేశీయ కరెన్సీ మూల్యహీనీకరణ
హెచ్. యాజమాన్య నిర్వహణలో అసమర్థత, దండుగ వ్యయం

3. అల్ప సప్లయ్ కారకాలు

ఎ. వ్యవసాయరంగంలో రుతుపవనాలు విఫలం కావడం, వరదలు, పంటలకు తెగుళ్ల రావడం, కల్తీ విత్తనాల వాడకం మొదలైనవి.
బి. సంస్థాగత పరపతి తగినంత లభించనందువల్ల పెట్టుబడి కొరత ఏర్పడటం
సి. ఉత్పాదకాలు, ముడిపదార్థాల సప్లయ్ లేకపోవడం లేదా కొరతగా ఉండటం
డి. విద్యుత్ కొరత, కార్మికుల అశాంతి మొదలైన కారణాలవల్ల స్థాపిత శక్తి పూర్తిగా వినియోగించుకోలేకపోవడం
ఇ. కొన్ని పరిశ్రమల దీర్ఘ ఫలన కాలం
ఎఫ్. దేశంలో వినియోగానికి సప్లయ్ తగ్గించి ఎగుమతులు చేయడం
జి. నల్ల బజారువల్ల వస్తువుల కృత్రిమ కొరత ఏర్పడటం

ద్రవ్యోల్బణం ప్రభావాలు

ద్రవ్యోల్బణం రకాలు, కారణాలు తెలుసుకున్న తరువాత స్థూల అర్థశాస్త్రంలో ద్రవ్యోల్బణ సమస్యకు ఇచ్చిన ప్రాధాన్యత అర్థం కావడానికి దాని ప్రభావాలు కూడా తెలుసుకోవడం అవసరం. ఆర్థిక వ్యవస్థలో జరిగే అన్ని ఆర్థిక కార్యకలాపాల మీద ద్రవ్యోల్బణం ప్రభావం ఉంటుంది. దీనిని కింది విధంగా వివరించవచ్చు.

1. ఉత్పత్తి మీద ప్రభావం

ఉత్పత్తిమీద ద్రవ్యోల్బణం ప్రతికూల ప్రభావం, అనుకూల ప్రభావం రెండూ కలగజేస్తుంది. ఆ ప్రభావం ద్రవ్యోల్బణం రేటు, ద్రవ్యోల్బణం రకాన్ని బట్టి ఉంటుంది.

సాంఘిక ప్రభావం

ఆర్థిక అసమానతలు విద్య, వైద్యం, ఉద్యోగిత విషయాలలో అవకాశాల లభ్యతలో కూడా అసమానతలకు దారితీస్తాయి. సామాన్య మానవుడి సంక్షేమం తీవ్రంగా దెబ్బతింటుంది. పేదరికం పెరుగుతుంది. పేదవారిలో నిస్సహాయత వారిని నేరాలవైపు, హింసవైపు మళ్లిస్తుంది.

రాజకీయ ప్రభావం

ద్రవ్యోల్బణం వల్ల ఆర్థిక సాంఘిక అసమానతలు పెరిగి నష్టపడినవారిలో తీవ్రమైన అసంతృప్తి కలుగుతుంది. అది రాజకీయ ఉద్యమాలకు దారితీస్తుంది. ప్రభుత్వం సక్రమంగా స్పందించకపోతే రాజకీయ ఉద్యమాలు ప్రభుత్వ స్థిరత్వానికి సవాలుగా పరిణమిస్తాయి. ప్రభుత్వాలు పతనం కావడం కూడా సంభవమే.

మొత్తం మీద ద్రవ్యోల్బణం హానికర ప్రభావాలనే ఎక్కువగా చూపిస్తుంది. అందువల్ల అది వాంఛనీయం కాదు. తగిన చర్యల ద్వారా ప్రభుత్వాలు ద్రవ్యోల్బణాన్ని అదుపుచేయడానికి కృషి చేయాలి.

ద్రవ్యోల్బణ నివారణ

ద్రవ్యోల్బణం నివారించడానికి ప్రభుత్వం కింది విధంగా పలు రకాల చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

1. సప్లయ్ తక్కువగా ఉన్న వస్తువుల ధరలు అదుపుచేయడానికి ఆ వస్తువులను దిగుమతి చేసుకోవాలి.
2. అల్ప సప్లయ్‌గల వస్తువుల పంపిణీని నియంత్రించి రేషనింగ్, కోటా పద్ధతులు ప్రవేశపెట్టాలి.
3. ధరలను నియంత్రించాలి, నల్ల బజారు అరికట్టాలి.
4. దీర్ఘకాలంలో ఉత్పత్తిని పెంచడానికి కృషిచేయాలి.
5. ద్రవ్య సప్లయిని, పరపతిని తగ్గించాలి. ఇందుకుగానూ ద్రవ్య, కోశ విధానాలు అనుసరించాలి.

★

సీఎస్ఐఆర్-సీఐఎంఎఫ్ఆర్‌లో 18పోస్టులు

జార్ఖండ్ ధన్‌బాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ (సీఐఎంఎఫ్ఆర్)18 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఇది కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందింది.

పోస్టు : టెక్నీషియన్.

విభాగాల వారీ ఖాళీలు : కార్పెంటర్-2, సర్వేయింగ్-3, ప్లంబర్-2, ఐటీ-3, ఎలక్ట్రీషియన్-4, మెషినిస్ట్-2, హౌస్‌కీపింగ్-2.

అర్హతలు : కనీసం 55 శాతం మార్కులతో పదోతరగతి/ తత్సమాన విద్యతోపాటు కార్పెంటర్/ సర్వేయర్/ పంప్ ఆపరేటర్/ ప్లంబర్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)/ ఎలక్ట్రికల్/ మెషినిస్ట్/ టర్నర్/ హౌస్ కీపింగ్‌లో ట్రేడ్ సర్టిఫికెట్ (ఐటీఐ/ ఎన్‌సీవీటీ/ ఎస్‌సీవీటీ), కనీసం రెండేళ్ల ఉద్యోగానుభవం.

వయసు : 28 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : ట్రేడ్ టెస్ట్/ స్కిల్ టెస్ట్.

దరఖాస్తు ఫీజు : రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ వికలాంగులు/ మహిళ/ డిపార్ట్‌మెంటల్ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆఫ్‌లైన్.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 15, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.cimfr.nic.in

ఉద్యోగాలు

'బెంగళూరు మెట్రో రైల్'లో 36 ఖాళీలు

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎమ్ఆర్‌సీఎల్). కాంట్రాక్టు పద్ధతిలో మూడేళ్ల కాలానికి 36 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు-ఖాళీలు : డిప్యూటీ చీఫ్ ఇంజనీర్-5, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-31. **విభాగం :** సివిల్.

వేతనం : డిప్యూటీ చీఫ్ ఇంజనీర్-రూ.1,22,630, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-రూ.67,430.

అర్హతలు : సివిల్‌లో బీఈ/ బీటెక్‌తోపాటు సంబంధిత రంగంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌కు కనీసం 15 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు కనీసం 12 ఏళ్ల ఉద్యోగానుభవం.

వయసు : డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌కు 55 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక : షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి.

హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ : ఫిబ్రవరి 17, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

వెబ్‌సైట్ : www.bmrc.co.in

మనోభావాలను దెబ్బతీయొద్దు

ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ స్టేట్ అధ్యక్షులు కిషోర్‌పాల్

ప్రజాశక్తి - మచిలీపట్నం (కృష్ణా)

పవిత్ర గ్రంథాలను తగలబెట్టి ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ స్టేట్ అధ్యక్షులు బి.ఎస్.కిరణ్‌పాల్ హెచ్చరించారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం చిత్రకళా సంపద్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. గత నెల 26న తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా సింగోటులో గుర్తుతెలియని వ్యక్తులు బైబిల్ ఔత్సాహికులను అడ్డుకుని బైబిల్‌ను బలవంతంగా లాక్కొని తగలబెట్టారని పేర్కొన్నారు. యుపిఎ కార్యదర్శి వి.ప్రేమ్‌కుమార్, పలువురు నాయకులు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.



ర్యాలీ

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని అనంతపురంలో సిపిఎం నాయకుల ర్యాలీ

హైకోర్టు రాయలసీమ ప్రజల హక్కు

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కల్చరల్

హైకోర్టు రాయలసీమ ప్రజల హక్కు అని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. శుక్రవారం అనంతపురంలో న్యాయవాదుల సంఘం తలపెట్టిన దీక్షకు , సిపిఎం నాయకత్వంలో పలువురు ప్రదర్శనగా వెళ్లి మద్దతు తెలిపారు. అక్కడి నుంచి స్థానిక క్లాక్‌టవర్ వరకు ర్యాలీగా వచ్చి సుమారు 40 నిమిషాలపాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమలో హైకోర్టును ఏర్పాటు చేయాలని, విభజన హామీలు అమలు చేయటంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ర్యాలీకి సిపిఎం అనంతపురం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ నాయకత్వం వహించారు. రాయలసీమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించకపోవటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కసాపురం రమేష్, ఐద్వా నాయకురాలు లక్ష్మిదేవి, రామాంజనమ్మ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కసాపురం ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సూర్యచంద్రయాదవ్, న్యాయవాదుల సంఘం సభ్యులు హరినాథ్‌రెడ్డి, రామలింగారెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్లు, లెక్చరర్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - కడపఅర్బన్

గురుకుల పాఠశాల, కళాశాలలో పనిచేసే పూర్తి స్థాయి గెస్ట్ టీచర్ల, లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని పూర్తిస్థాయి అతిథి ఉపాధ్యాయులు, బాలయోగి గురుకులం నాయకులు గురురత్నం, శశిధర్‌రెడ్డి, సుబ్బరాయుడు, అమరనాథరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకులాల్లో పది సంవత్సరాలుగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 18 బాలయోగి గురుకులాలు ఉన్నాయని పేర్కొన్నారు. 183 మంది ఉపాధ్యాయులు పూర్తిస్థాయి గెస్ట్ టీచర్లుగా, లెక్చరర్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. 2017-18 విద్యా సంవత్సరంలో పనిచేస్తున్న ఫుల్‌టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీనే వచ్చే సంవత్సరం కూడా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 20 నెలలుగా రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. పూర్తి వేతనం రూ.18 వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రైల్వే ఉద్యోగులు శుక్రవారం సాంబమూర్తినగర్లోని లోకోషెడ్‌లో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్‌సెంట్రల్ మజ్దూర్ యూనియన్ కాకినాడ బ్రాంచ్ చైర్మన్ సిహెచ్ కిరణ్‌కుమార్, సెక్రటరి ఎండి రియాజ్ మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ త్వరలో చలో డిఆర్ఎం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నూతన పింఛను స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంపాదనను కొల్లగొట్టేందుకు స్టాక్ మార్కెట్లను ఎంచుకోవడం సరికాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవి రవికృష్ణ, కెఎం.నాయుడు, వై.అర్జున్, సిహెచ్ రాజశేఖర్, వి.రామకృష్ణ, సురేష్‌బాబు, టి.శ్రీనివాస్, శేఖర్‌తోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

'పోలవరం' పేరుతో ప్రభుత్వం దగా

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నరసింహారావు

ప్రజాశక్తి-వీఆర్ పురం (తూర్పుగోదావరి)

రాష్ట్ర ప్రభుత్వం పోలవరం మాటున విలీన మండలాల్లోని రైతులను దగా చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.నరసింహారావు విమర్శిం చారు. తూర్పుగోదావరి జిల్లా వీఆర్ పురం మండలం రేఖపల్లిలోని బొప్పిన భీమయ్య భవనంలో రైతు సంఘం మండల కార్యదర్శి కుంజా నాగిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం సంఘం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ పోలవరం ముంపు భూములకు సాగు హక్కులు లేని కారణంగా ప్రభుత్వ రాయితీలు అందక రైతులు నానా అవస్థలు పడుతున్నారని చెప్పారు. ఇటువంటి భూముల్లో సాగుచేసుకుంటున్న రైతులను సాగుదారులుగా గుర్తించి ఎరువులు, విత్తనాలు రాయితీపై అందించాలని ఆయన డిమాండ్ చేశారు. పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు మండల కేంద్రాల్లో మార్కెట్ యార్డులను ఏర్పాటు చేయాలన్నారు. మండలాన్ని ఆనుకుని శబరి, గోదావరి నదులున్నా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా సాగునీరందక భూములు బీటలు వారుతున్నాయని విమర్శించారు. గ్రామాల్లో పనిచేయని ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించాలన్నారు.

బడ్జెట్‌పై టిడిపి వైఖరి స్పష్టం చేయాలి

- లోకేష్ వ్యాఖ్యలపై పవన్‌కళ్యాణ్ స్పందించాలి
- నేడు విజయవాడలో వామపక్షాల సమావేశం
- భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు, కార్యదర్శివర్గసభ్యులు వి కృష్ణయ్య తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై టిడిపి తన వైఖరిని స్పష్టం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పమిడిముక్కల లక్ష్మణరావు భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని చల్లార్చే విధంగా మాట్లాడటం మానుకుని ఇప్పటికైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం నుంచి నిధులు తీసుకు వచ్చే విషయంలో టిడిపి ప్రజలకు తగిన వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్థిక సర్వే ఆధారంగా వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. కేవలం రూ.లక్ష కోట్లు రుణాలు ఇస్తామని చెప్పడం తప్ప రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి రంగాలకు తగిన కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రయోజనాలనూ కాపాడలేకపోయిందనీ, కేవలం రాజకీయ పరమైన లబ్ధికోసం బిజెపి ప్రయత్నించిందనీ విమర్శించారు. కర్నాటకలో ఎన్నికలున్నందున నిధులు కొంత ఇచ్చినా.. ఇతర రాష్ట్రాలకు మొండిచేయి చూపారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను అసలు పట్టించుకోలేదన్నారు. బ్యాంకుల్లో రుణాలను మాఫీ చేయడం, పంటలకు పెట్టుబడికి తగ్గట్టుగా మద్దతు ధర ప్రకటించడంలో విఫలమైందనీ, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందనీ చెప్పారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, రాజధానికి నిధులు, ఆర్థికలోటును పూడ్చేందుకు నిధులు కేటాయించలేదన్నారు. ప్రత్యేక హోదా వద్దని, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని బిజెపి, టిడిపిలు ప్రజలను మభ్యపెడుతూ వచ్చాయన్నారు. కేంద్రంతో సఖ్యతగా ఉంటేనే నిధులు వస్తాయని చంద్రబాబు ఊదరగొట్టారని, ఇప్పుడు నిధులు రాకపోవడంపై చంద్రబాబు ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి పొత్తు కొనసాగి స్తుందా, పొత్తును తొలగించుకుని స్వతంత్ర్యంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేస్తుందా అని ప్రజలు నిలదీస్తునా న్నరన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధి కోసం టిడిపి తన విధానాన్ని స్పష్టం చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్ తదనంతరం ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిపై చర్చించేందుకు శనివారం అన్ని వామపక్ష పార్టీలు విజయవాడలో సమావేశమవుతు న్నాయని, ఈ సమావేశంలో రాష్ట్రాభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. వామపక్షాలు చేపట్టే ఉద్యమం తరువాత టిడిపి, వైసిపి బండారం బయటపడుతుందన్నారు. బిజెపితో విడి పోతే పవన్‌కళ్యాణ్‌తో కలిసి పనిచేస్తామని మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలపై పవన్‌కళ్యాణ్ తన వైఖరిని వెల్లడించాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం వామపక్షాలు చేసే ఉద్యమంలో టిడిపి కలిసివస్తే మంచిదేనన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి కృష్ణయ్య, గుంటూరు జిల్లా (తూర్పు), (పశ్చిమ) కమిటీల కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

'నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరు'

ప్రజాశక్తి - నెల్లూరు

నిర్బంధాలతో, కేసులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల ఆందోళనకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా నాయకత్వంపై మంత్రి నారాయణ ఆదేశాలతో తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ దమనకాండపై రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిఒ 279తో మున్సిపల్ కార్మికులను కాంట్రాక్టర్లకు అప్పగించి పౌరసేవలను ప్రయివేటు పరం చేసేందుకు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను తక్షణం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుకత్తి శ్రీనివాసులు, ఎం.మోహన్‌రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాసులు, పెంచలనర్సయ్య పాల్గొన్నారు.

కేంద్ర మంత్రులను టిడిపి ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగినందున టిడిపికి చెందిన కేంద్ర మంత్రులను చంద్రబాబునాయుడు ఉపసంహరించుకోవాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిల్లి కృపారాణి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉన్నప్పటికీ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించడం లేదన్నారు. కార్పొరేట్ వ్యాపారులైన టిడిపి ఎంపిలు తమ ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా రాష్ట్రాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అసెంబ్లీ సీట్లు పెంచుకోవాలన్న ఆసక్తి తప్ప, రాష్ట్ర ప్రయోజనాలు చంద్రబాబుకు పట్టడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి ఉత్తరాది రాష్ట్రాలపై ఉన్న చిత్తశుద్ధి, దక్షిణాది రాష్ట్రాలపై లేదని విమర్శించారు. రాష్ట్రానికి మంజూరైన 13 కేంద్ర విద్యాసంస్థలకు బడ్జెట్‌లో కేటాయించిన రూ.227 కోట్లు వాటి ప్రహరీల నిర్మాణానికీ సరిపోవని తెలిపారు. పార్లమెంట్ సభ్యులకు ప్రతి ఐదేళ్లకూ జీతాలు పెంచాలని బడ్జెట్‌లో నిర్ణయం తీసుకోవడం సిగ్గుచేటన్నారు. దేశాన్ని వెనక్కి నెట్టేలా ప్రధాని తీసుకున్న పలు నిర్ణయాలను టిడిపి బలపరిచిందని విమర్శించారు.

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభల సంరంభం

'ప్రచార భేరీ'లకు తీర ప్రాంతల్లో విశేష స్పందన

ఏలూరులో 25 మీటర్ల జెండాతో ర్యాలీ

జన స్వరం ఆడియో సీడీ విడుదల

ప్రజాశక్తి - పశ్చిమగోదావరి యంత్రాంగం

ఈ నెల 10, 11, 12 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించనున్న సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లాలో ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. రెండోదశ ప్రచారంలో భాగంగా గురువారం భీమవరం, నరసాపురం, తాడేపల్లి గూడెంలలో ప్రచారభేరి యాత్రలు ప్రారంభంకాగా.. శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా కొనసాగాయి. భీమవరం నుంచి బయల్దేరిన యాత్ర కాళ్ల, ఆకివీడు మండలాల మీదుగా సాగింది. ఆకివీడులో ప్రజలు.. యాత్రకు ఎదురెళ్లి ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి యాత్ర వెంట ర్యాలీ నిర్వహించారు. నరసాపురంలో ప్రారంభమైన యాత్ర నరసాపురం, మొగల్తూరు మండలాల్లో తీరప్రాంతం మీదుగా ముందుకు సాగింది. తీరప్రాంత రైతులు, మత్స్యకారుల నుంచి యాత్రకు అపూర్వ స్పందన లభించింది. తాడేపల్లిగూడెంలో ప్రారంభమైన యాత్ర నల్లజర్ల, దేవరపల్లి, చాగల్లు, కొవ్వూరు, తాళ్లపూడి మండలాల మీదుగా పోలవరం వరకూ సాగింది. ఈ యాత్రల్లో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు, సిపిఎం ప్రత్యామ్నాయ విధానాలను తెలుపుతూ ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు అందరినీ ఆలోచింపజేశాయి. నరసాపురం, ఏలూరు తదితర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



భీమవరంలో ఆడియో సీడీని విడుదల చేస్తున్న నేతలు

సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలను ప్రతిబింబిస్తూ ఏలూరులో ఆ పార్టీ కార్యకర్తలు 25 మీటర్ల సిపిఎం జెండాతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పవర్‌పేట రైల్వేస్టేషన్ నుంచి రమామహల్ సెంటర్ మీదుగా ఆర్ఆర్‌పేట పార్కు వరకూ ర్యాలీ కొనసాగింది. ఈ నెల 10న చలో భీమవరానికి తరలిరావాలని కార్యకర్తలు నినదించారు.

సిపిఎం 25వ రాష్ట్రమహాసభల నేపథ్యంలో రూపొందించిన 'జనస్వరం' ఆడియో సీడీ నేటి రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రతిబింబిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం చెప్పారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన సీడీని విడుదల చేశారు. సీతారాం మాట్లాడుతూ 'జనస్వరం-పోరుస్వరం-భీమవరం' టైటిల్ సాంగ్ ద్వారా భీమవరం ప్రాంత చారిత్రాత్మక పోరాట చరిత్ర, సాహిత్య చరిత్రను చాటిచెప్పామన్నారు.

నేడు 'రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి- ప్రత్యామ్నాయ మార్గాలు'పై సదస్సు

ఈ నెల 3న భీమవరంలో 'రాష్ట్ర వ్యవసాయాభివృద్ధి-ప్రత్యామ్నాయ మార్గాలు' అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా (డెల్టా) కమిటీ కార్యదర్శి బి.బలరాం తెలిపారు. సదస్సుకు ముఖ్య అతిథిగా సిపిఎం కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు (ఢిల్లీ) హాజరవుతారని పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

వామపక్షాల ఆధ్వర్యంలో భారీ నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ శుక్రవారం వామపక్షాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చెవిలో పువ్వులతో వినూత్న నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేశారు.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. పాలకొండలో రాస్తారోకో నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలో నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తూ విజయనగరం జిల్లా కేంద్రంలో ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. విశాఖ జిల్లా డుంబ్రిగుడలో సిపిఎం, సిపిఐ, వైసిపి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. జి.మాడుగులలో వైసిపి, సిపిఎం ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన చేసి రోడ్డుపై బైఠాయించారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఐదో నెంబరు జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నెల్లూరు సిపిఎం నగర కార్యదర్శి మూలం రమేష్ నాయకత్వంలో నగరంలోని సుందరయ్య విగ్రహం నుంచి గాంధీ బొమ్మ వరకు బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేశారు. వామపక్షాల ఆధ్వర్యంలో తిరుపతి కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. కర్నూలు నగరంలో కలెక్టరేట్ ఎదుట జరిగిన దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు మండలాల్లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎస్‌కెయూనివర్శిటీలో వైసిపి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. అక్కడే వంటావార్పు చేశారు.

23న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల 'చలో ఢిల్లీ'

- నాలుగో రోజూ సత్యాగ్రహ దీక్షలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఫోరం ఆఫ్ బిఎస్ఎన్ఎల్ యూనియన్స్, అసోసియేషన్స్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు చేపట్టిన సత్యాగ్రహ దీక్షలు నాల్గో రోజూ కొనసాగాయి. బిఎస్ఎన్ఎల్ సంస్థ నిర్వీర్యాన్ని వ్యతిరేకిస్తూ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత నెల 30న ఈ దీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 23న 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తామని వక్తలు తెలిపారు.

విజయవాడ చుట్టుగుంటలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.అశోక్ బాబు పాల్గొన్నారు. గుంటూరులో టెలికం జిఎం కార్యాలయం ఎదుట చేపట్టిన సత్యాగ్రహ దీక్షలు నాలుగు రోజుల నుంచి విజయవంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం అధిక సంఖ్యలో దీక్షల్లో పాల్గొని నిరసన తెలిపారు.

విజయనగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షా శిబిరాన్ని ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ అలుగు వెంకటరావు సందర్శించి మాట్లాడారు. కర్నూలులోని బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని ఒపిడిఆర్ జిల్లా అధ్యక్షులు ఖాజామోహినుద్దీన్, ప్రజాపరిరక్షణ సమితి నాయకులు బలరామ్ సందర్శించి మద్దతు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న దీక్షల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులు పాల్గొన్నారు. కడపలో బిఎస్ఎన్ఎల్ జిఎం కార్యాలయం ఎదుట, చిత్తూరు జిల్లా తిరుపతిలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట, ప్రకాశం జిల్లా ఒంగోలులో దూరసంచార భవనం వద్ద, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కోటగుమ్మం వద్ద, శ్రీకాకుళంలో సంచార నిగమ్ భవన్ వద్ద చేపట్టిన సత్యాగ్రహ దీక్షలు కొనసాగుతున్నాయి.



తోడరమల్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసులనాయుడు, ఎంవిఎస్.శర్మ

తోడరమల్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కంచరపాలెం, విశాఖ

41 సంవత్సరాలుగా ఉపాధి కల్పన, శిక్షణ శాఖలో పనిచేస్తూ ఎందరికో మార్గదర్శకంగా నిలిచిన విటి.తోడరమల్ సేవలు అభినందనీయమని వక్తలు కొనియాడారు. ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ తోడరమల్ ఉద్యోగ విరమణ సభ నగరంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకర్గం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలను పరిచయం చేయడంలో తోడరమల్ దిట్టని కొనియాడారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల విషయంలో ఉద్యమించిన చరిత్ర ఆయనకుందన్నారు. యువతను పోగేసి గ్రామాల్లో అక్షరయాత్రను నిర్వహించి చైతన్యకాంతులు పూయించారని తెలిపారు. అనంతరం ఐటిఐ కళాశాలల సిబ్బంది తోడరమల్‌ను ఘనంగా సన్మానించారు.

భరోసా ఏదీ?

కౌలు రైతులకు భరోసా ఏదీ?

- పంట రుణాలు ఇంత దారుణమా!
- వారి రక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి
- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - విజయవాడ

కేంద్ర బడ్జెట్‌లో కౌలు రైతులను ఆదుకోవడానికి ఎలాంటి భరోసా ఇవ్వలేదని, 50 శాతం భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులకు ఎలాంటి ప్రయోజనమూ కల్పించ లేదని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రంగారావు, పి.జమలయ్య స్పష్టం చేశారు. కౌలు రైతుల రక్షణ కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు విజయవాడలో శక్రవారం ఓ ప్రకటన చేశారు. దేశంలోని అన్ని బ్యాంకుల్లో ప్రజల డిపాజిట్లు రూ.95 లక్షల కోట్లు ఉన్నాయని, ఇందులో 18 శాతం వ్యవసాయానికి పంట రుణాలుగా ఇవ్వాల్సి ఉందన్నారు. గతేడాది రూ.10 లక్షల కోట్ల రూపాయలు పంట రుణాలుగా ఇస్తామని చెప్పి రూ.7 లక్షల కోట్లే ఇచ్చారని.. అవన్నీ భూయజమానులైన రైతులకే ఇచ్చారని, కౌలు రైతులకు ముష్టి విదిల్చారని విమర్శించారు. ఈ ఏడాది రూ.11 లక్షల కోట్ల రుణాలు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించడం వట్టి బూటకమని అన్నారు. బడ్జెట్‌లో వడ్డీ రాయితీకి నిధులు పెంచకుండా రుణాలిస్తామని చెప్పడం పచ్చి మోసమన్నారు. గతేడాది మద్దతు ధరలు తగ్గగా.. రైతాంగం దేశవ్యాప్తంగా రూ.36 వేల కోట్లు నష్టపోయిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి నిధులు తగ్గించారని, గతేడాది రూ.3,500 కేటాయించగా.. ఈయేడు రూ.1,500 కోట్లే కేటాయించారని పేర్కొన్నారు. మద్దతు ధరలు ప్రకటించేందుకు కమిషన్ వేస్తే సరిపోదనీ, పంటలన్నిటినీ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సాగు చేసే రైతుల కు రెట్టింపు ఆదాయం రావాలంటే బడ్జెట్‌లో 6.40 లక్షల కోట్లు నిధులు కేటాయిం చాలని కోరారు. పంటల బీమా పథకం కింద గతేడాది రూ.13 వేల కోట్లు కేటాయించారని, దీనిలో 30 శాతం పంటలే కవర్ చేశారని తెలిపారు. పైగా రైతులకు నష్ట పరిహారాలు ఇవ్వకుండా కొర్రీలు వేసి ప్రయివేటు బీమా కంపెనీలకు లాభం చేకూర్చడం సిగ్గుచేటన్నారు. గతేడాది కంటే ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి సాగు ఖర్చులు రైతుకు భారంగా మారాయన్నారు. ఏటా కౌలు రేట్లు పెరుగుతున్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరుగుతోందన్నారు. అప్పుల్లో కూరుకుపోతున్న రైతుల్లో 40 శాతం కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వివరించారు.

ఉపాధి హామీకి 2 శాతం నిధులేనా?

- రూ.లక్ష కోట్లు కేటాయించాలి
- కుటుంబానికి 200 రోజుల పని, రోజుకు రూ.500 వేతనమివ్వాలి
- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ

ప్రజాశక్తి - విజయవాడ

దేశంలో సుమారు 12 కోట్ల కుటుంబాలకు ఉపయోగపడే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2018-19 కేంద్ర బడ్జెట్‌కు తగిన ప్రాధాన్యత కల్పించలేదని, మొత్తం బడ్జెట్‌లో కేవలం రెండు శాతం అంటే రూ.55 వేల కోట్లే కేటాయించారని, దీనిని లక్ష కోట్లకు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఒక గురువారం ఒక ప్రకటన చేశారు. పెరుగుతున్న పేదరికాన్ని దృష్టిలో పెట్టుకొని కుటుంబానికి ఏడాదికి 200 రోజుల పని, రోజు వేతనం రూ.500కు పెంచాలన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రారంభమై 11 ఏళ్లు పూర్తగావస్తోందని, చట్టం ప్రారంభంలో రోజు వేతనం రూ.100 ఉండేదని, ఆనాడు కేంద్ర బడ్జెట్‌లో నాటి యుపిఎ-1 ప్రభుత్వం రూ.40 వేలు కోట్లు కేటాయించిందనిఅది నాటి బడ్జెట్‌లో సుమారు 4శాతమని గుర్తు చేశారు. పదేళ్ల అనంతరం ఉపాధి హామీ వేతనాలు రెట్టింపు అయ్యాయని, వివిధ రాష్ట్రాల్లో రూ.197 నుంచి రూ.300 వరకూ పెరిగాయని అన్నారు. ఈ లెక్కన రివైజ్డ్ వేతనాలు, పెరిగిన ధరలతో పోల్చుకుంటే కనీసం రూ.లక్ష కోట్లు పెరగాల్సి ఉందన్నారు. కానీ పెంచింది కేవలం రూ.55 వేల కోట్లు మాత్రమేనన్నారు. ఇందులో కూడా సుమారు రూ.1200 కోట్లకుపైగా పాత బకాయిలున్నాయన్నారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రూ.700 కోట్లకుపైగా కూలీలకు బకాయిలున్నాయని పేర్కొన్నారు. వాటిని నేటికీ చెల్లించలేదన్నారు. ఈ పాత బకాయిలు తీసేస్తే కేవలం రూ.38 వేల కోట్లే కేటాయించినట్లవుతుందని వివరించారు. ఇప్పటికే ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని, కూలీల కోసం వచ్చిన ఉపాధి నిధులన్నీ రాష్ట్రంలో నీరు-చెట్టు, సిమెంటు రోడ్లు, భవనాలక ోసం కేటాయించి కాంట్రాక్టర్లు అధికార పార్టీ నాయకులకు ఉపాధిగా మార్చేశారని విమర్శించారు. ఈ కారణంగా కూలీలు పెద్దఎత్తున వలసలు పోతున్నారన్నారు. వెళ్లివచ్చేటప్పుడ ప్రమాదాలకు లోనై చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చట్టం స్ఫూర్తినే బిజెపి-టిడిపి ప్రభుత్వాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయని, చట్ట రక్షణ కోసం వ్యవసాయ కార్మిక సంఘం మార్చి-ఏప్రిల్ నెలల్లో పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్‌కు బడ్జెట్‌లో మొండి చెయ్యి

ఉపముఖ్యమంత్రి ఆరోపణ

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో ఢిల్లీ మున్సిపల్ కార్పోరేషన్‌కు ఎటువంటి నిధులు కేటాయించలేదని, స్థానిక సంస్థల నిధి కింద రూ.1000 కోట్లు కేటాయించాలని కోరామని, అయినా కేంద్ర ప్రభుత్వం మొండి చెయ్యి చూపిందని ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ఆరోపించారు. 2015-20 సంవత్సరాలకు సంబంధించి 14వ ఆర్థిక సంఘం కేటాయింపుల ప్రకారమైనా నిధులు ఇవ్వాల్సి ఉందని సిసోడియా డిమాండు చేశారు. స్థానిక సంస్థల పన్నుల్లో తమకు కేటాయింపులు చేయడం లేదని అన్నారు.

ఎన్నికల ప్రచారం

ఈ నెల 18వ తేదీన త్రిపురలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలలో సిపిఐ(ఎం) అభ్యర్థుల విజయం కోసం ప్రచారం నిర్వహిస్తున్న ఆ పార్టి పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్



సంవత్సరాంతానికి ఎయిరిండియా ప్రైవేటీ కరణ పూర్తి

కేంద్ర మంత్రి జయంత్ సిన్హా

న్యూఢిల్లీ : ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా ప్రైవేటీకరణ సంవత్సరాంతానికి పూర్తవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఏడాది జూన్ నాటికి ఎయిరిండియాను వేలంలో గెలుచుకునే సంస్థ ఏదో తెలిసిపోతుందని భావిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా తెలిపారు. ఆ తరువాత సంవత్సరాంతానికి చట్టపరంగా సంస్థను బదిలీ చేయడం పూర్తవుతుందని చెప్పారు. అప్పులలో కూరుకుపోయిన ఎయిరిండియాను పునరుద్ధరించే చర్యలలో భాగంగా ప్రభుత్వం వ్యూహాత్మకంగా పెట్టుబడులు ఉపసంహరించాలని చూస్తోంది. దీనికి సంబంధించిన విధి విధానాలను రూపొందించేందుకు మంత్రుల బృందం కసరత్తు చేస్తున్నదని ఆయన చెప్పారు. ఎయిరిండియాలో ప్రతిపాదిత పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించిన సమాచార మెమోరాండంను త్వరలోనే విడుదల చేయనున్నట్లు సిన్హా ఢిల్లీలో విలేకరులకు తెలిపారు.

రైతులను అపహాస్యం చేసే బడ్జెట్

బృందాకరత్

అగర్తలా : స్వామినాథన్ కమిషన్ సిఫారసులను ఇప్పటికే అమలు చేశామని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్న దానిపై సిపిఎం నాయకులు బందాకరత్ శుక్రవారం కేంద్రాన్ని విమర్శించారు. వాస్తవానికి బడ్జెట్ రైతులకు పాలిట అపహాస్యం అయ్యిందని, ఎందుకంటే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసే పరిస్థితి లేదని సుప్రీంకోర్టుకు కొన్ని నెలల క్రితం లేఖ రాసిచ్చిన కేంద్రం, ఇప్పుడేమో అమలు చేశామని చెబుతున్నారని బృందాకరత్ విమర్శించారు. దీనికి భిన్నంగా, సామాన్య ప్రజలపై కేంద్రం పరోక్ష పన్నులను పెంచిందని ఆమె పేర్కొన్నారు. రబి పంటకు సంబంధించినంత వరకు, స్వామినాథన్ కమీషన్ సిఫార్సులు ఇప్పటికే అమలవుతున్నాయని పార్లమెంట్‌లో అసత్య ప్రకటన చేసిన ఆర్థికమంత్రికి వ్యతిరేకంగా సభాహక్కుల తీర్మానం తీసుకురానున్నామని తెలిపారు. రైతుల పంటకు కనీస మద్దతు ధర అందిస్తామని చెప్పడం ద్వారా పార్లమెంటును, దేశ ప్రజలను ఆర్థిక మంత్రి తప్పుదారి పట్టిస్తున్నారని ఆమె ఆరోపించారు.

లోయా మృతి పైనే విచారణ : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : సిబిఐ న్యాయమూర్తి లోయా మృతిపైనే సుప్రీం కోర్టు విచారణ చేస్తుందని అమిత్‌షా వ్యవహారంలో జోక్యం చేసుకోవద్దని కేసును విచారిస్తున్న చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ స్పష్టం చేసింది. శుక్రవారం లోయా మృతిపై విచారణ జరుగుతున్న సమయంలో న్యాయవాది దుష్యంత్‌దేవ్ బెంచ్ ముందు తన వాదనలు వినిపించారు. లోయా మృతి కేసులో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోకపోతే అది న్యాయవ్యవస్థకే మచ్చ తెస్తుందని, న్యాయవ్యవస్థ అపకీర్తిని మూటగట్టుకుంటుందని పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయకపోతే మన జడ్జిలను ఎవరు కాపాడుతారని దీపక్ మిశ్రాలతో కూడిన బెంచ్‌ను బాంబే లాయర్స్ అసోసియేషన్ తరుపున దుష్యంత్ దేవ్ ప్రశ్నించారు. లోయా కేసులో సాంఘీక కార్యకర్త తహసీన్ పూనవాలా స్వతంత్ర దర్యాప్తు కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

దక్షిణాసియా వ్యూహంలో భారత్‌దే కీలక పాత్ర: అమెరికా

వాషింగ్టన్: దక్షిణాసియా దేశాల విషయంలో తమ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యూహంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని అమెరికా రక్షణశాఖ పెంటగాన్ వెల్లడించింది. తమ యుద్ధ విమానాలకు ఏవియేషన్ మెయింటెనెన్స్, డెవలప్‌మెంట్ సాయం చేయటం ద్వారా భారత్ తమకు సహకరిస్తోందని పెంటగాన్ ప్రధాన ప్రతినిధి డన్నా వైట్ మీడియాకు చెప్పారు. అమెరికా-భారత్ సంబంధాలు బహుముఖమైనవని, భారత్ అభివృద్ధికి తాము అపారమైన సాయం అందిస్తున్నామని, వారు కూడా తమకు విమానాల మెయింటెనెన్స్ సౌకర్యం కల్పించి సహకరిస్తున్నారని ఆమె వివరించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్ పాత్ర గురించి మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆమె బదులిస్తూ ఇందుకు అవకాశం వుందని, తాము సంబంధాలు మెరుగుపర్చుకుని, భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకుంటున్న ప్రధాన దేశాలకు భారత్ చక్కని ఉదాహరణ అని, తాము ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించామని ఆమె వివరించారు. దక్షిణాసియా వ్యూహం విజయవంతం కావటంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

వాయుసేన అధికారి నిర్బంధం సహేతుకమే..! : నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ : కీలక సమాచారాన్ని శత్రుదేశాలకు అంద చేస్తున్న అభియోగంపై వాయుసేనకు చెందిన ఒక అధికారిని అరెస్ట్ చేయటాన్ని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ గట్టిగా సమర్థించారు. ఇది తొందరపాటుతో తీసుకున్న చర్యకాదని ఆమె శుక్రవారం ఇక్కడ మీడియా ప్రతినిధులకు స్పష్టం చేశారు. అత్యంత సున్నితమైన పత్రాలతో గూఢచర్యానికి పాల్పడిన ఆరోపణలపై వాయుసేన ప్రధాన కార్యాలయానికి చెందిన ఒక గ్రూప్ కెప్టెన్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ అరెస్ట్ విషయాన్ని ఇప్పటికే మంత్రికి వివరించామని అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ అధికారి అరెస్ట్‌ను సమర్థిస్తూ మంత్రి ఈ చర్య సహేతుకమైనదేనని స్పష్టం చేశారు. ఈ అధికారి శత్రువుల ఉచ్చులో కూరుకుపోయాడా అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారని వాయుసేన వర్గాలు వెల్లడించాయి. ఈ అధికారి కొన్ని అనుమతిలేని ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా 'అవాంఛనీయ కార్యకలాపాల'కు పాల్పడ్డాడని ఈ వర్గాలు వివరించాయి.

ఎలక్టోరల్ బాండ్లపై సిపిఎం పిటిషన్

మొదటి పేజీ తరువాయి

విధానంపై సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, డివై చంద్రచూడ్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎన్నికల బాండ్లపై కేంద్రాన్ని వివరణ కోరింది. సిపిఎం తరపు సీనియర్ న్యాయవాది, మాజీ అడిషనల్ సోలిసిటర్ జనరల్ రాజు రామచంద్రన్ వాదనలు వినిపించారు. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేందుకే కేంద్రం ఈ విధానాన్ని తీసుకొచ్చిందని సిపిఎం తన పిటిషన్‌లో పేర్కొంది. 2013 కంపెనీ చట్టం ప్రకారం కేంద్రం ఈ విధానాన్ని తీసుకొచ్చినట్లు చెబుతోందని, కానీ ఇది రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషన్‌లో వివరించింది. రాజకీయ పార్టీలకు కార్పొరేట్ డొనేషన్లకు సంబంధించిన వివరాలు వెల్లడి కావని తెలిపింది. దీంతో రాజకీయ అవినీతి పెరుగుతుందని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని నిర్లక్ష్యం చేయడమేనని స్పష్టం చేసింది. ఎలక్టోరల్ బాండ్లతో అవినీతి ఊతమిచ్చినట్లు అవుతుందని, రాజకీయ పార్టీలకు వచ్చే నిధుల్లో స్కామ్‌లు జరుగుతాయని పేర్కొంది. రాజకీయ పార్టీలకు ఎవరు నిధులు ఇస్తారో? ఎవరు తీసుకొంటారో? పేర్కొనవసరం లేదని ఎలక్టోరల్ బాండ్ల విధానంలో ఉందని, ఇది రాజ్యాంగ వ్యతిరేక చర్య అని పేర్కొంది. 1991 సుప్రీం కోర్టు తీర్పు, రాజ్యాంగంలోని 19(1) ఆర్టికల్ ప్రకారం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య రాజ్యాంగ వ్యతిరేకమని పిటిషనల్ పేర్కొన్నారు. ఫైనాన్స్ చట్టంలోని 11,137,154 సెక్షన్‌ల ప్రకారం కూడా కేంద్ర బాండ్ల విధానం రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉందని సిపిఎం తరపు సీనియర్ న్యాయవాది రాజు రామచంద్రన్ పేర్కొన్నారు. గత బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ల విధానాన్ని ప్రకటించింది.

రాజ్యాంగాన్ని కాపాడాలి: సీతారాం ఏచూరి

ఎలక్టోరల్ బాండ్ల విధానంతో రాజ్యాంగానికి ముప్పు వాటిల్లుతుందని, ఈ విధానం రాజ్యాంగ నిబంధనలకు విఘాతం కలిగిస్తుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. ఈ విధానాన్ని ప్రతిపాదించినప్పుడు పార్లమెంట్‌లోనే అభ్యంతరాలు లేవనెత్తామని, ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో కూడా సిపిఎం ఎంపిలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తారని ఏచూరి తెలిపారు. కేంద్రం కొన్ని సవరణలు చేస్తూ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని, అందులోనే ఎలక్టోరల్ బాండ్లు పేర్కొందని గుర్తు చేశారు. లోక్‌సభలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకి పూర్తి మెజార్టీ ఉండటంతో సవరణలు ఆమోదించుకున్నారని, కానీ రాజ్యసభలో అడ్డుకున్నామని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, కార్పొరేట్లను కాపాడేందుకే ఈ విధానం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

మసకబారుతున్న మోడీ ప్రభ...!

- ఉత్తర భారతంలో వ్యతిరేకత
- ముందస్తు ఎన్నికలకు ప్రణాళికలు



న్యూఢిల్లీ: గత సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యరీతిలో ఉప్పెనలా ఎగసిపడిన ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా ప్రాభవం క్రమేపీ మసకబారుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. తాజాగా రాజస్థాన్, బెంగాల్ ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి వీరికి గొంతులో పచ్చి వెలక్కాయలా మారింది. 2014లో మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన బిజెపి యుపిలో తన మిత్రపక్షం అప్నాదళ్‌తో కలిసి 73 స్థానాలను దక్కించుకున్న విషయం తెలిసిందే. రాజస్థాన్‌లో మొత్తం 25 స్థానాలు, గుజరాత్‌లో 26 స్థానాలను దక్కించుకుని క్లీన్ స్వీప్ చేసింది. ఈ విజయాలతో అనూహ్య రీతిలో '56 అంగుళాల'మేర ఛాతీని విస్తరించుకున్న మోడీ తన సన్నిహితుడైన అమిత్‌షాను పార్టీ అధ్యక్షుడిగా నియమించుకున్నారు. ఫలితంగా బిజెపి ఇప్పుడు టూ-మెన్ పార్టీగా మారిపోగా మోడీ కేబినెట్ నామమాత్రంగా కార్డ్‌బోర్డ్ కటౌట్‌లకు మాత్రమే పరిమితమైంది. రాజస్థాన్ ఉప ఎన్నికల్లో ఎదురైన ఓటమి ఇప్పుడు ఈ నాయకద్వయానికి మేలుకొలుపు కావాలని, వీరు వాస్తవ పరిస్థితులు గుర్తించాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. తమకు లభించిన విజయాలపై హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ 'ఉత్తర భారత రాజకీయాల్లో రానున్న మార్పునకు ఇది దిక్సూచి' అని అభివర్ణించారు. ప్రస్తుతానికి దీన్ని అతిశయోక్తిగా భావించినప్పటికీ, గత ఎన్నికల్లో దేశాన్ని కుదిపేసిన మోడీ మ్యాజిక్ ఇప్పుడు మసకబారుతోందని మాత్రం చెప్పకతప్పదు. పార్లమెంట్‌కు ముందస్తు ఎన్నికలు, స్మార్ట్ మనీపై కేంద్రంలో ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ముందస్తు ఎన్నికలకు వెళ్లటం ద్వారా ప్రస్తుతం చీలికలు పేలికలుగా వున్న ప్రతిపక్షాన్ని, ఎదురయ్యే ప్రభుత్వ వ్యతిరేకత ముప్పును ఎదుర్కొనేందుకు ఈ నాయకద్వయం సిద్ధమవుతోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. 2017 ఏప్రిల్‌లో పెహ్లూఖాన్‌ను కొట్టిచంపిన ఘటనతో కరుడుగట్టిన హిందూత్వ రాజకీయాలకు రాజస్థాన్ ప్రయోగశాలగా మారింది. ఇటీవల కర్నిసేన ఆగడాలకు బిజెపి మౌన మద్దతును కూడా ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. బిజెపి అనుసరిస్తున్న 'విభజించి పాలించే' రాజకీయాలు బీటలు వారుతున్న విషయాన్ని తాజా ఉప ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఎన్నికల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఇప్పటికప్పుడు రాజస్థాన్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ మొత్తం క్లీన్ స్వీప్ చేసే అవకాశాలే కన్పిస్తున్నాయి. రెండు,మూడేళ్ల క్రితం దేదీప్యమానంగా వెలిగిన తమ ప్రాభవం క్రమంగా మసకబారుతుండటం ఇటు మోడీకి, అటు అమిత్‌షాకు మింగుడు పడని విషయమే. యుపి సిఎంగా ఆదిత్యనాథ్ నియామకం కూడా ఈ నాయకద్వయం అనుసరిస్తున్న చీలిక ఎత్తుగడలకు మరో స్పష్టమైన ఉదాహరణగా చెప్పవచ్చు. బిజెపి ప్రాభవం హిందీ భాషా ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన ప్రాథమిక సత్యాన్ని కూడా ఇది నిరూపిస్తోంది. తూర్పు, దక్షిణ ప్రాంతాలలో పార్టీని విస్తరిస్తామని పార్టీ నాయకత్వం చెబుతున్నప్పటికీ, కర్నాటకలో మినహా అది ముందుకుసాగటం లేదు.

గుజరాత్ పరాభవం

తనను తాను గుజరాత్ ప్రైడ్‌గా మోడీ అభివర్ణించుకుంటూ ఇటీవల స్వయంగా రాష్ట్రంలో చుట్టబెట్టి ప్రచారం నిర్వహించినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో లభించిన స్థానాలు రెండంకెల స్థాయిని మించలేదు. కాంగ్రెస్ బహిష్కృత నేత మణిశంకర్ అయ్యర్ చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలను అనుకూలంగా మల్చుకునేందుకు ప్రయత్నించినా కాంగ్రెస్ నుండి గట్టి పోటీనే ఎదుర్కోవాల్సి వచ్చింది. అమలుకు నోచని హామీలు నానాటికీ పేరుకుపోతుండగా మరోవైపు అభివృద్ధి, సుపరిపాలన వంటి మోడీ నినాదాలు శుష్కనినాదాలుగానే మిగిలిపోతున్నాయి. మోడీని అధికారంలోకి తీసుకొచ్చిన మరో అంశం అవినీతిపై ఉక్కుపాదం మోపుతామన్న హామీ. ఈ దిశగా ఇంతవరకూ ఎటువంటి చర్యా లేదు. 2జి కుంభకోణం కేసు కొట్టివేత, రాబర్ట్ వాద్రా కేసులో పురోగతి లేకపోవటం ఈ అంశంలో మోడీ వైఫల్యానికి నిదర్శనాలుగా చెప్పుకోవచ్చు. అదే విధంగా రుణాలెగ్గొట్టి విదేశాలకు పారిపోయిన విజయ్ మాల్యా, కామన్వెల్త్ క్రీడల్లో లలిత్ మోడీ అవినీతి, ఆయుధాల డీలర్ సంజయ్ భండారీ ఉదంతాలు సైతం మోడీ అవినీతి వ్యతిరేకతలోని డొల్లతనాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

ఢిల్లీ చెప్పుల కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం

న్యూఢిల్లీ : ఢిల్లీలోని పీరాగర్హి ప్రాంతంలోని ఒక చెప్పుల ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. దాదాపు 20 అగ్నిమాపక వాహనాలు అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించాయి. చెప్పుల కంపెనీకి చెందిన బేస్‌మెంట్, మొదటి, రెండు అంతస్తులు అగ్నికీలల్లో చిక్కుకున్నాయి. మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నంలో అగ్నిమాపక సిబ్బంది ఒకరు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ లోపల ఎవరూ లేరు. ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. తెల్లవారు ఝామున 2.30 గంటల సమయంలో ప్రమాదం జరిగిందని, మంటలను అదుపులోకి తెచ్చేందుకు చాలా సమయం పట్టిందని, ప్రస్తుత పరిస్థితి అదుపులోనే ఉందని అగ్నిమాపక శాఖ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రమాదం జరగడానికి కొన్ని రోజుల ముందు ఢిల్లీలోని బవానా పారిశ్రామిక ప్రాంతంలో బాణా సంచా గోడౌన్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించి 10 మంది మహిళలతో సహా 17 మంది మృతి చెందిన సంగతి తెలిసిందే.

ఢిల్లీలో భవనాల 'సీలింగ్' వ్యతిరేకిస్తున్న వ్యాపారస్తులు

రెండు రోజుల బంద్‌కు పిలుపు

న్యూఢిల్లీ : బిజెపి నేతృత్వంలోని మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన భవనాల సీలింగ్ కార్యక్రమాన్ని నిరసిస్తూ ఢిల్లీలోని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సిఎఐటి) రెండు రోజుల బంద్ పిలుపునిచ్చింది. అందులో భాగంగా శుక్రవా రం పలు వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. వాణిజ్య కార్యక లాపాలకు ఉపయోగించుకుంటున్న నివాస భవనాలను ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ సీల్ చేస్తోంది. దీనిపై సిఎఐటికి చెందిన ప్రవీణ్ ఖండేల్వాల్ స్పందిస్తూ కార్పొరేషన్ చేపట్టిన చర్య నగర ఆర్థిక వ్యవస్థకు హాని కలిగించేదిగా ఉందని పేర్కొన్నారు. "దాదాపు 25,000 మార్కెట్లు మూత పడనున్నాయి. దాదాపు 500 మార్కెట్లలో వ్యాపారాలు నిర్వహించుకుంటున్న వారు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్పొరేషన్ ప్రస్తుతం అనుసరిస్తున్న సీలింగ్ విధానం ఆర్థిక వ్యవస్థకు హానికరం" అని ఆయన అన్నారు.

కాస్‌గంజ్ అల్లర్లపై అట్టుడికిన రాజ్యసభ

పలుసార్లు సభ వాయిదా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉత్తర ప్రదేశ్‌లోని కాస్‌గంజ్‌లో చెలరేగిన అల్లర్లపై రాజ్యసభ అట్టుడికింది. శుక్రవారం సభ ప్రారంభం కాగానే సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) సభ్యులు పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో సభలో గందరగోళం నెలకొంది. దీంతో డిప్యూటీ చైర్మన్ కురియన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. తరువాత ప్రారంభమైన సభలోనూ అదే పరిస్థితి కొనసగాంది. మరోవైపు ఆమాద్మీ పార్టీ నుంచి కొత్తగా ఎన్నికైన సభ్యుల సైతం వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన తెలిపారు. దేశ రాజధానిలో చేపట్టిన సీలింగ్ డ్రైవ్‌పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

తొలుత ఎస్పీ నేత రామ్‌గోపాల్ యాదవ్ కాస్‌గంజ్‌లో చెలరేగిన ఘర్షణల అంశాన్ని సభలో లేవనెత్తారు. కాస్‌గంజ్‌లో మైనార్టీలకు వ్యతిరేకంగా దాడులు జరిగాయని, వారిని అణిచివేశారని, వారి గృహాలను నాశనం చేశారని పేర్కొన్నారు. దీనిపై రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ జోక్యం చేసుకొని, ఈ అంశంపై నోటీసు ఇవ్వండి చర్చిద్దామని అన్నారు. దీనికి నిరసనగా ఎస్పీ సభ్యులంతా నినాదాలు చేస్తూ, వెల్‌లో దూసుకెళ్లి పోడియంను చుట్టిముట్టారు. 15 మంది ఎస్పీ, ఆప్ ఎంపిలు వెల్‌లో నినాదాలు చేశారు. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన "తిరంగా యాత్ర"లో ఘర్షణలు చెలరేగిన సంగతి తెలిసిందే. చందన్ గుప్తా అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోవడంతో హింస చెలరేగింది. కాస్‌గంజ్ అల్లర్లపై ప్రస్తుతం ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నారు.

మాల్దీవుల మాజీ అధ్యక్షుడిని విడుదల చేయాలి

తాజా దర్యాప్తు, విచారణ చేపట్టాలని సుప్రీం ఆదేశాలు

మాలె : మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ మరో 8మంది ప్రతిపక్ష నేతలను విడుదల చేయాలని మాల్దీవుల సుప్రీం కోర్టు ఆదేశించింది. వారిని విచారించడం అటు రాజ్యాంగాన్ని,, ఇటు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. అయితే వారిపై సరికొత్తగా విచారణ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరింది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన తొలి నేత నషీద్‌ను 2012లో పదవీచ్యుతుడిని చేసినప్పటి నుండి దేశంలో రాజకీయ అశాంతి చెలరేగింది. తీవ్రవాదం అభియోగాలపై విచారణ జరిపిన అనంతరం నషీద్‌కు 13ఏళ్ల జైలుశిక్ష విధించారు. కాగా, ఈ విచారణను తొందరపాటుగా, అక్రమమైనదిగా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ విమర్శించారు. రాజకీయ దురుద్దేశపూరితమైన దర్యాప్తు, విచారణ నిర్వహించేలా ప్రాసిక్యూటర్లు, న్యాయమూర్తులను ప్రభావితం చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది.

మలయాళ నటి అనూషపై లైంగిక దాడి

తిరువనంతపురం : రైలులో ప్రయాణిస్తున్న మళయాళ నటిపై గురువారం అర్ధరాత్రి ఒక వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగుళూరు సెంట్రల్, తిరువనంతపురం మధ్య నడుస్తున్న మావెలి ఎక్స్‌ప్రెస్‌లో చోటు చేసుకుంది. దక్షిణాది సినిమాల్లో నటించిన మళయాళ నటి అనూష సంతోష్ మాట్లాడుతూ తను కన్నూర్ రైల్వే స్టేషన్‌లో ఎక్కి రైల్లో నిద్రపోతుండగా తన పెదవులను, చేతిని ఎవరో తడుముతున్నట్లు ఉండగా కళ్ళు తెరిచే సరికి ఒక వ్యక్తి కనిపించాడని పేర్కొంది. దీనితో తాను భయపడినట్లు పేర్కొన్నారు. వెంటనే అతని చర్యలను ప్రతిఘటించానని, తన బెర్తుకు దగ్గరలోని వ్యక్తిని పిలువగా, ఆయన స్పందించలేదని పేర్కొన్నారు. తనకు సహాయం చేయడం కోసం కథారచయిత ఉన్ని, మరో ప్రయాణికుడు తప్ప మరెవ్వరూ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అఫ్సాను రద్దుచేసే పరిస్థితి లేదు

మెహబూబా ముఫ్తి

జమ్మూ : సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం (అఫ్సా) రద్దు చేసేందుకు ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితి అనువుగా లేదని జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తి శుక్రవారం పేర్కొన్నారు. షోపియాన్ సంఘటనలో సైన్యం కౌంటర్ ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని ముఫ్తి సమర్థించారు. కాల్పులపై తమ వాదనకు అనుగుణంగా వారు చేశారని అన్నారు. దీనిపై ఏ చర్య అయినా తీసుకోవడానికి ముందుగా ఇరు పక్షాల వాదనలను వింటామని చెప్పారు. లోయలో పోలీసు, భద్రతా బలగాల కదలికలను తగ్గించాలని భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రక్తపాతం, హింసాకాండ పెరుగుతుండడంతో భద్రతా బలగాల అధికారాలు, వారి కదలికలు కూడా పెరుగుతున్నాయన్నారు. భారత సైన్యం ప్రపంచంలోకెల్లా అత్యంత క్రమశిక్షణ కలిగిన బలగాలని ఆమె వ్యాఖ్యానించారు. కాగా షోపియన్ ఘటనపై దర్యాప్తుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని ఒమర్ అబ్దుల్లా కోరారు.

రాజ్యాంగ ధర్మాసనానికి 'జల్లికట్టు' పిటిషన్లు

నివేదించిన సుప్రీం



న్యూఢిల్లీ : జల్లికట్టు, ఎడ్ల పందాలను తమ సాంస్కృతికపరమైన హక్కుగా భావించి వాటిని పరిరక్షించాలంటూ తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యక్తులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీం కోర్టు శుక్రవారం నాడు రాజ్యాంగ ధర్మాసనం పరిశీలనకు నివేదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 29(1) ప్రకారం ఈ హక్కులను పరిరక్షించాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు. ఈ అంశంపై రాజ్యాంగ ధర్మాసనం తుది నిర్ణయం తీసుకునేందుకు వీలుగా ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, న్యాయమూర్తి రోహింటన్ ఫాలీనారీమన్‌తో కూడిన ధర్మాసనం ఐదు ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని రూపొందించింది. గతంలో ఈ అంశంపై న్యాయమూర్తి నారీమన్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

ప్రత్యేకం

కూతలు ఎక్కువ... కేటాయింపులు తక్కువ

- బడ్జెట్‌లో జైట్లీ మాయ
- వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి నిధుల్లేవు
- సంక్షేమ పథకాలకు కోత



న్యూఢిల్లీ: వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి బాగాలేదని, అందుకే ఆ రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించామంటూ ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం దూరదర్శన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కానీ వాస్తవం వేరే విధంగా ఉంది. ఈ రంగాలకు కేటాయింపుల్లో పెద్దగా పెరుగుదల లేదు. గ్రామీణ ప్రజానికానికి మేలు చేసే వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమ పథకాలకు గత ఏడాది బడ్జెట్ పెరుగుదలతో పోల్చితే ఈ ఏడాది కేటాయింపులు తక్కువగా ఉన్నాయి. అంతేకాక జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో చెప్పినదాని కన్నా వాస్తవ కేటాయింపులు చాలా తక్కువగా ఉన్నాయి.

గత ఏడాదితో పోల్చుకుంటే తక్కువే

వ్యవసాయానికి గత ఏడాదితో పోల్చితే 12.8 శాతం అదనంగా నిధులు కేటాయించారు. గత ఏడాది కూడా ఇంతే మొత్తంలో అంతక్రితం ఏడాదితో పోల్చుకుంటే అదనపు నిధులు కేటాయించారు. అంటే వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని చెప్పుకుంటున్నా అదనంగా నిధులు అయితే కేటాయించలేదు. గ్రామీణాభివృద్ధికి ఇంకా ఘోరం. గత బడ్జెట్‌లో ఈ రంగానికి 19 శాతం అదనంగా నిధులు కేటాయించగా, ఈ ఏడాది కేవలం 1.8 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. అదే విధంగా సామాజిక సంక్షేమ పథకాలకు గత ఏడాది 21.4 శాతం నిధులు అదనంగా కేటాయించగా, ఈ ఏడాది 14.5 శాతం నిధులు మాత్రమే అదనంగా కేటాయించారు. ఆరోగ్య రంగానికి కూడా ఈ బడ్జెట్‌లో 2.8 శాతం మాత్రమే అదనంగా కేటాయించగా, గత ఏడాదిలో 36.5 శాతం అదనంగా కేటాయించారు.

నిధులు ఎక్కడ?

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గత బడ్జెట్‌లో కేటాయించినంత మాత్రమే 55 వేల కోట్లు కేటాయించారు. ఈ మొత్తం గడిచిన ఏడాది వేతనాలు చెల్లించేం దుకు కూడా పరిపోదు. చాలా రాష్ట్రాల్లో వేతన బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోయి ఉన్నాయి. గత ఏడాది బకాయిలనే కేంద్ర ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదు. ద్రవ్యోల్బణం కారణంగా వేతనాలు పెరిగాయి. దీనికనుగుణంగా నిధుల మొత్తం పెరగకపోవడంతో చేసే పనుల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో గ్రామీణ ఆదాయాల్లో పెరుగుదల లేక ప్రతికూల ఫలితాలు వెలువడుతాయి. పదివేల కోట్లతో మత్స్యపరిశ్రమ, పశు సంవర్ధక పరిశ్రమ అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు జైట్లీ ప్రకటించారు. కానీ వాస్తవంగా బడ్జెట్‌లో 47 కోట్లు మాత్రమే కేటాయింపులు చేశారు. గ్రామీణ సంతలను గ్రామీణ వ్యవసాయ మార్కెట్లుగా అభివృద్ధి చేసేందుకు రెండు వేల కోట్ల రూపాయలతో వ్యవసాయ మార్కెట్ మౌలికసదుపాయాల నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు. కానీ బడ్జెట్ కేటాయింపుల్లో గ్రామీణ సంతల గురించిన ప్రస్తావనే లేదు.

గ్రామీణ విద్యుత్ సరఫరాకూ అదే స్థితి

విద్యుత్ సరఫరా లేని గ్రామాల్లో కాంతులు నింపేందుకు ప్రధానమంత్రి సౌభాగ్య యోజన కింద 16వేల కోట్ల రూపాయాలను ఖర్చు చేయబోతున్నట్లు జైట్లీ చెప్పారు. 2017 నుండి 19లోపు ఈ పథకం కింద 16,320 కోట్ల రూపాయాలు ఖర్చు చేయాలని గతంలోనే ఆమోదించారు. ఈ పథకం కోసం కేంద్రప్రభుత్వం 12,320 కోట్ల రూపాయలు సమకూర్చాల్సి ఉంది.

సంక్షిప్తం

కొండచరియలు విరిగి పడటంతో ముగ్గురు జవాన్లు మృతి

జమ్ము : మంచుతో కూడిన కొండ చరియలు విరిగి పడటంతో శుక్రవారం ముగ్గురు జవాన్లు మృతి చెందగా, మరొకరికి గాయాలైనట్లు అధికారులు పేర్కొన్నారు. మచిల్ సెక్టార్‌లోని సొనాపాండి గలిలో ఎల్ఒసి వద్ద సుమారు 4:30 గంటలకు భూమి స్వల్పంగా కంపించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో మచిల్ సెక్టార్, ఉత్తర కాశ్మీర్, కుప్వారాల్లోని ఆర్మీ సెక్టార్‌లపై మంచు పెళ్లలు విరిగి పడటంతో ముగ్గురు ఆర్మీ జవాన్లు మృతి చెందారని అధికారులు పేర్కొన్నారు. హవల్దార్ కమలేష్ కుమార్, నాయక్ బల్‌బీర్, రాజీందర్‌లు మృతి చెందినట్లు గుర్తించారు. గాయపడిన వ్యక్తి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా వున్నట్లు తెలిపారు.

శ్రీనగర్, సోఫియాన్ జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో ఆంక్షలు

శ్రీనగర్ : శ్రీనగర్, సోపియాన్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో అధికారులు ఆంక్షలు విధించారు. పౌర హత్యలకు నిరసన వెల్లువెత్తుతున్న నేపథ్యంలో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శ్రీనగర్‌లోని నోవహట్ట, ఖన్యార్, రైనవారీ, మహార్గంజ్, సఫకాదల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆంక్షలు విధించినట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు నగరంలోని మైసుమా, క్రాల్‌కుద్ ప్రాంతాల్లో ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు.

రైలు ఢీ కొని నలుగురు మృతి

న్యూఢిల్లీ : బీహార్‌లో శుక్రవారం ఉదయం సివాన్ వద్ద ఉన్న రైల్వే ట్రాక్ దాడుతుండగా ఐదుగురిని రైలు ఢీ కొట్టింది. వారణాసి డివిజన్ సివాన్-థానే సెక్షన్‌లో సివాన్ అమ్రేలీ స్టేషన్‌కు మధ్యలో రైలు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

పోలెండ్‌పై ఇయు ద్వంద్వ ప్రమాణాలు

బుఖారెస్ట్ : యురోపియన్ కౌన్సిల్‌లో తమ ఓటు హక్కును తొలగించడాన్ని ద్వంద్వ ప్రమాణాలు పాటించే యత్నంగా పోలెండ్ వ్యాఖ్యానించింది. ఇది ఏమాత్రం అంగీకార యోగ్యం కాదని , ఈ అంశంపై తగిన సమర్ధించుకోవడానికి చర్యలు తీసుకుంటామని పోలెండ్ విదేశాంగ మంత్రి జాక్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన రొమేనియాలో పర్యటిస్తున్నారు. లిస్బన్ ఒప్పందంలోని 7వ అధికరణను క్రియాశీలం చేయడం ద్వారా ఓటింగ్ జరగకుండా నివారించాలని భావిస్తున్నట్లు ఇయులోని పలు సభ్య దేశాలు సంకేతాలు వెలువరించాయని జాక్ తెలిపారు.



కరచాలనం
చైనా పర్యటన సందర్భంగా చైనా రాజధాని బీజింగ్‌లో అధ్యక్షుడు సీ జిన్‌పింగ్‌తో కరచాలనం చేస్తున్న బ్రిటిష్ ప్రధాని థెరిస్సా మే

ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయసేకరణ

చైనా ప్రధాని లీ కెకియాంగ్

బీజింగ్: ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు రూపొందించిన ముసాయిదాపై చైనా ప్రధాని లీ కెకియాంగ్ గురువారం నాడు విద్య, శాస్త్ర-సాంకేతిక రంగాలు, సంస్కృతి, ఆరోగ్యం, క్రీడల రంగాలకు సంబంధించిన ప్రతినిధులతో పాటు కొంతమంది ప్రజా ప్రతినిదులతో సంప్రదింపులు జరిపారు. ఈ సమావేశానికి ఉప ప్రధానులు ఝాంగ్ గావోలి, వాంగ్‌యాంగ్ కూడా హాజరయ్యారు. ఈ నివేదికను మెరుగుపరిచే అంశంపై తొమ్మిది మంది ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు అందించారు. సమావేశానికి హాజరైన వారికి ముందుగా కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసిన ప్రధాని లీ, ప్రభుత్వ పనితీరును మెరుగుపర్చుకునేందుకు మరిన్ని సలహాలు సూచనలు ఇవ్వాలని ఆహ్వానించారు. దేశంలోని సెంట్రల్, పశ్చిమ ప్రాంతాలలో ఉన్నత స్థాయి యూనివర్శిటీల నిర్మాణంలోనూ, ప్రతిభకు పెద్దపీట వేయటంలోనూ ప్రభుత్వం ప్రోత్సాహం చూపాలని వుహాన్ యూనివర్శిటీ అధ్యక్షుడు డౌజియాన్‌కాంగ్ సూచించారు. దీనిపై స్పందించిన ప్రధాని లీ ప్రభుత్వం అన్ని స్థాయిలలో విద్యను అభివృద్ధి చేస్తూ, అందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తోందని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని వివరించారు. ప్రజలతో మమేకం కావటం ద్వారా ప్రభుత్వం తన పనితీరును మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం వుందని ఆయన అభిప్రాయపడ్డారు.

శరణార్థులుండేది 60 రోజులే : పాక్

ఇస్లామాబాద్ : ఆఫ్ఘన్ శరణార్థులు దేశంలో వుండే కాలపరిమితిని పాకిస్తాన్ ప్రభుత్వం 60రోజులకు పొడిగించింది. అయితే సిఫార్సు చేసిన దానికన్నా తక్కువ కాలాన్నే పొడిగించడంతో వేలాదిమంది శరణార్థులను హింసాకాండతో అట్టుడుకుతున్న ఆఫ్ఘన్‌కు తిప్పి పంపేందుకు పాక్ ప్రభుత్వం సమాయత్తమవుతుందనే భయాందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం పాకిస్తాన్‌లో 25లక్షలమంది ఆఫ్ఘన్ శరణార్థులు నివసిస్తున్నారు. వీరిలో కొంత మంది అయితే 1979 నుండి ఉన్నారు. వారికి రిజిస్ట్రేషన్ కార్డులు జారీ చేశారు. అంటే చట్టబద్ధమైన హోదా వచ్చినట్లే. అయితే ఇటీవల కాలంలో పాక్, ఆఫ్ఘన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొనడంతో ఆఫ్ఘన్ శరణార్థులను తిప్పి పంపేయాలనే ఆలోచన చేస్తోంది. ఈ పరిణామాల పట్ల ఆందోళనలు కూడా నెలకొన్నాయి.

అమెరికా చర్యలతో
ఉభయ కొరియాల సంబంధాలకు చేటు

ఉ.కొరియా ఆందోళన

ఐక్యరాజ్యసమితి: కొరియా ద్వీపకల్పంలో అమెరికా చేపడుతున్న చర్యల కారణంగా ఉభయకొరియాల మధ్య సంబంధాలు దెబ్బతినే ప్రమాదం వుందని ఉ.కొరియా హెచ్చరించింది. అమెరికా-ద.కొరియా కొనసాగిస్తున్న సైనిక విన్యాసాలు, ఉ.కొరియాకు వ్యతిరేకంగా అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యల వంటివి పరిస్థితిని మరింత విషమింపచేస్తాయని ఉ.కొరియా విదేశాంగ మంత్రి రి యాంగ్‌హో ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా తన అణు విమాన వాహక నౌకలను మోహరించటం, ముందస్తు ప్రణాళిక ప్రకారం సైనిక విన్యాసాలు కొనసాగించటం వంటి చర్యలకు వెంటనే తెరదించాలని ఆయన కోరారు. ఉభయ కొరియాల మధ్య ఉద్రిక్తతలను రెచ్చగొడుతూ అమెరికా



కొనసాగిస్తున్న ఈ ప్రమాదకర క్రీడ పట్ల మౌనం వహించకుండా జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాలని ఆయన ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రపంచం మొత్తం అణుయుద్ధ ప్రమాదం బారిన పడే అవకాశం వుందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గుటెరస్‌కు రాసిన లేఖను శుక్రవారం సమితి సభ్యదేశాల ప్రతినిధులకు అందచేశారు. అమెరికా చర్యలన్నీ అణుయుద్ధానికి తమను రెచ్చగొట్టే విధంగా వున్నాయని, వీటితో ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న ఉభయకొరియాల సంబంధాలు మరింత క్షీణించటంతో పాటు ఉద్రిక్తతలు పెరిగే అవకాశం వుందని ఆయన ఈ లేఖలో పేర్కొన్నారు. తమ దేశంపై విధించిన కఠినమైన ఆంక్షల ఫలితంగానే తాము చర్చలకు దిగివచ్చామంటూ అమెరికా ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఉభయకొరియాల మధ్య సంబంధాల మెరుగుదల ప్రక్రియను స్వాగతించిన ఐరాస భద్రతా మండలి దీనిని అడ్డుకునేందుకు కొన్ని దేశాలు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని ఆయన కోరారు.

ట్రంప్ ప్రభుత్వం నుండి వైదొలగిన మరో అధికారి ఔట్

వాషింగ్టన్ : అమెరికా విదేశాంగ శాఖలో మూడవ ర్యాంక్ అధికారి టామ్ షానన్ తన పదవికి రాజీనామా చేశారు. విదేశాంగ శాఖలో రాజకీయ వ్యవహారాల విభాగంలో అండర్ సెక్రటరీగా చేస్తున్న షానన్ విదేశాంగ శాఖలో అత్యంత సీనియర్ అధికారి. 34ఏళ్ళకు పైగా సాగిన ఆయన కెరీర్‌లో ఆరుగురు అధ్యక్షులను, 10మంది విదేశాంగ మంత్రులను చూశారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన రాజీనామా లేఖలో తెలిపారు. 'ఈ నిర్ణయం నా వ్యక్తిగతం. నా కుటుంబానికి పూర్తిగా సమయాన్ని కేటాయించాలని భావించాను. నా జీవితాన్ని పూర్తిగా సమీక్షించుకుని, మిగిలిన జీవితానికి కొత్త దిశా నిర్దేశాన్ని చేసుకోవాలని భావిస్తున్నాను.' అని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. రిటైరవాలన్న తన నిర్ణయాన్ని బుధవారం విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌కి తెలియచేసిన షానన్ ఇటీవల తన విధి నిర్వహణలో భాగంగా కొన్ని సంక్లిష్టమైన, కీలకమైన అంశాలపై కృషి చేశారు. ట్రంప్ అధ్యక్షుడు అయిన దగ్గర నుండి సీనియర్ దౌత్యవేత్తలు వరుసగా రాజీనామాలు చేస్తూ వస్తున్న క్రమంలోనే షానన్ కూడా రాజీనామా చేయడం గమనార్హం.

తీవ్రవాదులపై పాక్ చర్యలు తీసుకోవాలి

మరోసారి స్పష్టం చేసిన అమెరికా

వాషింగ్టన్ : తీవ్రవాదులపై పాక్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తాము కోరుకుంటున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. ఇటీవలే ఆఫ్ఘనిస్తాన్‌లో పర్యటించి వచ్చిన డిప్యూటీ విదేశాంగ మంత్రి జాన్ సుల్లివన్ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి నెలకొనేందుకు పాకిస్తాన్ తన వంతు కృషి చేయాలని కూడా భావిస్తున్నట్లు తెలిపారు. ఆఫ్ఘన్ నాయకత్వంతో జరిపిన చర్చల్లో ఈ విషయాలు ప్రస్తావనకు వచ్చాయని ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. ఆఫ్ఘనిస్తాన్‌లో హింసాకాండ పెచ్చరిల్లకుండా వుండాలంటే పాకిస్తాన్‌లో ఆశ్రయం పొందుతున్న తీవ్రవాదులపై చర్యలు తీసుకోవడం తప్పనిసరని అన్నారు. ఆఫ్ఘనిస్తాన్‌తో తమ భాగస్వామ్యాన్ని పటిష్టపరుచుకునేందుకు అమెరికాకు గల నిబద్ధతను పునరుద్ఘాటించడానికి ఈ పర్యటన తమకు మంచి అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. ఈ పర్యటన సందర్భంగా ఆఫ్ఘన్ ముఖ్య నాయకులందరితో ఆయన సమావేశాలు జరిపారు. తాలిబన్‌ను చర్చల వేదిక వద్దకు తీసుకురావడానికి ప్రభుత్వ పరంగా తాము చేస్తున్న కృషిని నాయకత్వం తమకు తెలియచేసిందని సుల్లివన్ చెప్పారు. శాంతి, సామరస్యతలను నెలకొల్పే దిశగా సాగే ఈ క్రమం ఆఫ్ఘన్ నేతృత్వంలో సాగడం ముదావహమని వ్యాఖ్యానించారు.

అధ్యక్ష ఎన్నికలకు ఓఎస్‌సిఇ పరిశీలకులు

రష్యా అంగీకారం

మాస్కో: తమ దేశంలో త్వరలో జరుగనున్న అధ్యక్ష ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ఆర్గనైజేషన్ ఆఫ్ సెక్యూరిటీ, కో-ఆపరేషన్ ఇన్ యూరప్ (ఒఎస్‌సిఇ)కి చెందిన పరిశీలకులను ఆహ్వానించేందుకు రష్యా సంసిద్ధత వ్యక్తం చేసింది. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీలావ్‌రోవ్ గురువారం రాత్రి ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ ఒఎస్‌సిఇ తన తరపున పరిశీలకులను పంపే అంశంపై ఇప్పటికే రష్యా సెంట్రల్ ఎలక్షన్ కమిషన్‌తో సంప్రదిస్తోందని వివరించారు. ఎన్నికల పరిశీలనకు సంబంధించిన అన్ని అంశాలను ఒఎస్‌సిఇ రష్యా కేంద్ర ఎన్నికల కమిషన్ సమన్వయంతో ఏర్పాటు చేస్తాయని ఆయన చెప్పారు. అంతకు ముందు ఆయన ఓఎస్‌సిఇ అధ్యక్షుడిగా వున్న ఇటలీ విదేశాంగ మంత్రి ఏంజెలినో అల్ఫానోతో ఎన్నికల నిర్వహణపై చర్చలు జరిపారు. మార్చిలో జరుగనున్న అధ్యక్ష ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ముందు వాతావరణంపై అంచనాలు, ఏర్పాట్ల వంటి వాటి పరిశీలనకు ఈ వ్యవస్థకు సంబంధించిన దాదాపు 80 మంది దీర్ఘకాలిక పరిశీలకులు, 420 మంది స్వల్పకాలిక పరిశీలకులు రష్యాకు వస్తారని అధికార వార్తా సంస్థ టాస్ తన వార్తా కథనంలో వివరించింది. ఈ బృందంలో కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్‌కు చెందిన కొంతమంది ప్రతినిధులు కూడా వుంటారని లావ్‌రోవ్ వివరించారు. ఎన్నికల అనంతరం కూడా ఉగ్రవాద నిరోధం, డ్రగ్ ట్రాఫికింగ్, సైబర్ నేరాల నిరోధం వంటి అంశాలలో ఓఎస్‌సిఇతో సహకారాన్ని విస్తరించుకుంటామని చెప్పారు.

రోదసీలోకి పర్యాటకులు

వచ్చే ఏడాది పంపనున్న రష్యా

మాస్కో : స్పేస్ వాక్ కోసం డబ్బులు చెల్లించిన పర్యాటకులను వచ్చే ఏడాదిలో అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌కు పంపాలని రష్యా భావిస్తోందని రోదసీ రంగ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. రోదసీలో నడవాలన్న ఆకాంక్ష వున్న పర్యాటకులు డబ్బు చెల్లిస్తే వారిని పంపే విషయమై చర్చలు జరుపుతున్నామని రష్యన్ రోదసీ కంపెనీ ఎనర్జియా అధిపతి వ్లాదిమిర్ సోల్న్‌త్సెవ్ తెలిపారు. మార్కెట్ విశ్లేషకులు కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. సంపన్నులు రోదసీలో నడిచిన అనుభవాన్ని సొంతం చేసుకునేందుకు అవసరమైతే డబ్బు చెల్లించడానికి సిద్ధపడుతున్నారని ఆయన తెలిపారు. ఇందుకు దాదాపు 100 మిలియన్ల డాలర్లు (80 మిలియన్ల యూరోలు) ఖర్చు అవుతుందని ఆయన తెలి పారు. మొదటి పర్యాటకుడికి కాస్త తక్కువ మొత్తం వుండొచ్చు



నని సోల్న్‌త్సెవ్ చెప్పారు. పర్యాటకులు రోదసీలోకి వెళ్ళి నడవవచ్చని, వీడియో తీసుకోవచ్చని తెలిపారు. భూమి నుండి అంతర్జాతీయ రోదసీ స్టేషన్‌కు వెళ్ళేందుకు కొత్త మాడ్యూల్ నెమ్-2ని ఎనర్జియా రూపొందిస్తోంది. ఇందులో నలుగురు నుండి ఆరుగురు పట్టే స్థలం వుంటుంది. రెండు టాయిలెట్లు, ఇంటర్‌నెట్ సౌకర్యం వుంటుంది. 2019లో దీన్ని ప్రయోగించనున్నారు.

మొదటి పేజీ తరువాయి

విద్యుత్ ఉద్యోగుల విభజన ఉత్తర్వుల్ని కొట్టివేసిన హైకోర్టు

ఉద్యోగుల విభజనకు సంబంధించిన మార్గదర్శకాలను బెంచ్ తన తీర్పులో ఉదహరించింది. రాష్ట్రాల స్థానికత ఆధారంగా విభజన చేశారేగానీ, కమలనాథన్, ప్రత్యూష్ సిన్హా కమిటీల సూచనల్ని అమలు చేయలేదని బెంచ్ తన తీర్పులో ఎత్తిచూపింది. పుట్టిన చోటు, ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని ఉద్యోగాలకు అర్హుడో కాదో చెప్పడానికి వీల్లేదని బెంచ్ పేర్కొంది. ఉద్యోగ భర్తీకి ఫలానా నివాస ప్రాంతం వారై ఉండాలని చెప్పే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని, రాష్ట్ర అసెంబ్లీకు లేదని తెలిపింది. దేశంలోని పౌరులంతా సమానమేనని స్పష్టం చేసింది. 1957లో ప్రాంతీయత ఆధారంగా ఏపీ రాష్ట్రంలో తెలంగాణకు ఉద్యోగావకాశాల్లో ప్రత్యేక ప్రయోజనాలను కల్పించేలా లోక్‌సభ చేసిన చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేసిందని హైకోర్టు బెంచ్ గుర్తు చేసింది.

ఇంజినీర్ల పదోన్నతుల తుది జాబితా నాలుగు మాసాల్లో సిద్ధంచేస్తాం హైకోర్టుకు తెల్పిన ప్రభుత్వం

ఇరిగేషన్ శాఖలో ఈఈగా పదోన్నతి పొందాల్సిన అయిదు ఆరు జోన్‌లకు చెందిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల జాబితాపై హైకోర్టులో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ జాబితాను ఈ నెల 8లోగా ఏపీ ప్రభుత్వానికి అందజేస్తామని తెలంగాణ హామీ ఇచ్చింది. ఆ జాబితా అందిన నాలుగు మాసాల్లో పదోన్నతుల తుది జాబితాను సిద్ధం చేస్తామని ఏపీ ప్రభుత్వం కూడా హామీ ఇచ్చింది. దాంతో జోన్ అయిదు,ఆరు డీఈఈలు దాఖలు చేసిన రిట్లు పరిష్కారించినట్లు హైకోర్టు న్యాయమూర్తులు సురేశ్ కుమార్ కెయిత్, అభినంద్ కుమార్ షావిలిలతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. ఏపీ సమైక్యంగా ఉండగా రూపొందించిన జాబితా వల్లే తమకు సీనియార్టీలో న్యాయం జరుగుతుందని తెలంగాణకు చెందిన డీఈఈలు వేసిన కేసులో ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

హైకోర్టు జడ్జి జైశ్వాల్‌కు ఘనంగా వీడ్కోలు

హైకోర్టు న్యాయమూర్తి ఎమ్మెస్కే జైశ్వాల్‌కు హైకోర్టు శుక్రవారం వీడ్కోలు చెప్పింది. ఈ నెల 4న ఆయన పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్ అధ్యక్షతన జైశ్వాల్ వీడ్కోలు సమావేశం జరిగింది. అనంతరం తెలంగాణ,ఏపీ హైకోర్టు లాయర్స్ అసోసియేషన్లు జైశ్వాల్ దంపతులను సన్మానించాయి. న్యాయమూర్తులు, ఏజీలు, న్యాయవాదులు హాజరయ్యారు.

మరో నిరుద్యోగి ఆత్మహత్య

మండలంలోని గులుమూరు గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగం రాలేదని యుద్దంశెట్టి సాయికుమార్ (22) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాయికుమార్ డిగ్రీ పూర్తయిన తర్వాత హైదరాబాద్‌లోని ఒక ప్రయివేటు కంపెనీలో సూపర్ వైజర్‌గా చేరాడు. ఆ ఉద్యోగం చేస్తూనే పలు రకాల ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తులు చేశాడు. ఇటీవల ఆర్మీ, పోలీసు ఉద్యోగాల ఎంపికకు కాల్ లెటర్ రావడంతో ఉద్యోగం విడిచిపెట్టి గ్రామానికొచ్చాడు. ఆ ఉద్యోగాలు ఏవీ రాకపోవడంతో నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయి ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన సాయికుమార్‌ను హిరమండలం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని రిమ్స్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు.

కోర్టుకు హాజరైన జగన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసిపి అధినేత జగన్ సిబిఐ కోర్టుకు హాజరయ్యారు. శుక్రవారం నాంపల్లిలోని సిబిఐ కోర్టుకు వచ్చిన ఆయన విచారణ జరుగుతున్నంత సేపు కోర్టు ఆవరణలోనే ఉన్నారు. వైఎస్ జగన్‌కు చెందిన సంస్థల్లో పెట్టుబడులకు సంబంధించిన మొదటి నాలుగు ఛార్జీషీట్‌లపై విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. జనవరి 20న జరిగిన విచారణలో జగన్ సంస్థల్లో రాంకీ పెట్టుబడులకు సంబంధించిన చార్జిషీట్‌లో తన పేరును తొలగించాలని విజయసాయిరెడ్డి దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్‌పై వాదనలు నడిచాయి. శనివారం ఉదయం నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గం మరుపూరు శివారు నుంచి జగన్ పాదయాత్ర తిరిగి ప్రారంభమై మట్లెంపాడు, మోపూరు క్రాస్, మొగళ్లపాలెం మీదగా మోపూరు వరకు కొనసాగనుంది.

తేల్చుకుందాం...తొందరొద్దు

ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోండి : కెవిపి

బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిన తీరును నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపి కెవిపి రామచంద్ర రావు పార్లమెంటులో ఆందోళన చేశారు. శుక్రవారం రాజ్యసభ ప్రారంభమైన కొద్దిసేపటికే కెవిపి ఛైర్మన్ వెల్‌లోకి చొచ్చుకెళ్లారు. "హెల్ప్ ఆంధ్రప్రదేశ్"అని రాసున్న ప్లకార్డును ఎత్తిపట్టుకుని అక్కడే నిలబడ్డారు. నిరసన విరమించి, సీట్లో కూర్చోవాలని డిప్యూటీ ఛైర్మన్ పిజె కురియన్ ఎంత చెప్పినా కెవిపి వెనక్కి తగ్గలేదు. దీంతో సహనం కోల్పోయిన కురియన్ "ఈయనకు ఏమైంది? పిచ్చి పట్టిందా?"అని కెవిపిని ఉద్దేశించి అన్నారు. ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్‌ను ఉద్దేశించి, "మీ మెంబర్(కెవిపి)ని వెనక్కి రమ్మని పిలవండి" అని కోరారు. కెవిపిని వెనక్కి రావాలని గులాం నబీ ఆజాద్ కోరినా ఆయన మాత్రం అక్కడే బైఠాయించారు. మీరు వెనక్కి వెళ్లకపోతే చర్యలు తీసుకుంటానని కురియన్ హెచ్చరించారు. ఆ దశలో కాంగ్రెస్ ఎంపి రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ ఏపికి అన్యాయం జరిగిందని ఆయన నిరసన వ్యక్తం చేస్తున్నారని తప్పేమీ లేదని తెలిపారు.

(మొదటి పేజీ తరువాయి)

నుండి కేంద్రానికి పంపిన ప్రతిపాదనలు, కేటాయింపుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. వివరాలు వెంటనే సిద్ధం చేయాలని మంత్రులను ఆదేశించారు. ఈ వివరాలతో కేంద్రం వద్దకు వెళ్లాలని, బడ్జెట్ ఆమోదం లభించనందున అవకాశం ఉంటే మార్పులు, చేర్పులు చేయించు కోవచ్చని, చేయని పక్షంలో ఏమి చేయాలో ఆలోచిద్దామని మంత్రులతో సిఎం వ్యాఖ్యా నించారు. తాడు తెంచుకుపోతే రాష్ట్రానికి కీడు జరుగుతుందని అన్నట్లు తెలిసింది.

ఎన్నికలకు సిద్ధం

అలాగే ఎన్నికల సంవత్సరం వచ్చేసిందని, అంతా సిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో శుక్రవారం ఉదయం టిడిపి సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. దీంట్లో బడ్జెట్ కేటాయింపులు, ఇటీవల ప్రారంభించిన దళితతేజం, గ్రీవెన్స్‌ల పరిష్కారం తదితర అంశాలపై అభిప్రాయాలు సేకరించారు. పలువురు నాయకులైతే బిజెపితో తెగ దెంపులు చేసుకోవాలని ఆవేశంతో మాట్లాడారు. ఇప్పుడు న్యాయం చేయకపోతే ఇక ముందు ఏమీ జరగదన్నారు. దీనికి చంద్రబాబు స్పందిస్తూ ఈ బడ్జెట్లో అంచనాలు పెంచుతారనుకున్నామని, అసలు రాష్ట్ర ప్రస్తావనే చేయలేదని తెలిపారు. బాధ కలిగించినా అవసరాలరీత్యా తొందరపడొద్దని, జిల్లాల్లోనూ బిజెపికి వ్యతిరేకంగా ప్రకటనలు చేయొద్దని సూచించారు. రెండు ఛానళ్ల నిర్వహించిన సర్వేలో ఒక ఛానల్లో 76 శాతం, ఒక ఛానల్లో 99 శాతం బడ్జెట్‌పై ప్రజా వ్యతిరేకత కనిపించిందని ఆయన సమావేశంలో ప్రస్తావించారు. బిజెపి నమ్మించి మోసం చేస్తోందనే భావన ఉందన్నారు. ఆవేశపడి ప్రకటనలు చేయడం వల్ల మొదటికే నష్టం వస్తుంది మినహా రాష్ట్రానికి ఉపయోగం ఉండదన్నారు. మంత్రివర్గ సమావేశంలోనూ దీనిపై చర్చించి మంత్రులందరి అభిప్రాయం తీసుకుంటామని, క్యాబినెట్లో బిజెపి మంత్రులూ ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా రాష్ట్ర ప్రజల అభిప్రాయాలు చెప్పడం ద్వారా బిజెపికి తగు సూచనలు చేసినట్లు అవుతుందని, వారి పార్టీ నిర్ణయం ప్రకారం భవిష్యత్‌లో ముందుకు వెళదామని పేర్కొన్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన నాయకులు బిజెపి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా తొందరపడి పార్టీకి నష్టం వాటిల్లే పనులు చేయొద్దని వారిని మందలించారు. ఎంపిలు కూడా ఎవరికి వారు మాట్లాడుతున్నారని, అది సరైంది కాదని తెలిపారు. పార్టీ నిర్ణయాన్ని ఒకరే చెప్పాలని, ఎవరికి వారు చెప్పుకుంటూ పోతే క్రమశిక్షణ ఎక్కడ ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితతేజాన్ని కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకత్వానికి సూచించారు. అలాగే నాయకత్వం పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొవాలని, ఎన్నికల సంవత్సరం వచ్చేసిందని సూచించారు. గతంలో ఉన్న విధంగా వ్యవహరిస్తే సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. ఆర్థికశాఖ అధికారులు సమర్పించిన అంచనాలనూ ముఖ్యమంత్రి అధ్యయనం చేశారు. ఏయే శాఖలకు ఎంత కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఎంత తగ్గాయనే అంశాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బడ్జెట్ కేటాయింపులు, సవరించిన అంచనాలపైనా మాట్లాడారు. కేంద్రం విషయంలో జాగ్రత్తగా ఉండాలని, నిర్ణయం వెలువరించే ముందు కేంద్రంతో మాట్లాడి రాష్ట్ర అభిప్రాయాన్ని తెలపాలని పేర్కొన్నట్లు తెలిసింది.

బిజెపికి పొగరు... ఇక తెగదెంపులే : టిజి

బిజెపికి సొంతంగా మెజార్టీ ఉందన్న పొగరుతో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తోందని, కేంద్ర ప్రభుత్వంపై పోరాటానికి సమయం ఆసన్నమైందని టిడిపి ఎంపి టిజి వెంకటేష్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడిక్కడ పార్లమెంట్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఎవరూ తక్కువ అంచనావేయొద్దన్నారు. బిజెపిపై టిడిపి అంచెలంచెలుగా పోరాటం చేస్తుందని, పోరాటంలో చివరి అస్త్రంగా 'తెగదెంపులు' ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఇన్నాళ్లు స్నేహంగా ఉన్నామని తెలిపారు. ఆదివారం జరుగనున్న పార్లమెంటరీ పార్టీ సమావేశం అనంతరం తమ కార్యాచరణను చంద్రబాబు ప్రకటిస్తారని టిజి తెలిపారు. గతంలో చంద్రబాబు దేశ రాజకీయాల్లో చక్రం తిప్పారని, మళ్లీ ఆ రోజులు వస్తాయని టిజి ధీమా వ్యక్తం చేశారు.

రైల్వే జోన్ ప్రకటించాలి

రైల్వే మంత్రి గోయల్‌కు ఉత్తరాంధ్ర వేదిక వినతి

విభజన హామీలను తుంగలో తొక్కారని ఉత్తరాంధ్ర చర్చా వేదిక నేతల విమర్శించారు. ఐదు రోజుల పాటు తాము ఢిల్లీలో మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సుజనా చౌదరి, సిపిఐ నేత డి.రాజా, టిడిపి జాతీయ కార్యదర్శి రామ్మోహన్ నాయుడు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె. హరిబాబులను కలిసి ఏపి జరుగుతున్న అన్యాయాన్ని వివరించామని వేదిక నేతలు తెలిపారు. శుక్రవారం వేదిక బృందం రైల్వే మంత్రి పియూష్ గోయల్‌ను కలిసి రైల్వే జోన్‌పై వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామన్న రైల్వే జోన్, ప్రత్యేక హోదా హామీలను బిజెపి నెరవేర్చాలని కోరారు. విశాఖ రైల్వే జోన్‌ను ప్రకటించాలని విన్నవించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలకు రైల్వే జోన్ ఏర్పాటు అనివార్యం అయినందున వెంటనే స్పందించండి" అని రామకష్ణ పేర్కొన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలికాంశాలు విశాఖపట్నం కలిగివుందని కొణతాల అన్నారు. విభజన హామీలను తుంగలో తొక్కారని చిత్తూరు మాజీ ఎంపి జ్ఞానేందర్ రెడ్డి ధ్వజమెత్తారు. కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అన్న నినాదంతో ముందుకెళ్తామని తెలిపారు. విభజన హామీలు అమలు చేయాలని లోక్‌సత్తా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ కోరారు. అనంతపురంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని, విశాఖలో హైకోర్టు బెంచ్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ పర్యటనలో శ్రీకాకుళం మాజీ ఎంపి కణితి విశ్వనాథం, ఉత్తరాంధ్ర చర్చ వేదిక సభ్యులు పాల్గొన్నారు.

23న చలో గుంటూరు

(మొదటి పేజీ తరువాయి)

మెరుగైన చికిత్సకయ్యే ఖర్చును తామే భరిస్తున్నామని ఇంటికి రూ.200 చందాలు వేసుకున్నామని గ్రామంలోని దళిత మహిళలు తెలిపారు. దీనిపై మధు తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ ఖర్చుతో చికిత్స చేస్తామని చెప్పిన అధికారులు ఇంత వరకూ పట్టించుకోవడం లేదా? అని ఈ అంశంపై కలెక్టర్, ఎస్‌పి కలసి చర్చిస్తామని చెప్పారు. అవసరమైతే తామే భరిస్తామని భరోసాఇచ్చారు. దాడికి పాల్పడిన ప్రధాన నిందితులను అరెస్టు చేయాలని, వారిపై 307 కేసు నమోదు చేయాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు రాములు ఆదేశాలిచ్చినా అధికారులు పట్టించుకోలేదని మధు మండిపడ్డారు. ఈనెల 23న నిర్వహించే చలో గుంటూరుకు రాష్ట్రంలోని దళిత సంఘాల నేతలందర్నీ రప్పిస్తామని, ఈలోగా గొట్టిపాడు దళితులకు న్యాయం జరగకపోతే మళ్లీ 'చలో గొట్టిపాడు' నిర్వహిస్తామని ప్రకటించారు. దళిత తేజం పేరుతో టిడిపి ప్రభుత్వం మరో మారు మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. మధు వెంట సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణయ్య, ప్రముఖ న్యాయవాది సుధాకర్, సిపిఎం గుంటూరు తూర్పు,పశ్చిమ జిల్లా కార్యదర్శి పాశం రామారావు, గద్దె చలమ య్య, తూర్పు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఎన్ భావన్నారాయణ, ఎం.రవి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, పాల్గొన్నారు.

చంద్రబాబు వల్లే నష్టం : బొత్స

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వార్థ పూరిత ఆలోచనలు, చర్యల వల్ల కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని వైసిపి నాయకులు బొత్స సత్యానారాయణ విమర్శించారుర. శుక్రవారం హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ఎపికి కేటాయింపులు లేకపోవడం చంద్రబాబు చేతగానితనాన్ని తేటతెల్లం చేసింద న్నారు. నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రయోజనాలను సాధించలేని ముఖ్యమంత్రి, బడ్జెట్ ప్రసంగం తరువాత లీకులు ఇస్తూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్ నుంచి రాష్ట్రానికి అన్యాయం జరుగుతూనే ఉందని అన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

వైద్యానికి ప్రపంచ బ్యాంకు నిధులు

అవసరమని నిర్ణయించినట్లు మంత్రి కాలువ శ్రీనివాసులు తెలిపారు. పోలీసు, మైనింగ్, పట్టణాభివృద్ధి, ప్రకృతి విపత్తులు, వ్యవసాయం, జలవనరులు, సర్వేలు, టూరిజం వంటి సేవలకు వీటిని వినియోగించనున్నారు. టూడీ, త్రిడీ మోడల్స్‌లోనూ ఫొటోలు తీయనున్నారు. దీని కోసం డ్రోన్ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా ఇది పనిచేస్తుంది. గుంటూరు జనరల్ ఆస్పత్రిలో 597 పడకలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.65 కోట్ల వ్యయంతో నెలకొల్పే దీన్ని గుంటూరు మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సాయంతో ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం జిప్లస్5 పద్ధతిలో నూతనంగా భవనాన్ని నిర్మించనున్నారు. ప్రసూతి కోసం 300 పడకలు, చిన్నారుల కోసం 200 పడకలు, పిఐసియు కోసం 27, ఎస్ఐసియు కోసం 30, ఎన్ఐసియు కోసం 40 పడకలు ఏర్పాటు చేయనున్నారు. 30 ఫ్యాకల్టీ రూమ్‌లు, 300 మందికి సరిపడా కాన్ఫరెన్స్ హాలు ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు రిఫార్మ్స్ ఆర్డినెన్స్-2017 స్థానంలో బిల్లు పెట్టేందుకు మంత్రిమండలి ఆమోదించింది. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లు పెట్టనున్నారు. పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి ముందస్తు నిధుల ఈ మొత్తాన్ని రూ.150 కోట్ల నుండి రూజ160 కోట్లకు పెంచనున్నారు. గోరకల్లు బైపాస్ పనులు చేపట్టిన కాంట్రాక్టరుకు ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ అమౌంటు కింద రూ.4,78,77,638 చెల్లించాలని మంత్రి మండలి నిర్ణయించింది. పలు సంస్థలకు శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు, కృష్ణా జిల్లాల్లో భూములు కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

వైద్య మౌలిక సదుపాయాల కల్పనకు రూ.4807 కోట్లు అవసరమని ప్రతిపాదించగా ఇందులో ప్రపంచబ్యాంకు నుండి రూ.3365 కోట్లు రుణంగా తీసుకోవాలని నిర్ణయించారు. పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న ఐదు లక్షల ఇళ్ల నిర్మాణానికి ఎపి టిడ్కో నిధులు సమకూర్చుకునేందుకు ప్రపంచబ్యాంకు రుణం కోసం ప్రభుత్వం హామీగా ఉండటానికి క్యాబినెట్ ఆమోదించింది. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం 13,035 కోట్లు, కేంద్రం రూ.7500 కోట్లు భరించనున్నాయి మిగిలిన మొత్తాన్ని లబ్దిదారుడు భరించాల్సి ఉంటుంది.


ఎంపిల ట్రస్టుకు నిధులు

రాష్ట్రంలో పార్లమెంటు నియోజకవర్గాల్లో చేపట్టాల్సిన పనులకు ఏర్పాటు చేసిన మెంబర్స్ ఆఫ్ పార్లమెంటు అలయోన్స్ ఫర్ కలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ట్రస్టుకు రూ.1.20 కోట్లు విడుదల చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. బాపట్ల ఎంపి మాల్యాద్రి శ్రీరామ్ అభ్యర్థన మేరకు ఈ నిధులు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. బాలామృతం వంటి పోషకాహారం తయారు చేసే కర్మాగారాల కోసం టాటా ట్రస్టుతో కలిసి ఎస్‌పివి ఏర్పాటు చేయనున్నారు.

మై మ్యాన్ పట్టాభి



కొందరు ఆఫీస్ బాయ్ నుంచి మేనేజింగ్ డైరెక్టర్ వరకూ అందర్నీ గుర్తుపెట్టుకుంటారు. ఆ వ్యక్తి ఏ స్థాయిలో ఉన్నా తనకు సహకరించిన వారిని, వారి పనితనాన్ని మరిచిపోరు. మహేశ్ బాబు ఇన్‌స్టాగ్రామ్‌లో గురువారం రాత్రి పోస్టు చేసిన ఓ ఫొటో అటువంటిదే. తన దగ్గర ఉండే వ్యక్తులను ఎలా ట్రీట్ చేస్తారు? వారిని ఎలా గుర్తుపెట్టుకుంటారన్న దానిపై మహేష్ చేసిన పోస్టే చెబుతుంది. తన 24ఏళ్ల కెరీర్‌లో మహేశ్ ముఖానికి రంగేస్తున్న పట్టాభి గురించి ఆ పోస్టు. తన కెరీర్‌లో పట్టాభితో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నాడు. 'ఎవర్‌గ్రీన్ సూపర్‌స్టార్‌తో ఫొటోకు పోజిచ్చా గత 24 ఏళ్లుగా ఆయన నాతోనే ఉన్నారు. ఆయన లేకుండా కెమెరాను ఫేస్ చేయలేను. ఈ ఫొటోను ఫొటోషాప్ చేయలేదు. నాకిష్టమైన కలర్ బ్లూలో మై మ్యాన్ పట్టాభి' అంటూ మహేష్ బాబు ఆ పోస్టులో పేర్కొన్నారు. తనను తెరపై మహేశ్‌ను ఇంత అందంగా చూపిస్తున్న వ్యక్తి గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొనడం విశేషమే. అందుకే అభిమానుల నుంచి అభినందనలు లభిస్తున్నాయి. మహేశ్ బాబు ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'భరత్ అనే నేను' చేస్తున్నాడు. కైరా అద్వాని కథానాయిక.





మహేశ్‌కు మ్యాకప్ వేస్తున్న పట్టాభి, కృష్ణతో మహేష్, వెనుక పట్టాభి

'గున్న' స్నేహితుల కథ



'గున్న' లోగోను ఆవిష్కరిస్తున్న రాఘవేంద్రరావు, విప్లవ్ కె

సాలగ్రామ్ సినిమా పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'గున్న'. విప్లవ్.కె దర్శకత్వం వహిస్తున్నారు. నేపథ్యాన్ని, పాత్రల స్వభావాన్ని తెలిపేందుకు రూపొందించిన ప్రీ పోస్టర్‌ను, లోగోను సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "లోగో డిజైన్ బావుంది. సినిమా చక్కని విజయాన్ని అందుకుని టీమ్‌కు మంచి పేరు, నిర్మాతకు లాభాలు రావాలి" అని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'పసి వయసుకు, యుక్త వయసుకు మధ్య గున్న ప్రాయంలో ఉన్న కొందరు స్నేహితుల కథతో తెరకెక్కనున్న చిత్రమిది. సినిమాకు సంబంధించి ప్రధాన పాత్రల ఎంపిక ఎనిమిది నెలలుగా జరుగుతోంది. సామ్రాట్, ప్రజ్ఞాత, నిఖిల్, ఆర్మాన్, మెహక్, ఐశ్వర్యలను ఎంపిక చేశాం. త్వరలో మిగిలిన ఇద్దరు ఆర్టిస్టులను ఎంపిక చేసి మార్చిలో షుటింగ్ ప్రారంభిస్తాం" అని తెలిపారు.

నేనెప్పుడూ రేసులో లేను

మదన్



మంచు మోహన్ బాబు ప్రధాన పాత్రలో రూపొందిన సినిమా 'గాయత్రి'. మదన్ రామిగాని దర్శకుడు. ఈ నెల 9న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'గాయత్రి' చిత్రంలో చాలా విషయాలు కష్టమైనవి ఉంటాయి, ఇష్టమైనవి ఉంటాయి. అలా రెండు ముడిపడి ఉండేదే గాయత్రి. అలాంటి విభిన్నమైన అంశం ఈ సినిమాలో ఉంటుంది. ఇది తండ్రి, కూతుళ్ల సినిమా. పూర్తిగా వారి మధ్యన నడిచే కథ ఇది. ఇందులో గాయత్రిగా నిఖిల విమల నటించింది. మోహన్ బాబుగారు చేసిన ఆ పాత్ర సినిమాలో సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ఇప్పుడే దాన్ని రివీల్ చేయకూడదు. ఇంకో పాత్ర పేరు శివాజీ. విష్ణు పాత్ర ఇద్దరు మోహన్ బాబుల్లో ఒకరికి యంగర్ వెర్షన్. అది ఎవరికి అనేది సినిమా చూసే తెలుసుకోవాలి.

ఆయనకు గొప్ప పాత్రలు రాయలంతే..

ఆయన మహా నటుడు. అంతటి నటుడ్ని ఎలా హ్యాండిల్ చేయగలనా అనిపించేది. ఎస్వీ రంగారావు, ఎన్టీఆర్, నాగేశ్వరరావ్, శివాజీ గణేశన్ లాంటి మహానటుల జాబితాలో ఆయనుంటారు. ఆయనకు గొప్ప పాత్రలు రాయాలంతే. మోహన్ బాబుతో పని చేయడం గర్వంగా ఉంది. ఆయన నాకు పిలిచి అవకాశం ఇచ్చారు. నేను చాలా లక్కీ. నాకు, ఆయనకు ఇంతకుముందు పెద్దగా పరిచయం కూడా లేదు. కేవలం ఒక్క సిట్టింగ్లో ఓకే చేసేశారు. ఆయనకిది రీలాంచ్ లాంటిది. ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. ఉపయోగపడే సలహాలు ఎన్నో ఇస్తారు. మోహన్ బాబు ఎవరు ఏ సలహా చెప్పినా ఒకటికి నాలుగుసార్లు ఆలోచిస్తారు. అదే ఆయనలోని గొప్ప క్వాలిటీ.

అన్నిట్లోనూ ఎమోషన్స్ ఉంటాయి

ఫ్యామిలీ డ్రామాల్లో కొత్త, పాత ఉండదు. అన్నిట్లోనూ ఎమోషన్స్ ఉంటాయి. అవి ఎప్పుడైనా పండుతుంది. ఇక సినిమాలో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్స్ ఉండటం వల్ల మేకింగ్ కొంత పాతగా అనిపిస్తుంది. 2006 నుండి 2017కి చాలా తక్కువ సినిమాలు చేయడానికి ప్రత్యేక కారణం అంటూ ఏం లేదు. నేనెప్పుడూ రేసులో లేను. ఎందుకో అలా కుదిరేసింది. భవిష్యత్తులో చేయబోయే సినిమాలపై ఇంకా స్క్రిప్ట్స్ రాసుకుంటున్నాను. ఏమీ ఫిక్స్ కాలేదు. కానీ ఈ సంవత్సరం మాత్రం ఒక సినిమా తప్పకుండా చేస్తాను. అది ఎవరితో అనేది ఇప్పుడే చెప్పలేను.



అనుష్క

ఊహించలేదు

మన అభిమాన హీరో మన పని గురించి ప్రశంసిస్తే... అప్పుడు మనలో కలిగే ఆనందానికి హద్దులుండవు. తారలకు కూడా అభిమాన తారలుంటారు. అలా అభిమానించే హీరో ఫ్యాన్ నటనకు కాంప్లిమెంట్ ఇస్తే కొత్త ఊపిరినిస్తుంది. అది కొత్తఅవకాశాలకూ మార్గాన్ని చూపుతుంది. అనుష్క చేసిన పనిని సూపర్‌గా ఉందని అగ్రహీరో దక్షిణభారతదేశంలో ప్రముఖ నటుడు ప్రశంసిస్తే ఎలా ఉంటుంది?. అనుష్క ఎగిరిగెంతేస్తుంది. ఇంతకీ విషయం ఏమిటంటే... ఇటీవల అనుష్క 'భాగమతి' టైటిల్ పాత్రలో చేసింది. ఈ సినిమాను తమిళ్ సూపర్ స్టార్ రజనీకాంత్ చూసి అనుష్క పెర్ఫార్మెన్స్‌ను తెగ మెచ్చుకున్నాడు. దీనిపై అనుష్క స్పందించింది. రజనీసార్ ప్రశంసను తాను ఊహించలేదని పేర్కొంది. ఇది తన జీవితంలో గొప్ప కాంప్లిమెంట్ అని కూడా చెప్పింది. 'భాగమతి' చిత్రానికి అశోక్ దర్శకుడు. జయరామ్, ఆశా శరత్, ఉన్ని ముకుందన్ ముఖ్యపాత్రలో నటించారు.


రామ్ చరణ్ ప్రశంసలు

రామ్ చరణ్ తన సతీమణి ఉపాసనతో కలిసి గురువారం రాత్రి 'భాగమతి' సినిమా చూసిన విషయాన్ని చెర్రీ సామాజిక మాధ్యమంలో తెలిపారు. ఈ సినిమా మైండ్ బ్లోయింగ్ అని, చిత్రంలోని ప్రతి ఒక్కరూ చాలా బాగా పనిచేశారు. కంగ్రాట్స్ అని పేర్కొన్నారు. 'భాగమతి' చూసి మా ఆవిడకు రాత్రంతా నిద్రపట్టలేదు' అని పోస్టు తెలిపాడు రామ్ చరణ్. 'నిజమే. ఓ మై గాడ్. సినిమా చూస్తున్నంతసేపు సీటు చివరిలో కూర్చున్నాను. రాత్రంతా నిద్రపట్టలేదు. తప్పకుండా మీరూ సినిమా చూడండి' అని ఉపాసన పేర్కొంది.

ప్రేక్షకులను టచ్ చేయలేదు

నటీనటులు : రవితేజ, రాశీ ఖన్నా, సీరత్ కపూర్, మురళీ శర్మ, నరేన్, జయప్రకాష్, షాయాజి షిండే తదితరులు

సాంకేతికత : ఛాయాగ్రహణం: ఛోటా కే నాయుడు, సంగీతం: జామ్ 8, నేపథ్య సంగీతం : మణిశర్మ, కథ : వక్కంతం వంశీ, స్క్రీన్ ప్లే: దీపక్ రాజ్, నిర్మాత : నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీమోహన్, దర్శకత్వం : విక్రమ్ సిరికొండ.



కథ రాసుకోవడం వేరు. కథనంగా తీయడం వేరు. రెండూ అనుకున్నట్టు కుదిరితేనే రక్తికడుతుంది. ప్రయోగాలు చేసేటప్పుడు కొత్తదనం కప్పించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. రవితేజ సినిమాలంటే పవర్ ఉండాలి. బలుపు, పవర్, విక్రమార్కుడు.... ఇలా ఆయా ఫార్మెట్‌లతో ఓ కథను రాసుకుని అతన్ని ఒప్పించి తీసిన సినిమానే 'టచ్‌చేసి చూడు' టైటిల్ వినగానే... అతన్ని టచ్ చేస్తే విలన్స్ అంతే సంగతులని చెప్పేశాడు. మరి ప్రేక్షకులను టచ్ చేశాడా? లేదో? చూద్దాం.

కథ : పాండిచ్చేరిలో ఉండే కార్తికేయ (రవితేజ)కు కుటుంబం అంటే ప్రాణం. నలుగురికి పనికల్పిస్తూ ఓ వ్యాపారాన్ని చేస్తుంటే ఆ ఊరి రౌడీ కార్తికేయ కుటుంబాన్ని ఇబ్బంది పెడతాడు. వెంటనే కార్తికేయ వాడికి బుద్ధిచెపుతాడు. సాఫీగా సాగుతున్న కుటుంబంలో తన చెల్లెలు చూసిన ఓ హత్య కేసు అలజడి రేకెత్తిస్తుంది. ముస్లిం రాజకీయ నాయకుడు కుమారుడైన ఇర్ఫాన్ ఆ హత్యలో నిందితుడు. పోలీసు రికార్డులో చనిపోయిన ఇర్ఫాన్ ఎలా హత్యచేస్తాడనేది వారి లాజిక్కు. కానీ అతను బతికున్నాడని తెలుసుకున్న కార్తికేయ అతని ఏవిధంగా తుదముట్టించాడన్నది మిగిలిన కథ. ఇందులో పోలీసుగా ఎలా మారాడు? రాశీఖన్నా పాత్ర ఏమిటి? అనేది తెరపై చూడాల్సిందే.

విశ్లేషణ :

బాగా పాతబడిపోయిన కథ. దానికి తగ్గట్లే సాగే కథనం. ఏ మాత్రం కొత్తదనం లేని విధానం. రవితేజ చివరగా పోలీస్ పాత్రలో కనిపించిన సినిమా 'పవర్' కూడా రొటీన్‌గా నడిచేపోయే సినిమానే. ఇప్పుడు ప్రేక్షకుల అభిరుచి మారిపోయింది. రొటీన్ కథలంటే పెదవి విరుస్తున్నారు. పెళ్లి చూపుల కోసం రాశీఖన్నాతో సాగే ఎపిసోడ్ కాస్త రిలీఫ్‌గా ఉన్నా అది యూత్ హీరోలకు సింకయ్యే సన్నివేశం. అందుకే తన వయసును తెలియజేస్తూ జుట్టులో తెల్లటి వెంట్రుకను చూపిస్తూ తనలాగా రంగువేసుకో అంటూ రాశీఖన్నాకు క్లాస్‌పీకుతాడు.

ఎంత రొటీన్ కథ అయినా.. సినిమా ఒక ఫార్మాట్ ప్రకారం సాగిపోయినా.. కొంచెం ఎంటర్టైన్మెంట్ మత్తులో అయినా ముంచెత్తితే ప్రేక్షకుడు మన్నిస్తాడు. కానీ అసలు కథ మొదలవడానికి ముందు ప్రథమార్ధంలో సాగే రొమాంటిక్ ట్రాక్ ఎంటర్టైన్ చేయకపోగా విసిగిస్తుంది. ఇంటర్వెల్ ముంగిట హీరోలోని ఒరిజినల్ క్యారెక్టర్ బయటికొచ్చే సీన్ కూడా తేలిపోయింది. ఇక ద్వితీయార్ధం మొత్తాన్ని దాదాపుగా ఫ్లాష్ బ్యాకే ఆక్రమిస్తుంది. గంట నిడివితో సాగే ఈ ఫ్లాష్ బ్యాక్‌లోనూ కొత్తదనం ఏమీ కనిపించదు.

సినిమాలో సెకండాఫ్ అంతా ఫ్లాష్‌బ్యాక్. అదంతా చకచకా సినిమాటిక్‌గా జరిగిపోతుంది. నో లాజిక్క్. ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో సి.ఎం.మీటింగ్ పెట్టాలంటే భయం. ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తుంటే ఏసీపీ కార్తికేయ లాజిక్కుతో పనిలేకుండా చకచకా ఏర్పాట్లు చేసేసి మీటింగ్ పెట్టి అక్కడ సిఎం. అభ్యర్థి గెలిచేటట్లు చేస్తాడు. దాంతో పరువుపోయి రగిలిపోతున్న ముస్లిం నాయకుడ్ని అతని కొడుకు ఇర్ఫాన్‌కు ఎలా చెక్ పెట్టాడన్నది రవితేజ మార్కు. ఇది రవితేజకు ఏ రకంగానూ ప్రత్యేకమైన సినిమా కాదు. నటన పరంగానూ కొత్తదనం కనిపించలేదు. ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ వరకు ఓకే అనిపించాడు. కొన్నిచోట్ల అతడి లుక్ కూడా ఇబ్బందిగా అనిపిస్తుంది. హీరోయిన్ల ఇద్దరి పాత్రలూ వథాగా అనిపిస్తాయి. ఉన్నంతలో రాశీఖన్నా మేలు. సీరత్ కపూర్ కపూర్ అయితే ఏ రకంగానూ మెప్పించదు. ఆమె నటన.. తన లుక్స్ గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. విలన్ పాత్రల్లో కనిపించిన వాళ్లు తేలిపోయారు. మురళీశర్మ.. జయప్రకాశ్ ఫర్వాలేదు.

ఇక సాంకేతిక నిపుణులు కూడా నిరాశ పరుస్తారు. బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకడైన ప్రీతమ్‌కు చెందిన జామ్ 8 కంపెనీ చాలా సాదాసీదా పాటలిచ్చింది. ఒక్క 'పుష్ప' పాట మాత్రమే అంతో ఇంతో మేలనిపిస్తుంది. మణిశర్మ నేపథ్య సంగీతం కూడా సోసోగా అనిపిస్తుంది. హీరో ఎలివేషన్ సీన్లలో చెలరేగిపోయే మణిశర్మ కూడా తన సత్తాను చాటలేదు. ఛోటా కే నాయుడు ఛాయాగ్రహణం కూడా ఏమంత ఆకట్టుకోదు. వక్కంతం వంశీ కథలో ఏ విశేషం లేదు. అతడి కథల్లో అత్యంత రొటీన్.. సాదాసీదాగా అనిపించేది ఇదే అనడంలో సందేహం లేదు. దర్శకుడు విక్రమ్ సిరికొండ పూర్తిగా నిరాశ పరిచాడు. దర్శకుడే కొత్త ఆలోచనలు కాదనిపించాయి.

'ఛలో' నిండా నవ్వులే

నటీనటులు : నాగ శౌర్య, రష్మిక మండన్న, రఘుబాబు, సీనియర్ నరేష్ తదితరులు

సంగీతం : మహతి స్వర సాగర్, సినిమాటోగ్రఫర్ : సాయి శ్రీరామ్, ఎడిటర్ : కోటగిరి వెంకటేశ్వరరావు, కథ, స్క్రీన్ ప్లే దర్శకత్వం : వెంకి కుడుముల, నిర్మాత : ఉష మల్పూరి.



కథ :

హరి (నాగ శౌర్య)కి చిన్నతనం నుండి గొడవలంటే ఇష్టం. కొట్లాటల్లో సంతోషాన్ని పొందుతుంటాడు. దాంతో పోలీసు కేసులు ఎక్కువవుతాయి. విసిగెత్తిన తండ్రి నరేష్ అతన్ని హైదరాబాద్ నుండి ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులో ఉండే తిరుప్పురం కాలేజీకీ పంపిస్తాడు. ఆ ఊళ్లో జనాలు మాత్రం రెండుగా విడిపోయి పగ ప్రతీకారాలతో బతుకుతుంటారు. హరిని వాళ్ల నాన్న ప్రత్యేకంగా అలాంటి ఊరికే ఎందుకు పంపాడు? ఆ ఊరి గొడవేంటి? ఆ ఊరు హరి జీవితంలో ఎలాంటి మార్పులు తీసుకొచ్చింది అనేదే సినిమా.

విశ్లేషణ :

చక్కని కథ రాయడం దాన్ని అందంగా తీర్చిదిద్దడంలో దర్శకుడు వెంకి కుడుముల సఫలం అయ్యాడు. కొద్దిగా కొత్తగా అనిపించే కథాంశాన్ని ఎంచుకుని దానికి పుష్కలంగా కమర్షియల్ హంగులను దట్టించి రాసుకున్న కథనమే ఈ చిత్రం. అదే ఈ సినిమాకి ప్రధాన ప్లస్ పాయింట్. ఈ మధ్య కాలంలో వస్తున్న చాలా సినిమాల్లో దొరకని కొత్త తరహా ఫన్ ఈ సినిమాలో లభిస్తుంది. హీరో దగ్గర్నుండి కథలో ఇన్వాల్వ్ అయిన ప్రతి ముఖ్య పాత్రలోనూ ఎంటర్‌టైన్‌మెంట్‌ను చూపించిన దర్శకుడు చాలా చోట్ల నవ్వుకునేలా చేశాడు. సినిమా ఆరంభాన్ని హీరో పాత్ర చిత్రీకరణతో ఆసక్తిగా మొదలుపెట్టి మధ్య మధ్యలో సత్య, వైవా హర్ష, సుదర్శన్ వంటి కమెడియన్లతో తెలుగు, తమిళ వ్యక్తుల మధ్య నడిచే సరదా సరదా హాస్యాన్ని అందించి ఇంటర్వెల్ సమయానికి థ్రిల్ చేసే ట్విస్ట్ ఇచ్చి ఆకట్టుకున్నాడు. అలాగే హీరో హీరోయిన్ల మధ్యన కూడా రొటీన్ సినిమాల్లా కాకుండా కొంత ఫ్రెష్‌గా అనిపించే లవ్ ట్రాక్‌ను పెట్టి కథను నడిపాడు. ద్వితీయార్ధంలో కథ ఎటువైపు వెళుతుంది అనుకుంటుండగా పెళ్లి కొడుకుగా వెన్నెల కిశోర్‌ను ప్రవేశపెట్టి కొత్తతరహా పంచ్‌లు పేల్చి నవ్వులు పూయించాడు. హీరో నాగ శౌర్య, హీరోయిన్ రష్మిక మండన్నలు కూడా అభినయంతో అలరించారు.

కామెడీ పేరుతో ఈ మధ్య చాలా చిత్రాలు వస్తున్నాయి. జంధ్యాల, ఇవివి తరహా చిత్రాల ఫార్మెట్లో కొంతమంది ప్రయత్నించి భంగపడిన వారూ ఉన్నారు. రాజేంద్రప్రసాద్, అల్లరి నరేష్‌లపై అటువంటి ప్రయోగాలు ఎక్కువగా చేశారు. కానీ.. 'జాదూగాడు'తో మాస్ హీరోగా అవ్వాలనుకున్న నాగశౌర్యతో వినోదం పండించే హీరోగా మారుస్తానని వెంకీ కుడుముల తన భుజంపై వేసుకున్నాడు. అందుకు ఆంధ్ర, తమిళనాడు విడిపోయిన నాటి ఓ సందర్భాన్ని ఈ సినిమాకు నేపథ్యంగా తీసుకున్నాడు. దానికి ఓ ప్రేమకథను అల్లాడు. కన్నడలో విజయవంతమైన 'కిరాక్ పార్టీ'లో చేసిన రష్మిక హీరోయిన్‌గా ఎంపిక చేసుకున్నాడు.

ఊరి సమస్య సీరియస్ అయినా హీరో దాన్ని ఫన్‌గా తీసుకుని చూపించడంలో దర్శకుడి ప్రతిభ కన్పిస్తుంది. లాజిక్కుగా చూస్తే ముగింపులో కొన్ని మతలబులున్నా దాన్ని వినోదంగా మార్చేశాడు. కథ మొత్తంగా పరిశీలిస్తే... విదేశీయుల పాలనల్లో కొంతమంది ఉద్యోగాలు పేరిట ఇక్కడే ఉంటూ ఇక్కడి వారిని పెళ్లి చేసుకుని వారి వారసులుగా ఉన్న సందర్భాలు చాలానే ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణలోని కొన్ని చోట్ల వారికి పుట్టినవారు తెల్లగా ఉండడంతో తెల్లోడు వారసులుగా వారిని పిలుస్తున్న సంఘటనలు, తెల్లోల పాలెంగా ఉన్న కొన్ని ప్రాంతాలు ఆ మధ్య పేపర్లో కన్పిస్తాయి. సరిగ్గా ఈ పాయింట్‌ను బేస్‌చేసుకుని దర్శకుడు రాసుకున్న కథగా అనిపిస్తుంది.

ఏదిఏమైనా సామాన్య ప్రేక్షకుడ్ని ఎలా ఎంటర్‌టైన్ చేయాలనే కాన్సెప్ట్‌తో దర్శకుడు చేసిన ప్రయత్నం ఫలించింది.

సినిమాటోగ్రఫర్ సాయి శ్రీరామ్ తన కెమెరా పనితనంతో చిత్రాన్ని అందంగా తయారు చేశాడు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ బాగుంది. సంగీత దర్శకుడు మహతి స్వర సాగర్ సంగీతం బాగుంది. ముఖ్యంగా 'చూసి చూడంగానే నచ్చేశావే' పాట కొన్నిరోజుల పాటు గుర్తుండిపోతుంది. ఉష మల్పూరి ఎక్కడా రాజీ పండకుండా పాటించిన నిర్మాణ విలువలు సినిమా స్థాయిని పెంచాయి.

– మురళీ పెండ్యాల



విభిన్న జాతుల సమూహం.. ఆకాశ హర్మ్యాలు.. మిరుమిట్లుగొలిపే షాపింగ్‌మాల్స్‌.. నోరూరించే వంటకాలు.. ఇవన్నీ కౌలాలంపూర్‌లోని కొన్ని ప్రత్యేకతలు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌ని ఒక అద్భుతమైన నగరంగా ప్రపంచ పర్యాటకులు అభివర్ణిస్తుంటారు. అడుగడుగునా అనేక ప్రత్యేకతలు గల కౌలాలంపూర్ గురించి మరిన్ని విశేషాలు ఈ వారం 'జర్నీ'..



కనులవిందు కౌలాలంపూర్

ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు నిలయమైన కౌలాలంపూర్ 1881కి ముందు అగ్ని ప్రమాదాలకు, వరదలకు ఎక్కువగా గురవుతుండేది. ఆ సమయంలో అధికారంలో ఉన్న మూడవ కౌలాలంపూర్ చైనీస్ రాజు కాపిటన్ యాప్‌లోయ్ కౌలాలంపూర్‌ను ఆధునిక నగరంగా తీర్చిదిద్దడం ప్రారంభించాడు. అలా కాలక్రమేణా విశాలమైన రోడ్లు, అద్దాల మేడలు, అధికార కార్యాలయాలు వగైరాలతో ఓ అద్భుత నగరంగా అది మారిపోయింది. నేడు కౌలాలంపూర్ నగరాన్ని చూడటానికి రెండు కళ్లు సరిపోవనే చెప్పొచ్చు. అక్కడ అడుగుపెట్టింది మొదలు.. ప్రతిక్షణం మరచిపోలేని అనుభూతులను పరిచయం చేస్తుంది.

అందరూ ఒక్కటిగా!

కౌలాలంపూర్ వివిధ మతాలకు, సంస్కృతీ సంప్రదాయాలకు పుట్టినిల్లుగా నిలుస్తుంది. చైనీయులు, భారతీయ హిందువులు – ముస్లింలు, అమెరికన్లు, యూరోపియన్లు, మధ్యప్రాచ్యానికి చెందినవారు ఇలా అందరూ ఇక్కడ కనిపిస్తారు. ఓరంగ్ అసలీ ఆదిమతెగలు మరో ప్రత్యేకం. ప్రపంచంలోని వివిధ జాతుల వారు ఇక్కడ కలిసి జీవిస్తుంటారు. వీరందరూ వారి వారి భాష, ఆహారపు అలవాట్లు, సంస్కృతీ సంప్రదాయాలను పోషించుకుంటూ సొంత ముద్రను వేసుకున్నారు. హిందూ దేవాలయాలు, మసీదులు, చైనీస్ ఆలయాలు ఎక్కడపడితే అక్కడ కాకుండా నిర్దేశించిన ప్రదేశాలలోనే ఉంటాయి. ఎంతో వైవిధ్యం కలిగిన జనాలతో ఒక మ్యూజియంలా కౌలాలంపూర్ విరాజిల్లుతూ ఉంటుంది.

అద్భుతమైన కట్టడాలు



ఆకాశాన్నంటే కట్టడాలకు పెట్టింది పేరు కౌలాలంపూర్. ఒకప్పుడు అంతా అడవి. అక్కడక్కడా విసిరేసినట్లు జనం ఉండేవారు. కానీ నేడు లక్షల జనాభాతో కళకళలాడుతూ కనిపిస్తుంది ఈ నగరం. ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ పెట్రోనాస్ ట్విన్ టవర్స్. 88 అంతస్థులతో 451.9 మీటర్ల ఎత్తుగల ఈ జంట భవనం ప్రపంచంలోనే ఎత్తయిన భవనాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. మరొక అద్భుతం, దేవాలయాల వరుసలో ఉన్న ఎత్తయిన కుమారస్వామి విగ్రహం. ఇది ఉన్న ప్రదేశాన్నే 'బతు కేవ్స్' అంటారు. ఇది సున్నపురాయితో ఏర్పడిన కొండ. ఈ కొండమీద ఎన్నో గుహలు, ఆలయాలు ఉన్నాయి. దీన్ని సినిమాల్లోనూ చూపిస్తుంటారు. ఎంతో అద్భుతమైన ఈ రెండు ఆకర్షణలు నగరానికే వన్నె తెచ్చాయి. ఆకాశాన్ని అంటే అనేక అంతస్థుల భవనాలు, అద్దాల మేడలలో షాపింగ్‌మాల్స్, ఫుడ్‌కోర్టులు.. ఇవన్నీ మనల్ని కొత్తప్రపంచంలోకి తీసుకువెళతాయి. 21వ శతాబ్దపు సంపన్నమైన, వైవిధ్యవంతమైన నగరంగా కౌలాలంపూర్ అభివృద్ధి చెందింది. శిల్పకళ, రుచులు, అభిరుచుల కలయికే ఈ మహానగరం. ప్రకాశవంతమైన రంగులు, తీరైన ఆకృతి కలిగిన చెక్కమలయ్ ఇళ్లు, ఖాళీ స్థలాలలో అభిరుచులను బట్టి ఆసక్తికరంగా కట్టుకున్న దేవాలయాలు, మసీదులు, చర్చిలు కనబడతాయి.



కట్టిపడేసే షాపింగ్‌మాల్స్

కౌలాలంపూర్‌లోని షాపులు చూపరులను కట్టిపడేస్తాయి. ఆధునిక దుస్తులు, కెమేరాలు, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సౌందర్య ఉత్పత్తులు, ఆభరణాలు.. అన్నీ ఒకదానితో ఒకటి పోటీ పడుతూ, ఏం కొనాలో తేల్చుకోలేని పరిస్థితిని కల్పిస్తాయి. కనిపించినవన్నీ కొనుక్కోవాలంటే జేబులకు చిల్లులుపడటం మాత్రం ఖాయం. ఎంతో ఆకర్షణీయమైన షాపింగ్‌మాల్స్‌లో నకిలీ లేబుల్ వస్తువులూ ఉంటాయి. సాయంత్రం అయితే చాలు ఇక్కడి వీధులు మిరమిట్లుగొలిపే వర్ణకాంతుల వెలుగులతో మెరిసిపోతాయి. నిత్యం పర్యాటకులతో రద్దీగా ఉంటాయి నగరవీధులు.



భిన్న రుచుల సమ్మేళనం

కౌలాలంపూర్‌లో అడుగడుగునా భారతీయ, యూరప్, అస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన వ్యాపారులు కనబడతారు. ఇలాంటి విభిన్న జనాలకు తృప్తిగా, రుచికరంగా తినిపించే రెస్టారెంట్లు కనిపిస్తాయి. కొన్నిచోట్ల రోడ్డు మీదే కమ్మకమ్మని వంటకాలు ఆవురావురుమంటూ తినేవారూ కనిపిస్తారు. చివరికి మన ఇడ్లీ, దోసెలు కూడా ఇక్కడ దొరుకుతాయి. రైస్ భేష్... ఇండోనేషియా, మలేషియా వంటకం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. చైనా, పోర్చుగీస్, ఇండియాలకు పాకశాస్త్ర నిపుణులు, కలినరీ కాన్సెప్ట్‌లో వివిధరకాల దినుసులను, పదార్థాలను కలపడం ఈ దేశస్థులే పరిచయం చేశారు. ఈ రెండు దేశాలనూ సరికొత్త ఆహారానికి మారుపేరుగా చెప్పుకుంటారు. ఇక్కడ ధాన్యం సమృద్ధిగా లభిస్తుంది. మిర్చి పంటలు ఎక్కువ. అందుకే, మన రుచికి ఇక్కడి వంటకాలు ఏమాత్రం తేడా అనిపించవు. అలాగే చైనా రైస్ నూడిల్స్ గురించి కూడా చెప్పుకోవాలి. రెండు చెక్కపుల్లల సాయంతో భోజనం చేసే నేర్పు చైనీయుల సొంతం. చైనా 'యిన్ యాన్' సాంస్కృతిక అంశాలు వీరి పాత్రలలో ఘుమఘుమ లాడుతుంటాయి. కూరగాయలు, పండ్లు, మాంసం వంటివి అతి శీతల కౌంటర్లలో కొనుగోలు చేస్తారు. ఇక చైనా నదీ తీరాలలో పండిన ధాన్యపు పంటతో ఫ్రైడ్‌రైస్, నూడిల్స్ తయారుచేస్తారు. ఇదే వీరి ప్రధాన ఆహారం. వీటితోనే వందల రకాల రుచులతో తయారుచేస్తారు. మొత్తం మీద కౌలాలంపూర్ విభిన్న రుచులు, ఆహారపు అలవాట్ల సమ్మేళనం. రోడ్ల మీద విందులే కాదు. కనువిందులూ ఎదురవుతుంటాయి. ముకాభినయ కళాకారులు, బ్రేక్ డ్యాన్సర్లు, గిటారిస్టులు ఉచిత వినోదాన్ని అందిస్తూ అలరిస్తూ ఉంటారు. కౌలాలంపూర్ సందర్శనం జీవితంలో ఒక కమనీయమైన అనుభవం.

సేకరణ : చందు

'జర్నీ'కి ఆహ్వానం



మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.

మా చిరునామా
జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



నీడను కనుక్కోండి!



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని జంతువులు, వాటి నీడలు ఉన్నాయి. వాటిలో ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

పొడుపు కథ

నిలుచుండే నిద్రిస్తాయి,
వేగంగా పరుగెడతాయి,
మన జాతీయ ముద్రలో
స్థానం సంపాదించాయి?

ಗುರ್ರಾಲು: ಗುರ್ರಾಲು

జోక్ :

సేల్స్‌మేన్ : సార్ ఈ కంప్యూటర్ మీ పనిని 50 శాతం తగ్గిస్తుంది.
చింటు : అయితే రెండు కొనేయి నాన్నా, అప్పుడు నువ్వు ఆఫీసుకు వెళ్ళే పనుండదు..!

నక్క పర్యావరణ సేవ



పిల్లలూ..! మీకు నక్క గురించి తెలుసా? అమ్మావాళ్లు మనకు కథలు చెప్పేటప్పుడు నక్కలా ఎప్పుడూ ఉండకూడదు అని చెబుతుంటారు. ఎందుకో తెలుసా? నక్కకు జిత్తులమారి తెలివితేటలు ఉంటాయని. దానికి కావలసిన ఆహారాన్ని సంపాదించుకోడానికి ఇతర జంతువులను మభ్యపెడుతుందట! అయితే నక్కల వల్ల మనకూ కొంత మేలు లేకపోలేదు. అదీ మనం తెలుసుకోవాలి కదా! నక్క అడవిజంతువు. ఇది మాంసాహారి. ఇది కుక్క, తోడేలు జంతువుల కుటుంబమైన కానిడేకు చెందినది. ఇది చూడటానికి అచ్చం కుక్కలాగే ఉంటుంది. కానీ దీని తోక కుచ్చులా ఉంటుంది. ఇది రాత్రివేళలో సంచారం చేస్తూ ఆహారాన్ని సేకరించుకుంటుంది. కుక్క భౌభౌ అని అరుస్తుంది. నక్క గమ్మత్తుగా ఊళ వేస్తుంది. దీనికి అతి తెలివి ఎక్కువ కాబట్టి ఎక్కువగా కష్టపడదు అంతే. తన జిత్తులమారి





తెలివితో బతికేస్తుంటుంది. ఇది జంతువులను తక్కువగా వేటాడు తుంటుంది. పెద్ద జంతువులు తిని మిగిల్చిన ఆహారంపై ఎక్కువగా ఆధారపడి జీవిస్తుంది. చెప్పాలంటే పిల్లలూ.. ఇది కళేబరాలను తిని, అడవుల పరిసరాలను ఓవిధంగా శుభ్రం చేస్తుంది. అంటే నకరీ విధంగా అడవికే కాదు పర్యావరణం కలుషితం కాకుండా మనకూ మేలు చేస్తోందన్రా! ★

రెండు కొండలను కలిపారు! గిన్నీస్ రికార్డుకెక్కారు!!



చైనాలోని హునాన్ రాష్ట్రంలో నిర్మించిన ఓ వంతెనతో ప్రపంచంలో అద్భుత కట్టడాల నిర్మాణాలలో తమకెవరూ సాటిలేరని మరోసారి నిరూపించింది ఆ దేశం. ఈ విషయంలో ఆకాశపు హద్దులనూ చెరిపేస్తూ వినువీధుల్లోకి దూసుకెళుతోంది. రెండు పర్వతాలను కలుపుతూ ప్రపంచంలోనే అతి పొడవైన, అతి ఎత్తయిన స్టీల్ సస్పెన్షన్ రోడ్డు వంతెనను నిర్మించింది. హునాన్‌లో అత్యధికంగా పర్వతాలు ఉండడంతో ట్రాఫిక్ మందగమనంతో నడుస్తున్న నేపథ్యంలో ఇలాంటి వంతెనలను నిర్మించామని ప్రకటించారు. అంతేకాదు, ఈ వంతెన మీద నుంచి బాటసారులు వెళ్లేందుకూ మార్గం ఏర్పాటు చేశారు. పచ్చటి చెట్లతో కనువిందుచేసే అందమైన డెహాంగ్ క్యాన్‌హాన్ లోయను తిలకిస్తూ, వంతెన మీదుగా వెళ్లవచ్చు. గతేడాది పూర్తయిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు ప్రపంచవ్యాపితంగా మంచి గుర్తింపు పొందింది. ప్రయాణికుల సౌకర్యార్థం వంతెనపై 1888 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీనిని 2007లో ప్రారంభించారు. మొత్తం 3,858 అడుగుల పొడవు, 1,102 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ వంతెన 'గిన్నీస్ వరల్డ్ రికార్డ్స్'లోకి కూడా ఎక్కింది. ఈ వంతెన నిర్మాణానికి 1700 కోట్ల రూపాయలు ఖర్చు అయినట్లు చైనా ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ★



పిల్లల్లారా.. రారండి!!



హాయ్ పిల్లలూ! మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!

చిరునామా
చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

నేనే ముగ్గువేశా!



నా పేరు మనీషా. నేను లిటిల్ బడ్స్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్నా. నేను చదువులో క్లాసు ఫస్ట్. మా స్కూల్లో ఏ చిన్న ఫంక్షన్ జరిగినా స్టేజీమీద డ్యాన్స్ వేస్తాను. మా టీచర్స్ అయితే నా స్నేహితులకు నన్ను చూపించి.. పిల్లలంటే మనీషాలా ఉండాలి. మన స్కూల్లో ఏ చిన్న ఫంక్షన్ జరిగినా తాను ముందుండి కల్చరల్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటుంది. మీరూ అలానే ఉండాలని వారికి చెబుతూ.. నన్ను ఎంతగానో మెచ్చుకుంటారు. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదు నీవు అన్నింటిలోనూ ముందుండాలని అమ్మ ఎప్పుడూ నన్ను ప్రోత్సహిస్తుంటుంది. నేనూ కొత్తకొత్త విషయాలు నేర్చుకోవడంలో ఎంతగానో ఉత్సాహాన్ని చూపుతాను. ఈ మధ్య నూతన సంవత్సరం రోజూ నేనే స్వయంగా మా ఇంటి ముందు ముగ్గువేశా. ఆ ముగ్గు వేయడానికి మా అమ్మ, అక్క నాకు ఎంతో సహాయం చేశారు. చుక్కలు ఎలా పెట్టాలి? ముగ్గు ఎలా వేయాలి? అనేది అమ్మే నాకు నేర్పింది. నేను వేసిన ముగ్గు అమ్మ వేసినంత బాగా రాకపోయినా చూడటానికి ముచ్చటగా అనిపించింది. ఇరుగుపొరుగు వారైతే మొదటిసారే ముగ్గు బాగా వేశావే అంటూ నన్నెంతగానో మెచ్చుకున్నారు. నాకు చాలా సంతోషం అనిపించింది.



ఎల్. మనీషా,
9వ తరగతి,
లిటిల్‌బడ్స్ హైస్కూల్,
విజయవాడ.



రికార్డుల రారాజు...

ఛేజింగ్ కింగ్...

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్) : రికార్డుల రారాజు... ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లి మరో అరుదైన ఘనతను సాధించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో సెంచరీ సాధించడంద్వారా మాజీ సారథి సౌరభ్ గంగూలీ రికార్డును సమం చేశాడు. గతంలో భారత వన్డే క్రికెట్ జట్టుకు గంగూలీ సారథిగా 11 శతకాలు సాధించాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో కోహ్లి 112 పరుగులు చేసి గంగూలీ రికార్డ్‌ను సమం చేశాడు. ఇప్పటివరకూ భారతజట్టు సారథి బాధ్యతలు అందుకున్న ఏ ఆటగాడు ఇన్ని శతకాలు నమోదు చేయలేదు. ఈ సెంచరీతో ఆ ఫీట్‌ను కోహ్లి సమం చేశాడు. కోహ్లి వన్డే కెరీర్‌లో ఇది 33వ శతకం కాగా... సారథిగా 11వది కావడం విశేషం. గంగూలీ 142 ఇన్నింగ్స్‌ల్లో 11 శతకాలు సాధించగా.. కోహ్లి కేవలం 41 ఇన్నింగ్స్‌ల్లోనే ఆ ఘనతను అందుకున్నాడు.

కోహ్లిని సెంచరీల కింగ్ బిరుదే కాకుండా ఛేజ్ మాస్టర్ అంటారన్న విషయం తెలిసిందే. ఎందుకంటే లక్ష్య ఛేదనలో కోహ్లి ఆట తీరు అభిమానులకు కనువిందుగా ఉంటుంది. ముచ్చటైన డ్రైవ్‌లు, ఫ్లిక్స్, కట్ షాట్లతో మైదానం అన్నివైపులా కళ్లు చెదిరే షాట్లతో అలరిస్తాడు. తాజాగా దర్బన్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో కోహ్లి మరోసారి తనదైన షాట్లతో అభిమానులను మంత్ర ముగ్ధుల్ని చేశాడు. ఈ వన్డేలో 112 పరుగుల కెప్టెన్ ఇన్నింగ్స్‌తో కోహ్లి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. మరోసారి లక్ష్య ఛేదనలో తన సత్తా ఏమిటో తన ఇన్నింగ్స్ ద్వారా చాటిచెప్పాడు. వన్డే కెరీర్‌లో 33 శతకాలు నమోదు చేయగా ఇందులో 20 శతకాలు ఛేదనలో సాధించనవే కావడం విశేషం.

కోహ్లి (వన్డేల పరంగా)
అత్యధికం - 183 పరుగుల
మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ - 27
మ్యాన్ ఆఫ్ ది సిరీస్ - 4
ఛేజింగ్ సెంచరీలు - 20

న్యూజిలాండ్‌తో వన్డేలకు బెన్ స్టోక్స్

లండన్ : చాలాకాలం తర్వాత బెన్ స్టోక్స్ క్రికెట్ మైదానంలోకి దిగనున్నాడు. న్యూజిలాండ్‌లో పర్యటించే ఇంగ్లండ్ జట్టులో స్టోక్స్‌కు చోటు లభించింది. ఈ పర్యటనలో ఇంగ్లండ్ జట్టు ఐదు వన్డేల కివీస్‌తో తలపడనుంది. శుక్రవారం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు ప్రకటించిన 15మంది కూడిన జాబితాను ప్రకటించి... సారథ్య బాధ్యతలను మోర్గాన్‌కు అప్పగించింది. కివీస్ పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 25, 28, మార్చి 3,7,10వ తేదీలలో ఇరుజట్లు ఐదు వన్డేల్లో ముఖాముఖి తలపడనున్నాయి.

ఫైనల్‌కు అడిలైట్ స్ట్రిక్కర్స్

బిగ్‌బాష్ లీగ్

అడిలైట్ : బిగ్‌బాష్ లీగ్ ఫైనల్‌లోకి అడిలైడ్ స్ట్రిక్కర్స్ ప్రవేశించింది. శుక్రవారం ఉత్కంఠభరితంగా జరిగిన రెండో సెమీఫైనల్లో ఆ జట్టు ఒక్క పరుగు తేడాతో మెల్‌బోర్న్ రెనెగడ్స్‌ను ఓడించింది. ఈ విజయంతో అడిలైడ్ స్ట్రిక్కర్స్ జట్టు తొలిసారి బిగ్‌బాష్ లీగ్ ఫైనల్లోకి ప్రవేశించింది. తొలిగా బ్యాటింగ్ చేసిన అడిలైట్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేయగా మెల్‌బోర్న్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 177 పరుగులు మాత్రమే చేసింది. హెడ్ సారథ్యంలోని అడిలైట్ జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో బెయిలీ కెప్టెన్సీలోని హోబర్డ్ హరికేన్స్‌తో టైటిల్‌కై తలపడనుంది.

సింధూ సెమీస్‌కు...

సాయిప్రణీత్, కశ్యప్, సైనా నెహ్వాల్ ఔట్

న్యూఢిల్లీ : ఇండియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సెమీఫైనల్లోకి పి.వి. సింధూ ప్రవేశించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో నెంబర్ వన్ సీడ్ పూసర్ల వెంకట సింధూ 21-12, 19-21, 21-11 పాయింట్ల తేడాతో స్పెయిన్‌కు చెందిన 8వ సీడ్ కొర్రాలెస్‌పై గెలిచి సెమీస్‌కు చేరింది. మరో భారతీయ షట్లర్ 4వ సీడ్ సైనా నెహ్వాల్ 10-21, 13-21 పాయింట్ల తేడాతో మలేషియాకు చెందిన బియేవ్ జంగ్ చేతిలో ఓటమిపాలై టోర్నీనుండి నిష్క్రమించింది. పురుషుల విభాగంలో సమీర్ వర్మ 17-21, 14-21 పాయింట్ల తేడాతో మలేషియాకే చెందిన ఇస్కందర్ జుల్కర్నియన్ చేతిలోనూ, 8వ సీడ్ సాయిప్రణీత్ 15-21, 13-21 పాయింట్ల తేడాతో చైనీస్ తైపేకి చెందిన 3వ సీడ్ చౌటెన్‌పై ఓటమిపాల య్యారు. పారుపల్లి కశ్యప్ సైతం చైనాకు చెందిన బిన్ చేతిలో 21-16,



21-18 పాయింట్ల తేడాతో ఓడాడు. భారత్ తరపున మిగిలిన మరో ఆశాకిరణం మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్‌చోప్రా-సిక్కిరెడ్డి జోడీ 21-8, 21-13 పాయింట్ల తేడాతో చైనాకు జోడీపై గెలుపొంది సెమీఫైనల్లోకి ప్రవేశించారు.

అండర్-19 ప్రపంచకప్

చరిత్ర సృష్టిస్తారా

టైటిల్‌కై ఆస్ట్రేలియాతో ఢీ
ఉదయం 6.30 గం॥ల నుంచి

మౌంట్ మౌఘనై (న్యూజిలాండ్) : అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో నేడు భారత యువజట్టు టైటిల్‌కై పటిష్ఠమైన ఆస్ట్రేలియాతో తలపడనుంది. గ్రూప్-బిలో ఆసీస్‌తో జరిగిన తొలిమ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది. ఆ జట్టు ఓపెనర్ ఎడ్వర్డ్‌ను నియంత్రిస్తే భారీ స్కోర్ సాధించే అవకాశం ఉండదు. టీమిండియా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా... అన్ని విభాగాల్లోనూ పటిష్ఠంగా ఉంది.

22 రోజుల పాటుసాగిన యువ ప్రపంచకప్ పోరు నేటి ఫైనల్ మ్యాచ్‌తో ముగియనుంది. ఇప్పటికే మూడుసార్లు ట్రోఫీని గెలచుకున్న టీమిండియా గత టోర్నీలో ఫైనల్లో బోల్తా పడి ఈసారి ఎలాగైనా కప్ కైవసం చేసుకోవాలని పట్టుదలగా ఉంది. కోచ్ రాహుల్ ద్రావిడ్ పర్యవేక్షణలోని భారత్ జట్టు తన జైత్రయాత్రను ఫైనల్లో కూడా కొనసాగించి కప్‌ను సొంతం చేసుకునేందుకు కసరత్తులు చేస్తోంది. 2000లో మొహ్మద్ కైఫ్ సారథ్యంలో తొలిసారి ప్రపంచకప్‌ను ముద్దాడింది... అనంతరం 2008లో విరాట్ కోహ్లి సారథ్యంలో... 2012లో ఉన్ముక్త్ చంద్ కెప్టెన్సీలో భారత్ మరో రెండుసార్లు ప్రపంచకప్‌లను అందుకుంది.

అయితే అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో అత్యధికసార్లు ప్రపంచకప్‌లు గెలిచిన ఘనత భారత్-ఆసీస్‌లది. ఈ రెండు జట్లు తలా మూడేసిసార్లు ప్రపంచకప్‌లను గెలిచి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. ఫలితంగా ఈసారి ఏ జట్టు గెలిచినా కొత్త చరిత్ర లిఖిస్తుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఇరు జట్లు బలంగా ఉండటంతో మెగా పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. భారత బ్యాటింగ్ విభాగంలో సారథి పృథ్వీ షాతో పాటు ఓపెనర్ శుభ్‌మాన్ గిల్‌లు మంచి ఫామ్‌లో ఉన్నారు. మరోకవైపు మన్‌జోత్ కర్లా, అభిషేక్ శర్మలు కూడా బ్యాటింగ్‌లో సత్తా చాటుతున్నారు. ఇక భారత బౌలింగ్ విభాగంలో శివం మావి, కమలేష్ నాగరకోటిలు తమ పేస్ బౌలింగ్‌తో దుమ్మురేపుతున్నారు. ఇక స్పిన్ విభాగంలో అనుకుల్ రాయ్ జట్టు అవసరానికి తగ్గట్టు బౌలింగ్ చేస్తూ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే భారత జట్టే టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుంది. మరి భారత యువ జట్టు వరల్డ్ కప్ గెలిచి కొత్త చరిత్ర సృష్టిస్తుందో లేదో చూడాలి.

అప్రతిహత

విజోరుమీదున్న టీమిండియా యువజట్టు ప్రపంచకప్ టైటిల్ సాధిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. గ్రూప్ దశలో ముఖాముఖి తలపడి ఆసీస్‌ను 100 పరుగుల తేడాతో ఓడించింది. అంతేగాక టీమిండియా జట్టు విజయాలన్నీ భారీ విజయాలే... కోచ్ ద్రావిడ్ పర్యవేక్షణ... పృథ్వీ షా సారథ్యంలోని యువజట్టు టైటిల్ సాధించాలని కోరుకుంటూ...

శుభమన్ గిల్ రికార్డ్...

ఫైనల్ పోరులో ఇద్దరు ఆటగాళ్లపై అందరి దృష్టి ఉంది. టీమిండియా తరపున అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడుతున్న శుభ్‌మన్ గిల్ ఒకడు. మరొకరు ఆస్ట్రేలియా జట్టు లెగ్‌స్పిన్నర్ లాయిడ్ పోప్. గిల్ అండర్-19 ప్రపంచకప్‌లో 170 సగటుతో విజృంభించి రికార్డు పరుగులు సాధిస్తున్నాడు. చివరి నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 113.28 స్ట్రైక్‌రేట్‌తో 341 పరుగులు చేశాడు. అంతేగాక టాప్ స్కోరర్‌గా కూడా నిలిచాడు. రెండు మ్యాచుల్లో అతడు నాటౌట్‌గానే నిలవడం గమనార్హం. ఇక పాక్‌పై ఒకవైపు వికెట్లు పడుతున్నా 94 బంతుల్లోనే 102 పరుగులతో అజేయంగా నిలిచి తనకు తానే సాటి అని నిరూపించుకున్నాడు. మిగతా మ్యాచుల్లో 63, 90(నాటౌట్), 86తో నిలిచాడు. ఆస్ట్రేలియా జట్టులో లెగ్‌స్పిన్నర్ లాయిడ్ పోప్ ఆట ఆసక్తికరం. ఇంగ్లాండ్‌తో క్వార్టర్‌లో ఆసీస్ 127 పరుగులకే పరిమితమైంది. అయితే బౌలింగ్‌లో పోప్ 35 పరుగులిచ్చి 8 వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను 96కు కుప్పకూల్చాడు. టోర్నీలో ఇప్పటి వరకు 11 వికెట్లు తీశాడు. తుదిపోరులో ఇతడి ఆట కీలకం కానుంది.

రెండు జట్లూ సమవుజ్జీలే

అండర్-19 ప్రపంచకప్‌లో భారత్, ఆస్ట్రేలియాలు దాదాపు సమవుజ్జీలే! కాస్త భారత్‌దే పైచేయి అయినప్పటికీ... ఈ రెండు జట్లు తలో మూడు సార్లు ప్రపంచకప్‌లను సొంతం చేసుకున్నాయి. 1988, 2002, 2012లో ఆసీస్ విశ్వవిజేతగా నిలిచిన జట్లలో స్టువర్ట్ లా, జార్జ్ బెయిలీ, షాన్ మార్ష్ వంటి ఆటగాళ్లు ఆ టోర్నీల్లో ఆడారు. భారత్ 2000, 2008, 2012లో టైటిళ్ళు సాధించిన జట్టులో యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లీలు ఆ తర్వాత ప్రపంచ క్రికెట్‌లో తమదైన ముద్రవేసుకున్నారు. 2016లో వెస్టిండీస్ చేతితో తుదిలో ఓడిపోయింది కానీ లేదంటే టీమిండియా అప్పుడే నాలుగోసారి విజేతగా నిలిచేది.



ట్రోఫీతో ఇరు జట్ల కెప్టెన్‌లు

భారతజట్టు : పృథ్వీషా (సారథి), శుభ్‌మన్ గిల్, మన్‌జోత్ కార్లా, హిమాన్షు రాణా, అభిషేక్ వర్మ, రియాన్ పరాగ్, హార్విక్ దేశాయ్, శివమ్ మావి, కమలేశ్ నాగర్ కోటి, ఇషాన్ పోరెల్, అనుకుల్ రాయ్, శివ సింగ్, ఆర్యన్ జుయల్, అర్షదీప్ సింగ్, పంకజ్ యాదవ్

ఆస్ట్రేలియా జట్టు : జేసన్ సంఘా (సారథి), విల్ సుథర్‌లాండ్, జేవియర్ బార్ట్‌లెట్, మ్యాక్స్ బ్రయంత్, జాక్ ఎడ్వర్డ్స్, జాక్ ఇవాన్స్, జరాడ్ ఫ్రీమ్యాన్, రేయాన్ హెడ్లీ, బక్సర్, నేథన్ మ్యాక్ స్వీనీ, జొనాథన్ మెర్లో, లాయిడ్ పోప్, పరమ్ ఉప్పల్, ఆస్టిన్ వా.



సమ్మక్క, సారలమ్మ జాతరకు

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు రావాలి

ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు కేంద్ర ప్రభుత్వ గుర్తింపు రావాల్సిఉందని ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యానాయుడు పేర్కొన్నారు. సమ్మక్క, సారలమ్మలను వెంకయ్యానాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం దర్శించుకున్నారు. దర్శనానంతరం వెంకయ్య నాయుడు మాట్లాడుతూ ఆదివాసీ కుంభమేళ మేడారం జాతరను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరు అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. 1986లోనే మేడారం జాతరను రాష్ట్ర పండుగగా అప్పటి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. వెంకయ్య నాయుడు, కెసిఆర్ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో తులాభారం నిర్వ హించి అంతే బరువున్న బంగారాన్ని (బెల్లం) ఉపరాష్ట్రపతి వెంకయ్య అమ్మవార్లకు సమర్పించారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం పదిగంటల సమయంలో మేడారం వచ్చిన ఆయ నకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద గిరిజన పూజారులు సంప్రదాయ స్వాగతం పలికి లోపలికి ఆహ్వానించారు.

స్వల్ప తొక్కిసలాట..

మొక్కులు సమర్పించుకునేందుకు జనం తీవ్ర ఇక్కట్లు



ఎదుర్కొన్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కెసిఆర్ మొక్కులు సమర్పించుకునే సమయంలో నాలుగైదు గంటలపాటు భక్తుల క్యూ లైన్లను ఎక్కడికక్కడ నిలిపేశారు. ఎండలో గంటలకొద్దీ నిలబడలేక ఇబ్బందిపడ్డారు. ప్రముఖుల దర్శనం అనంతరం సమ్మక్క, సారలమ్మ గద్దెల క్యూ లైన్లను ఒకేసారి వదలడంతో తొక్కిసలాట జరిగింది. ఒక్క సారిగా గద్దెల వైపు తోసుకురావడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు.

ప్రమాణాల్లేని విద్యతో

ఉపయోగం లేదు

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

ప్రమాణాల్లేని విద్యతో సమాజానికి ఎటువంటి ఉపయోగమూ ఉండదని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. గుంటూరులోని జెకెసి కళాశాలలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభ సభకు కె.బసవపున్నయ్య అధ్యక్షత వహించగా తొలిరోజు ముఖ్య అతిథిగా హాజరైన చలమేశ్వర్ మాట్లాడారు. 50 ఏళ్ల కిందట దేశంలో విద్యావసతులు పెద్దగా లేని రోజుల్లో భవిష్యత్ అవసరాలకను గుణంగా ఈ సంస్థను స్థాపించారని చెప్పారు. అనవసరమైన అంశాలపై అతిగా స్పందించి వివాదాలకు దిగుతున్నారని, మేధావులు సైతం అవసరమైన సందర్భాల్లో మౌనంగా ఉంటున్నారని విచారం వ్యక్తంచేశారు. స్పీకర్ కోడెల శివప్రసాదరావు మాట్లాడుతూ.. నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ 50 ఏళ్ల కిందట ప్రారంభమై, 8 విద్యా సంస్థలతో కేజి నుంచి పిజి వరకు విద్యనందించడం అసాధారణ విషయంగా పేర్కొన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను జాస్తి చలమేశ్వర్ సత్కరించారు. కార్యక్రమంలో నరసరావుపేట



స్వర్ణోత్సవాల్లో మాట్లాడుతున్న జస్టిస్ జాస్తి చలమేశ్వర్

ఎంపి రాయపాటి సాంబశివరావు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, ఎం.వేణు గోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, మాజీ ఎంపి యలమంచిలి శివాజీ, ఎఎన్‌యు వైస్ చాన్సలర్ ఎ.రాజేంద్రప్రసాద్, జెకెసి కళాశాల సెక్రటరీ మురళీ మోహన్ పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య రంగాల సిబ్బందికి వేతనాలు పెంచాలి

కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య, ఆరోగ్య శాఖ, సంబంధిత రంగాల్లోనూ పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, 35 క్యాజువల్ లీవులు పునరుద్ధరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, రెగ్యులరైజ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి జెఎసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు శుక్రవారం లేఖ రాశారు. వైద్య, ఆరోగ్య రంగంలో ఏళ్ల తరబడి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, కంటింజెంట్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి నేటికీ వేతనాలు పెంచలేదని తెలిపారు. వీరంతా అసంతృప్తితో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయించిన 50 శాతం వేతన పెంపు వల్ల కొన్ని కేడర్ల ఉద్యోగుల వేతనాలు తక్కువగా పెరిగాయని, కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న జూనియర్ ఉద్యోగుల కంటే సీనియర్ ఉద్యోగులు తక్కువ వేతనాన్ని పొందే పరిస్థితి వైద్య, ఆరోగ్య రంగంలో ఉందని వివరించారు. ఈ పరిస్థితి రాకుండా తగు విధంగా వేతనాలను పెంచాలని కోరారు.

ఎపికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారండి

ఎన్నారై టిడిపి సమావేశంలో లోకేశ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నారైలంతా ఎపికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపు నిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా సియాటిల్‌లో శుక్ర వారం నిర్వహించిన ఎన్‌ఆర్‌ఐ టిడిపి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ఐటి రంగ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, ఫ్రాంక్లిన్, జోహో వంటి కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని లోకేశ్ వారికి తెలిపారు. ఎన్‌ఆర్‌ఐలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబోతున్నామని, ఇందుకు అంతా సహకరించాలని కోరారు.

శాంసంగ్, అమెజాన్ కంపెనీల ప్రతినిధులతో భేటీ

అమెజాన్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైకేల్ పంక్, సీనియర్ ప్రాడక్ట్ మేనేజర్ డేవిడ్ రాత్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. క్లౌడ్ సెంటర్ ఏర్పాటులో ఎపిలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. ఇండియాలోని బృందాన్ని ఎపికు పంపిస్తామని, ప్రభుత్వంతో భాగస్వామ్యమై ఎపిలో కార్యక్రమాలు చేపడతామని, క్లౌడ్ సెంటర్, ఫుల్ ఫిల్‌మెంట్ సెంటర్ ఏర్పాటుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మైకేల్ హామీ ఇచ్చారు. శాంసంగ్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్ కాల్ రామన్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. ఎపిలో ఉన్న రాయితీ పాలసీల గురించి వివరించారు. తాను చంద్రబాబుకి పెద్ద ఫ్యాన్ అని, బాబు ఆలోచనల్ని, విజన్‌ను బలంగా నమ్ముతానని రామన్ తెలిపారు. ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎపిలో పాఠశాల నిర్మిస్తామని, వెయ్యి మంది పేద విద్యార్థులను దత్తత తీసుకుంటామని రామన్ హామీ ఇచ్చారు. అనంతరం వాషింగ్టన్ స్టేట్ ఇండియా టేడ్ రిలేషన్స్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎపి బిజినెస్ రౌండ్ టేబుల్‌లో లోకేశ్ పాల్గొన్నారు. ఎపికు రావాలని కమిటీని ఆహ్వానించారు. త్వరలోనే రాష్ట్రానికి వస్తా మని, ఎపి-వాషింగ్టన్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత పెరిగేలా చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. తొలుత బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ నిక ఆస్టిన్‌తో భేటీ అయి డిజిటల్ వ్యవసాయంపై చర్చించారు. ప్రతి ఇంటికీ ఆర్‌ఎఫ్‌ఐడి కార్డు ఏర్పాటు చేసి చెత్తను సేకరించబోతున్నామని, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో సహకారం కావాలని కోరారు.

నంది నాటకోత్సవాలు రంగస్థలానికి వరం

ప్రారంభ సభలో తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టెలివిజన్ ,నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వ ర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నంది నాటకోత్సవాలు-2017ను స్థానిక ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రారంభిం చారు. 1996 నుండి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు నాటక రంగానికి వరంగా పేర్కొ న్నారు. గతేడాది 250 దరఖాస్తులొస్తే ఈ ఏడాది 360 దరఖాస్తులొచ్చాయని, దరఖాస్తుల పెరుగుదల నాటక రంగ అభివృద్ధికి చిహ్నామని అన్నారు. 37 రోజుల పాటు 184 నాటిక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు. అనంతరం రాష్ట్ర నాటక రంగ అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మున్సిపల్ చైర్మన్ పెండేల వెంకట్రావు, రాష్ట్ర కృష్ణబలిజ, పూసల ఫెడరేషన్ ఛైర్మన్ కావేటి సామ్రాజ్యం మాట్లాడారు. సినీ నటులు నాయుడు గోపి, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు షేక్ జానీబాషా పాల్గొన్నారు. అనంతరం విజయవాడ వారి 'నేను ఏడుస్తున్నా-మీరు నవ్వుకోండి' గుంటూరు వారి 'మనిషి పారిపోయాడు' బాపట్ల వారి 'చిరు దీపాలు' చెరుకుపల్లి వారి 'బడితోనే భవిత భద్రం' తెనాలి 'వైకుంఠం' నాటికలను ప్రదర్శించారు. నాటక ప్రదర్శనలో పాల్గొన్న బాలల సమాజానికి హౌసింగ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ వర్ల రామయ్య పారితోషికాలు అందించారు.



గుంటూరు జిల్లా తెనాలిలో ప్రదర్శించిన 'నేను ఏడుస్తున్నా మీరు నవ్వుకోండి' నాటికలో సన్నివేశం

ఎంపీలు తక్షణమే రాజీనామా చేయాలి : రఘువీరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో అధికార, ప్రతిపక్షాలు రెండూ పూర్తిగా విఫలమయ్యాయని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. రెండు పార్టీలు తమ చిత్తశుద్ధిని, నిజాయితీని నిరూపించుకోవాలంటే తక్షణమే ఎంపీలంతా రాజీనామా చేసి, హక్కుల కోసం పోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. మోడీ ప్రభుత్వం గత నాలుగు బడ్జెట్ల వైఫల్యాలు... ప్రస్తుత బడ్జెట్ ద్వారానే నిరూపితమయ్యాయన్నారు. లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేయకుండా, నిర్దిష్ట కాలపరిమితితో ఉద్యోగాలు ఉంటాయని జైట్లీ ప్రకటించడం ద్వారా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిని ప్రవేశపెడతామని చెప్పకనే చెప్పినట్లైందన్నారు. కేవలం 8 రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు జరిపినట్లుగా అర్థమవుతుందని విమర్శించారు. వ్యవసాయంలో స్వామి నాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తున్నామని చెప్పడం కూడా హాస్యాస్పదంగా ఉందన్నారు. వరికి యూపీఏ మద్దతు ధరను రూ.1360కి తీసుకొస్తే...నాలుగేళ్లలో ఎన్డీయే ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కేవలం రూ.190 అని పేర్కొన్నారు.

మట్టి-నీరు ఇచ్చినప్పుడే మేల్కోండన్నాం..

రాజధాని శంకుస్థాపన సమయంలో ప్రధాని మట్టి-నీరు ఇచ్చినప్పుడే, మేల్కోండని చెబితే వినలేదని రఘువీరా ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటంలో బిజెపి, టిడిపి, వైసిపి కూడా నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కనీసం రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికల్లోనైనా షరతులు పెట్టాలని కోరినా...పెడచెవిన పెట్టారన్నారు.



3 నుంచి మంత్రి అమరనాథరెడ్డి బృందం విదేశాల పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరిశ్రమల శాఖ మంత్రి ఎన్ అమరనాథ రెడ్డి ఈ నెల మూడు నుంచి పదో తేదీ వరకు విదేశీ పర్యటనకు వెళ్లనున్నట్లు మంత్రి కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నం వేదికగా 24, 25, 26 తేదీల్లో సిఐఐ భాగస్వామ్య ఒప్పంద సదస్సు (పార్టనర్‌షిప్ సమ్మిట్) జరుగుతున్న నేపథ్యంలో అభివృద్ధి చెందిన దేశాల్లో మంత్రి పర్యటించి రోడ్ షోలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. యుకె, జర్మనీ, స్వీడన్ దేశాలల్లోని పలువురు పారిశ్రామిక వేత్తలను కలిసి ఎపిలో పరిశ్రలమ ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న పాలసీలను వివరించడంతో పాటు విశాఖలో జరిగే భాగస్వామ్య ఒప్పంద సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించనున్నట్లు తెలిపింది. మంత్రితో పాటు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఆర్ ప్రీతమ్ రెడ్డి, పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్, ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడిబి) అధికారులు వెళ్లనున్నట్లు పేర్కొంది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68